'రాజ్య సంస్కరణ' ఈ-పేపర్ కోసం ఇక్కడ స్కాన్ చేయండి..

# రాజ్య సంస్కరణ

TGBIL/26/A6717 RAJYA SAMSKARANA తెలుగు దినపత్రిక

www.rajyasamskarana.com

'రాజ్య సంస్కరణ' ఈ-పేపర్ కోసం ఇక్కడ స్కాన్ చేయండి..

మేడ్చల్ మల్కాజిగిరి | సంపుటి : 1 | సంచిక : 16 | ఆదివారం | 30.08.2026 | పేజీలు : 8 | వెల రూ. 2

Medchal Malkajgiri | Volume: 1 | Issue: 16 | Sunday | 30.08.2026 | Pages: 8 | Rate: 2



## తక్కువ తాగుతున్నా.. ఖరీదైనదే కొంటున్నారు!

**మద్యం మార్కెట్‌కు బంగారు కస్టమర్.. జన్‌జెడ్**

జెన్‌జెడ్ తాగుడు స్టైల్ పూర్తిగా మారిపోయింది. ఒకప్పుడు పార్టీ అంటే వరుస పెగ్గులు అనుకునే యువత, ఇప్పుడు ఆరోగ్యం, డబ్బు, మెంటల్ హెల్త్ కారణాలతో మద్యం వినియోగాన్ని తగ్గిస్తోంది. కొందరు నెలల తరబడి మందుకు దూరంగా ఉంటుండగా, పార్టీల్లో నాన్‌ఆల్కహాలిక్ డ్రింక్స్‌కు కూడా ప్రాధాన్యం ఇస్తున్నారు.




## హల్ద్వానీ 'శుద్ధీకరణ'పై రాహుల్ ఫైర్

**ఖర్గే అవమానంపై ఎఫ్ఐఆర్ చేయాలి**

ఉత్తరాఖండ్‌లోని హల్ద్వానీ రామలీలా మైదానంలో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే సభ తర్వాత జరిగినట్టు చెబుతున్న 'శుద్ధీకరణ' కార్యక్రమం రాజకీయ దుమారం రేపుతోంది. ఆగస్టు 8న ఖర్గే అక్కడ కాంగ్రెస్ సభలో ప్రసంగించగా.. రెండు రోజుల తర్వాత ఆ ప్రదేశంలో శుద్ధీకరణ కార్యక్రమం నిర్వహించినట్టు కాంగ్రెస్ ఆరోపిస్తోంది. ఈ వ్యవహారంపై లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ తీవ్రంగా స్పందించారు. (వివరాలు 3లో..)



## హైదరాబాద్ మెట్రోలో టెక్నికల్ షాక్

**స్కానర్లు పనిచేయక ప్రయాణికుల అవస్థలు**

**ఎంట్రీ, ఎగ్జిట్ గేట్ల వద్ద అంతరాయం**

హైదరాబాద్ మెట్రో ప్రయాణికులకు శనివారం సాంకేతిక సమస్య ఇబ్బందులు తెచ్చిపెట్టింది. నగరంలోని పలు మెట్రో స్టేషన్లలో ఎంట్రీ, ఎగ్జిట్ గేట్ల వద్ద ఉన్న స్కానర్లు అకస్మాత్తుగా పనిచేయకపోవడంతో ప్రయాణికులు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. ముఖ్యంగా క్యూఆర్ కోడ్ ఆధారిత టికెట్లు, ఆన్‌లైన్ సేవలను ఉపయోగిస్తున్న వారికి ఇబ్బంది ఎక్కువైంది. స్టేషన్‌లోకి ప్రవేశించేందుకు క్యూఆర్ కోడ్ స్కాన్ చేయాల్సి ఉండగా.. స్కానర్లు స్పందించకపోవడంతో ప్రయాణికులు గేట్ల వద్దే నిలిచిపోయారు. (వివరాలు 3లో..)




## వైరల్ వీడియో కలకలం.. మజ్లిస్ నేతపై వేటు

**బేగ్ బహిష్కరణపై బీజేపీ సంచలన డిమాండ్**

హైదరాబాద్ రాజకీయాల్లో ఎంఐఎం ఎమ్మెల్సీ మిర్జా రహ్మత్ బేగ్ వ్యవహారం సంచలనంగా మారింది. మిర్జా రహ్మత్ బేగ్‌ను పార్టీ నుంచి తక్షణమే బహిష్కరించిన ఎంఐఎం.. ఎమ్మెల్సీ పదవికి కూడా వెంటనే రాజీనామా చేయాలని ఆదేశించింది. అయితే ఈ నిర్ణయానికి అసలు కారణాన్ని పార్టీ అధికారికంగా వెల్లడించలేదు. మరోవైపు బేగ్ సైబర్ క్రైమ్ పోలీసులను ఆశ్రయించి.. తనపై డీప్‌ఫేక్ వీడియోలు, మార్ఫింగ్ ఫొటోలు ప్రచారం చేస్తామంటూ కొందరు బెదిరిస్తున్నారని ఫిర్యాదు చేసినట్టు సమాచారం. (3లో..)



6లో..

## వయ్యారి భామా.. నీ హంస నడక

## వెళ్లిపో కుర్రాళ్ల కంట పడక

**చూపు ఆగిన చోటా.. మనసు నిలిచిన చోటా..**

**ఊహ ఊయలూగిన చోటా.. ప్రేమ ఊపిరి పోసుకున్న చోటా..**

అందం ఎక్కడుంది? అనే ప్రశ్నకు సమాధానం కోసం మనిషి శతాబ్దాలుగా వెతుకుతూనే ఉన్నాడు. పూలలో, వెన్నెలలో, శిల్పాల్లో, ముఖాల్లో, వస్త్రాల్లో అందాన్ని చూసినా.. అసలు అందం ఏదో ఒక రూపంలో బంధించలేనిదే. అది కంటికి కనిపించే రూపం కంటే, మనసుకు కలిగే అనుభూతి. ఒక చూపు మరో చూపును తాకినప్పుడు పుట్టే స్పందనలో, ఒక మాటలో దొరికే ఆత్మీయతలో, ఒక చిరునవ్వులో కనిపించే సహజత్వంలో, మన బలహీనతను అర్థం చేసుకునే మనిషి సమక్షంలో కలిగే భద్రతలో అందం దాగి ఉంటుంది. యవ్వనంలో రూపం ఆకర్షిస్తే.. వయసు పెరిగేకొద్దీ వ్యక్తిత్వం, ఆలోచన, దయ, గౌరవం, అనుబంధం మన చూపును మార్చేస్తాయి. చీర అందాన్ని సృష్టించదు.. వ్యక్తిత్వాన్ని ఆవిష్కరిస్తుంది. ముఖం ఆకర్షించవచ్చు.. కానీ భావోద్వేగమే గుర్తుండిపోతుంది. శరీర ఆకర్షణ సహజమే అయినా.. అదే సంపూర్ణ అందం కాదు. ఆకర్షణలో కోరిక ఉండొచ్చు; అందులో గౌరవం కూడా ఉండాలి. ప్రేమలో సాన్నిహిత్యం ఉండొచ్చు; దానికి సమ్మతి, నమ్మకం, భద్రత తోడైతేనే అది పరిపూర్ణమవుతుంది. మొదట సాధారణంగా కనిపించిన మనిషే.. అతని మాటల్లోని మంచితనం, నవ్వులోని నిజాయితీ, మన పట్ల చూపే శ్రద్ధ కారణంగా కాలంతో పాటు మరింత అందంగా కనిపించవచ్చు. అంటే మారేది రూపం కాదు.. మన చూపు. చివరికి అందం అద్దంలో కనిపించేది కాదు; ఒక మనిషిని చూసినప్పుడు మనలో పుట్టే మంచి భావం. కంటికి నచ్చేది ఆకర్షణ కావచ్చు.. మనసుకు నచ్చేది అనుబంధం కావచ్చు.. హృదయానికి నచ్చేది ప్రేమ కావచ్చు. కానీ ఒక మనిషిని పూర్తిగా అర్థం చేసుకుని, గౌరవించి, అతని సమక్షంలో మనసుకు ప్రశాంతత కలిగినప్పుడు.. అక్కడే అందం అనే బ్రహ్మ పదార్థం తన అసలు రూపాన్ని చూపిస్తుంది.

# ఓటర్లకు టైమ్ ఇవ్వండి

- ఎస్ఐఆర్ గడువుపై ఈసీకి సీఎం లేఖ
- 92.86 లక్షల ఓటర్లపై రేవంత్ ఆందోళన



తెలంగాణ ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియపై సీఎం రేవంత్ రెడ్డి కీలక అభ్యంతరాలు వ్యక్తం చేశారు. ఓటర్లకు నోటీసులపై స్పందించేందుకు కనీసం 3 నుంచి 4 వారాల సమయం ఇవ్వాలని కేంద్ర ఎన్నికల సంఘాన్ని కోరారు. జూన్ 10నాటికి రాష్ట్రంలో 3.38 కోట్ల మంది ఓటర్లు ఉండగా.. 73.39 లక్షల మంది పేర్లు అబ్సెంట్, షిఫ్టెడ్, డెడ్, డూప్లికేట్ (ఏఎస్ఎస్‌డీ) కేటగిరీలో ఉన్నాయని సీఎం తెలిపారు. డిజిటైజ్ చేసిన 2.65 కోట్ల ఎన్యూమరేషన్ ఫారాల్లో మరో 60.5 లక్షల్లో లోపాలు గుర్తించగా.. 32.36 లక్షల మందికి పాత ఓటర్ల జాబితాతో లింక్ లేదని పేర్కొన్నారు. ఈ రెండు కేటగిరీలు కలిపితే 92.86 లక్షల మంది ఓటర్లకు అదనపు వెరిఫికేషన్ అవసరమవుతోందని రేవంత్ ఈసీ దృష్టికి తీసుకెళ్లారు. (వివరాలు 2లో..)

## ఎస్ఐఆర్ ప్రక్రియలో కఠిన నిబంధనలు

**• వ్యక్తిగతంగానే ఓటర్లకు నోటీసులివ్వండి! • నోటీసులపై సీఈవో సుదర్శన్‌రెడ్డి ఆదేశాలు**

తెలంగాణలో కొనసాగుతున్న ఎస్ఐఆర్ 2026 ప్రక్రియపై రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సీ. సుదర్శన్‌రెడ్డి కీలక ఆదేశాలు జారీ చేశారు. హైదరాబాద్ జీహెచ్ఎంసీ కమిషనర్, జిల్లా ఎన్నికల అధికారులు, ఈఆర్‌ఓలు, ఏఈఆర్‌ఓలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన ఆయన క్లెయిమ్స్, అభ్యంతరాలు, నోటీసుల జారీ, విచారణలపై సమీక్షించారు. ప్రతి ఓటరుకు బీఎల్వోలు నోటీసులను వ్యక్తిగతంగా అందించి, తప్పనిసరిగా రసీదు తీసుకోవాలని ఆదేశించారు. నోటీసు ఇచ్చిన తర్వాత సమాధానం ఇచ్చేందుకు ఉన్న 7 రోజుల గడువును కచ్చితంగా పాటించాలని స్పష్టం చేశారు.




విచారణ తేదీ, సమయం, ప్రాంతాన్ని కనీసం రెండు రోజుల ముందే ఓటర్లకు గుర్తు చేయాలని సూచించారు. నోటీసులపై సమర్పించాల్సిన పత్రాల వివరాలను ప్రజలకు విస్తృతంగా తెలియజేయాలని ఆదేశించారు. కేసుల సంఖ్య ఆధారంగా ఏఈఆర్‌ఓలు, అదనపు ఏఈఆర్‌ఓలతో సమన్వయం చేసుకుని సక్రమమైన విచారణ షెడ్యూల్ రూపొందించాలని సూచించారు. (వివరాలు 2లో..)

## పింఛన్ హామీ ఎక్కడ?

- దివ్యాంగుల పింఛన్లపై బీఆర్ఎస్ సమరశంఖం
- కాంగ్రెస్ హామీలపై హరీశ్‌రావు తీవ్ర ఆగ్రహం

కాంగ్రెస్ ప్రభుత్వం దివ్యాంగులను నిర్లక్ష్యం చేస్తోందని ఆరోపిస్తూ ఎల్బీనగర్‌లో నిర్వహించిన 'సమర శంఖారావం' సభలో బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు తీవ్ర విమర్శలు చేశారు. కేసీఆర్ హయాంలో రూ.500గా ఉన్న దివ్యాంగుల పింఛన్‌ను రూ.4,016కు పెంచామని, పదేళ్లలో దివ్యాంగుల కోసం రూ.10,300 కోట్లు ఖర్చు చేశామని గుర్తు చేశారు. డబుల్ బెడ్‌రూం ఇళ్లలో 5 శాతం రిజర్వేషన్, విద్య, ఉద్యోగాల్లో 4 శాతం రిజర్వేషన్ కల్పించిన ఘనత బీఆర్ఎస్‌దేనన్నారు. కాంగ్రెస్ ఎన్నికల ముందు నెలకు రూ.6 వేల పింఛన్, ఉచిత బస్సు ప్రయాణం, స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు, బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీ వంటి హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిందని, ఇప్పటివరకు వాటిని అమలు చేయలేదని మండిపడ్డారు. రాష్ట్రంలోని 5.11 లక్షల మంది దివ్యాంగులకు హామీ ప్రకారం పింఛన్ ఇవ్వకపోవడంతో ఒక్కొక్కరికి రూ.66 వేల వరకు బకాయి పడిందని ఆరోపించారు.



2లో..



## జీవో 97 వెనక్కి తీసుకోండి..

**విద్యార్థుల భవిష్యత్తే ముఖ్యం**

**స్టూడెంట్స్‌కు అండగా కడియం**

పాలిటెక్నిక్ విద్యను ఇంజినీరింగ్ శాఖ పరిధి నుంచి కార్మిక శాఖ పరిధిలోకి తీసుకురావాలన్న నిర్ణయంపై విద్యార్థుల్లో నెలకొన్న ఆందోళనను పరిగణనలోకి తీసుకుని జీవో 97ను వెంటనే ఉపసంహరించుకోవాలని స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే, మాజీ డిప్యూటీ సీఎం కడియం శ్రీహరి తెలంగాణ ప్రభుత్వాన్ని కోరారు. (వివరాలు 2లో..)

## పటాన్‌చెరువులో 22A భూకంపం!

**లక్ష ఇళ్లపై నిషేధమా.. బీఆర్ఎస్ సమరశంఖం**

**బాధితులకు అండగా ఎమ్మెల్యే గుడెం, హరీశ్‌రావు**

పటాన్‌చెరువు నియోజకవర్గంలో 22A నిషేధిత భూముల బాధితుల సమావేశంలో మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ నేత హరీశ్‌రావు పాల్గొని కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. ఏళ్లుగా ఇళ్లు కట్టుకుని ఉంటున్న సామాన్యుల ఆస్తులను ఒక్కసారిగా 22A జాబితాలో చేర్చడం దారుణమని అన్నారు.

## ఎమ్మెల్యే రాకముందే లక్కీ డ్రా

**• దానం నాగేందర్ అలక.. డ్రాపై ఫైర్ • ప్రొటోకాల్ ఉల్లంఘనపై ఆగ్రహం**



ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ అధికారుల తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బంజారాహిల్స్‌లోని కుమురం భీం ఆదివాసీ భవన్‌లో శనివారం గృహలక్ష్మి పథకం లబ్ధిదారుల ఎంపిక కోసం లక్కీ డ్రా నిర్వహించారు. అయితే తాను కార్యక్రమానికి చేరుకునేలోపే అధికారులు డ్రాను ప్రారంభించడంతో దానం నాగేందర్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. (వివరాలు 2లో..)



2లో..

## మనసు మార్చుకున్న గుత్తా మంత్రి పదవి కోసం కొత్త ఎత్తా?

**• రేవంత్‌కు ఫుల్ సపోర్ట్ • బాల్ ఈజ్ ఇన్ సీఎం కోర్ట్**



2లో..

## అసెంబ్లీ మాటల యుద్ధం వ్యవహారం

**ఎథిక్స్ కమిటీకి బీఆర్ఎస్ ఫిర్యాదు!**

**సీఎం భాషపై చర్చించాలని డిమాండ్**

**కౌశిక్‌రెడ్డి అంశంపై బీఆర్ఎస్ అభ్యంతరం**

తెలంగాణ అసెంబ్లీలో ఎమ్మెల్యేల మాటలు, ప్రవర్తనపై రగిలిన వివాదం ఇప్పుడు ఎథిక్స్ కమిటీ ముందుకు చేరింది. హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి వ్యవహారంపై కమిటీ సమావేశంలో చర్చించిన నేపథ్యంలో బీఆర్ఎస్ నేత వేముల ప్రశాంత్‌రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. కౌశిక్‌రెడ్డిపై వచ్చిన ఫిర్యాదులను చర్చించే ముందు ఆయనకు తన వాదన వినిపించే అవకాశం ఇవ్వాలని కోరినట్టు తెలిపారు.



2లో..

## తలకిందులుగా తపస్సు చేసినా... పొర్లు దండాలు పెట్టినా, వచ్చేది కాంగ్రెస్సే

**మళ్లీ అధికారం హస్తానిదేనన్న పొంగులేటి**



3లో..

## చెట్టు తెచ్చిన చేటు.. రెండు నిండు ప్రాణాలు బౌటు

సూర్యాపేట జిల్లా మేళ్లచెరువు మండలం ఎర్రగడ్డ తండాలో ఒక్క వేపచెట్టు రెండు కుటుంబాల మధ్య పాతికేళ్లుగా చిచ్చు రేపింది. పక్కపక్కనే నివసించే వెంకటేశ్వర్లు, భూక్య సైదా కుటుంబాల మధ్య ఇంటి సరిహద్దులో ఉన్న చెట్టు యాజమాన్యంపై ఎన్నోసార్లు గొడవలు జరిగాయి. ఆకులు రాలినా, కొమ్మ విరిగినా వివాదం మొదలయ్యేది. పెద్దల

# ఓటర్లకు టైమ్ ఇవ్వండి

- ఎస్ఐఆర్ గడువుపై ఈసీకి సీఎం లేఖ
- 92.86 లక్షల ఓటర్లపై రేవంత్ ఆందోళన



### షిఫ్టెడ్ ఓటర్లపైనే పెద్ద సందేహం

ఏఎస్ఎస్డీ జాబితాలోని 73.39 లక్షల మందిలో 45.19 లక్షల మంది 'శాశ్వతంగా తరలిపోయినవారు'గా గుర్తించడం ఆందోళనకరమని రేవంత్ అన్నారు. ఉద్యోగం, ప్రయాణం, ఇతర కారణాలతో ఇంటి వద్ద లేని వారిని శాశ్వతంగా తరలిపోయినవారిగా పరిగణించే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. హైదరాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లాల్లో సమస్య మరింత తీవ్రంగా ఉందన్నారు. ఈ మూడు జిల్లాల్లో రాష్ట్ర ఓటర్లలో మూడో వంతు ఉన్నా.. ఏఎస్ఎస్డీ జాబితాలో 58.6 శాతం, వెరిఫికేషన్ నోటీసుల్లో 41.9 శాతం వాటా ఉందని తెలిపారు. ఆగస్టు 17 నుంచి సెప్టెంబర్ 16 వరకు ఉన్న క్లెయిమ్స్, అభ్యంతరాల గడువును మరో నాలుగు వారాలు పొడిగించాలని కోరారు. లేదంటే అర్హులైన ఓటర్లు ఎన్నికల రోజున పోలింగ్ కేంద్రానికి వెళ్లిన తర్వాత తమ పేరు జాబితాలో లేదని తెలుసుకునే ప్రమాదం ఉందని హెచ్చరించారు.

### బూత్ స్థాయిలో హెల్ప్‌డెస్కులు

ఎస్ఐఆర్‌లో అర్హులైన ఒక్క ఓటరు కూడా మిస్ కాకూడదని రేవంత్ స్పష్టం చేశారు. గ్రామ సభలు, పట్టణ వార్డు సమావేశాలు, వార్డు కమిటీ సమావేశాల్లో డ్రాఫ్ట్ ఓటర్ల జాబితాను బహిరంగంగా చదివించాలని సూచించారు. ప్రతి గ్రామం, మున్సిపల్ వార్డులో కనీసం రెండుసార్లు సమావేశాలు నిర్వహించాలని కోరారు. నోటీసులు అందుకున్న వారికి అవసరమైన పత్రాలు సమర్పించేందుకు మూడు నుంచి నాలుగు వారాల గడువు ఇవ్వాలని చెప్పారు. ముఖ్యంగా రోజువారీ కూలీలు, వలస కార్మికులు, వృద్ధులకు వారం రోజుల గడువు సరిపోదన్నారు. పట్టణ ప్రాంతాల్లో బూత్ స్థాయిలో హెల్ప్‌డెస్కులు ఏర్పాటు చేయాలని సూచించారు. ఏ పత్రాలు చెల్లుబాటు అవుతాయో స్పష్టమైన జాబితా ఇవ్వాలని, అదనపు ఈఆర్ఓలను నియమించాలని కోరారు. హైదరాబాద్‌లో ఒక్కో అసెంబ్లీ నియోజకవర్గానికి 78 వేలకుపైగా నోటీసు కేసులు ఉన్న నేపథ్యంలో వికేంద్రీకృత విచారణ కేంద్రాలు ఏర్పాటు చేయాలని రేవంత్ విజ్ఞప్తి చేశారు.



# ఎస్ఐఆర్ ప్రక్రియలో కఠిన నిబంధనలు

- వ్యక్తిగతంగానే ఓటర్లకు నోటీసులివ్వండి!
- నోటీసులపై సీఈవో సుదర్శన్‌రెడ్డి ఆదేశాలు

తెలంగాణలో కొనసాగుతున్న ఎస్ఐఆర్ 2026 ప్రక్రియపై రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సీ. సుదర్శన్‌రెడ్డి కీలక ఆదేశాలు జారీ చేశారు. హైదరాబాద్ జీహెచ్ఎంసీ కమిషనర్, జిల్లా ఎన్నికల అధికారులు, ఈఆర్ఓలు, ఏఈఆర్ఓలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన ఆయన క్లెయిమ్స్, అభ్యంతరాలు, నోటీసుల జారీ, విచారణలపై సమీక్షించారు. ప్రతి ఓటరుకు బీఎల్వోలు నోటీసులను వ్యక్తిగతంగా అందించి, తప్పనిసరిగా రసీదు తీసుకోవాలని ఆదేశించారు. నోటీసు ఇచ్చిన తర్వాత సమాధానం ఇచ్చేందుకు ఉన్న 7 రోజుల గడువును కచ్చితంగా పాటించాలని స్పష్టం చేశారు. విచారణ తేదీ, సమయం, ప్రాంతాన్ని కనీసం రెండు రోజుల ముందే ఓటర్లకు గుర్తు చేయాలని సూచించారు. నోటీసులపై సమర్పించాల్సిన పత్రాల వివరాలను ప్రజలకు విస్తృతంగా తెలియజేయాలని ఆదేశించారు. కేసుల సంఖ్య ఆధారంగా ఏఈఆర్ఓలు, అదనపు ఏఈఆర్ఓలతో సమన్వయం చేసుకుని సక్రమమైన విచారణ షెడ్యూల్ రూపొందించాలని సూచించారు.

### రాజకీయ పార్టీలకు జాబితాలు

ఎస్ఐఆర్‌లోని నో మ్యాపింగ్, అనామలీస్ కేసుల జాబితాలను రాజకీయ పార్టీలకు అందించాలని సీఈవో ఆదేశించారు. క్లెయిమ్స్, అభ్యంతరాల వివరాలను ప్రతి వారం రాజకీయ పార్టీల సమావేశాల్లో అందుబాటులో ఉంచాలని చెప్పారు. నోటీసుల పంపిణీ, విచారణల నిర్వహణపై అధికారులు కచ్చితమైన పర్యవేక్షణ కొనసాగించాలని సూచించారు. ప్రతి దశలో అనుసరించిన విధానాన్ని పూర్తిగా డాక్యుమెంట్ చేసి, రికార్డులు భద్రపరచాలని స్పష్టం చేశారు. ఎస్ఐఆర్ లక్ష్యం సక్రమంగా నెరవేరాలంటే నిబంధనలను కచ్చితంగా పాటించాల్సిందేనన్నారు. అన్ని జిల్లాల్లో నోటీసుల పంపిణీ, విచారణ షెడ్యూళ్ల తయారీ, కేసుల విభజన పురోగతిని ఆయన సమీక్షించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు సీఈవో డా. వాసం వెంకటేశ్వర్‌రెడ్డి, డిప్యూటీ సీఈవో జీఎస్ చారి, నోడల్ అధికారులు, ప్రాజెక్ట్ మేనేజర్ (ఐటీ) పాల్గొన్నారు.

# హైదరాబాద్ మెట్రోలో టెక్నికల్ షాక్

- స్కానర్లు పనిచేయక ప్రయాణికుల అవస్థలు
- ఎంట్రీ, ఎగ్జిట్ గేట్ల వద్ద అంతరాయం

హైదరాబాద్ మెట్రో ప్రయాణికులకు శనివారం సాంకేతిక సమస్య ఇబ్బందులు తెచ్చిపెట్టింది. నగరంలోని పలు మెట్రో స్టేషన్లలో ఎంట్రీ, ఎగ్జిట్ గేట్ల వద్ద ఉన్న స్కానర్లు అకస్మాత్తుగా పనిచేయకపోవడంతో ప్రయాణికులు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. ముఖ్యంగా క్యూఆర్ కోడ్ ఆధారిత టికెట్లు, ఆన్‌లైన్ సేవలను ఉపయోగిస్తున్న వారికి ఇబ్బంది ఎక్కువైంది. స్టేషన్‌లోకి ప్రవేశించేందుకు క్యూఆర్ కోడ్ స్కాన్ చేయాల్సి ఉండగా.. స్కానర్లు స్పందించకపోవడంతో ప్రయాణికులు గేట్ల వద్దే నిలిచిపోయారు. అలాగే ప్రయాణం ముగించుకుని బయటకు వెళ్లే సమయంలోనూ క్యూఆర్ కోడ్ స్కాన్ కాకపోవడంతో గందరగోళం నెలకొంది. కొద్ది సమయంలోనే గేట్ల వద్ద భారీ క్యూలు ఏర్పడ్డాయి. రోజువారీ ప్రయాణికులు, ఉద్యోగులు, ఇతర పనుల కోసం మెట్రోను ఆశ్రయించిన వారు సమయం వృథా కావడంతో అసహనం వ్యక్తం చేశారు. సాంకేతిక సమస్య కారణంగా సాధారణంగా వేగంగా జరిగే ఎంట్రీ, ఎగ్జిట్ ప్రక్రియ మందగించింది.

### సమస్య పరిష్కారానికి సిబ్బంది చర్యలు

స్కానర్లు పనిచేయకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్న విషయాన్ని గుర్తించిన మెట్రో సిబ్బంది గేట్ల వద్ద పరిస్థితిని చక్కదిద్దేందుకు చర్యలు చేపట్టారు. ప్రయాణికులకు సహాయం చేస్తూ ప్రత్యామ్నాయ మార్గాల్లో సమస్యను పరిష్కరించే ప్రయత్నం చేసినట్లు సమాచారం. సాంకేతిక లోపం ఎంతసేపు కొనసాగింది, ఎన్ని స్టేషన్లలో ప్రభావం పడింది అనే దానిపై స్పష్టమైన అధికారిక సమాచారం ఇంకా వెలువడలేదు. ఈ అంతరాయం కారణంగా క్యూఆర్ టికెట్లపై ఆధారపడే ప్రయాణికులకు ప్రత్యేకంగా ఇబ్బంది ఎదురైంది. సాధారణంగా డిజిటల్ టికెటింగ్ ద్వారా వేగంగా ప్రయాణించే అవకాశం ఉన్నా.. స్కానర్లు నిలిచిపోవడంతో అదే సౌకర్యం ఒక్కసారిగా సమస్యగా మారింది. మెట్రో సిబ్బంది సమస్యను పరిష్కరించే పనిలో నిమగ్నమైనట్లు తెలుస్తోంది. అయితే సాంకేతిక లోపానికి అసలు కారణం ఏమిటి? ఎప్పుడు పూర్తిగా సేవలు సాధారణ స్థితికి వచ్చాయి? అనే వివరాలపై హైదరాబాద్ మెట్రో అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. ప్రయాణికులకు ఇలాంటి అంతరాయాలు పునరావృతం కాకుండా సాంకేతిక వ్యవస్థలను మరింత పటిష్టం చేయాల్సిన అవసరం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

# మనసు మార్చుకున్న గుత్తా మంత్రి పదవి కోసం కొత్త ఎత్తా?



- రేవంత్‌కు ఫుల్ సపోర్ట్
- బాల్ ఈజ్ ఇన్ సీఎం కోర్ట్

శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి చేసిన తాజా వ్యాఖ్యలు తెలంగాణ కాంగ్రెస్‌లో కొత్త చర్చకు తెరలేపాయి. సీఎం రేవంత్‌రెడ్డికి ఆటంకాలు సృష్టించొద్దు.. స్వేచ్ఛగా పనిచేసుకోనివ్వాలి అంటూ ఆయన బహిరంగంగా మద్దతు పలికారు. ప్రభుత్వం, పార్టీలో లీకేజీలు తగ్గించాలని, గ్రూపు తగాదాలను కట్టడి చేయాలని సూచించారు. క్యాబినెట్ పునర్వ్యవస్థీకరణతో కొత్తదనం వస్తుందని కూడా చెప్పారు. చూస్తుంటే గుత్తా మాటల్లో రేవంత్‌పై అభిమానం పొంగిపొర్లుతున్నట్టే కనిపిస్తోంది. కానీ రాజకీయాల్లో మాటల వెనుక మాట ఉండటం సహజమే. అందుకే ఇప్పుడు అసలు ప్రశ్న.. ఇది రేవంత్ కోసం చేస్తున్న రాజకీయ సేవా? లేక రేపటి అవసరాల కోసం వేసిన ముందడుగా?

### జీవిత చరమాంకంలో మంత్రి కల

గుత్తా సుఖేందర్‌రెడ్డి రాజకీయాల్లో సీనియర్. తనకంటే తర్వాత వచ్చిన చాలామంది నేతలు మంత్రులయ్యారు. "ఇంత సీనియారిటీ ఉంది.. ఇంత అనుభవం ఉంది.. అయినా నాకు మంత్రి పదవి ఎందుకు రాలేదు?" అన్న చిన్న అసంతృప్తి మనసులో ఎక్కడో ఉండకపోదు. రాజకీయ జీవితంలో ఒక్కసారైనా మంత్రి పదవి దక్కితే బాగుంటుందన్న చిరకాల కోరిక ఉందనే చర్చ ఎప్పటినుంచో ఉంది. ఇప్పుడు క్యాబినెట్ మార్పు కావాలని గుత్తా చెప్పడం చూస్తే.. ఆ ఆశకు మళ్లీ కాస్త గాలి తగిలినట్టేనా? అనిపిస్తోంది. క్యాబినెట్ పునర్వ్యవస్థీకరణ అంటే కొందరికి మార్పు.. మరికొందరికి అవకాశం. గుత్తా గారి లెక్క ఏ కేటగిరీలో ఉందో కాంగ్రెస్ నేతలకే బాగా తెలుసు!

### అసలు కథ కొడుకు కోసమా?

ఇక్కడ మరో రాజకీయ లెక్క కూడా తెరపైకి వస్తోంది. గుత్తా సుఖేందర్‌రెడ్డి వ్యాఖ్యల్లో కొడుకు రాజకీయ భవిష్యత్తుపై ఆలోచన కూడా ఉందా? అన్న చర్చ మొదలైంది. తన రాజకీయ అనుభవాన్ని ఉపయోగించి కుటుంబానికి తదుపరి రాజకీయ స్పేస్ సిద్ధం చేయాలన్న ఆలోచన ఏ సీనియర్ నేతకైనా ఉండొచ్చు. కొడుకు రాజకీయంగా ఎదగాలంటే అధికార పార్టీతో సాన్నిహిత్యం ఉపయోగపడుతుంది. అందుకే రేవంత్‌రెడ్డికి బహిరంగంగా మద్దతు పలుకుతూ.. ప్రభుత్వం బాగానే పనిచేస్తోందని చెప్పడం వెనుక తన రాజకీయ భవిష్యత్తుతో పాటు కొడుకు పొలిటికల్ కెరీర్ లెక్కలు కూడా ఉన్నాయా? అనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. అయితే ఇది రాజకీయ వర్గాల్లో నడుస్తున్న విశ్లేషణ మాత్రమే. గుత్తా స్వయంగా దీనిపై ఎలాంటి వ్యాఖ్య చేయలేదు.

### పొద్దుతిరుగుడు పువ్వు.. రాజకీయ లెక్క!

ఇదంతా చూస్తుంటే గుత్తా సుఖేందర్‌రెడ్డి రాజకీయ ప్రయాణం కాస్త పొద్దుతిరుగుడు పువ్వులా కనిపిస్తోందని ప్రత్యర్థులు సెటైర్లు వేస్తున్నారు. అధికారంలో ఎవరు ఉంటే అటువైపు సూర్యుడిలా ముఖం తిప్పడం కాదు.. రాజకీయ భవిష్యత్తు ఎటు వెలుగుతుందో ముందుగానే అంచనా వేసుకోవడమంటున్నారు. ఒకవైపు రేవంత్‌కు మద్దతు.. మరోవైపు క్యాబినెట్ మార్పు డిమాండ్.. ఇంకోవైపు తన సీనియారిటీ గుర్తు చేయడం.. మధ్యలో కొడుకు రాజకీయ భవిష్యత్తు! ఇంతకీ గుత్తా టార్గెట్ రేవంత్ ప్రభుత్వానికి బలం చేకూర్చడమా? మంత్రి కుర్చీనా? కొడుకు రాజకీయ ఎదుగుదలా? రాజకీయాల్లో సమాధానం వెంటనే రాదు. కానీ గుత్తా గారి తాజా మాటలు మాత్రం కాంగ్రెస్‌లో కొత్త లెక్కలకు దారి తీస్తున్నాయన్నది మాత్రం నిజం.

# అసెంబ్లీ మాటల యుద్ధం వ్యవహారం

- ఎథిక్స్ కమిటీకి బీఆర్ఎస్ ఫిర్యాదు!
- సీఎం భాషపై చర్చించాలని డిమాండ్
- కౌశిక్‌రెడ్డి అంశంపై బీఆర్ఎస్ అభ్యంతరం



కాంగ్రెస్ సభ్యుల వ్యాఖ్యల ఆధారంగానే కౌశిక్‌రెడ్డి అంశాన్ని కమిటీ అజెండాలో చేర్చడం సరికాదని ప్రశాంత్‌రెడ్డి అభ్యంతరం వ్యక్తం చేశారు. వివాదం జరిగిన రోజున 23 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలతో మాట్లాడించినంత మాత్రాన దాన్ని సభ మొత్తం అభిప్రాయంగా ఎలా పరిగణిస్తారని ప్రశ్నించారు. కమిటీ సమావేశంలో బీఆర్ఎస్ తరఫున తమ వాదనను బలంగా వినిపించామని చెప్పారు. అసెంబ్లీ కార్యకలాపాలకు సంబంధించిన వీడియోలను పరిశీలించిన తర్వాత ఇతర పార్టీల సభ్యులు కూడా తమ అభిప్రాయాలు వెల్లడించారని తెలిపారు.

### సీఎం రేవంత్‌పై ఫిర్యాదు

కౌశిక్‌రెడ్డి వ్యవహారంతో పాటు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అసెంబ్లీలో ఉపయోగించినట్టు ఆరోపిస్తున్న అభ్యంతరకర భాషపై కూడా ఎథిక్స్ కమిటీ చర్చించాలని బీఆర్ఎస్ డిమాండ్ చేసింది. ఈ మేరకు కమిటీకి లిఖితపూర్వక ఫిర్యాదు సమర్పించినట్టు ప్రశాంత్‌రెడ్డి వెల్లడించారు. సీఎం రేవంత్‌రెడ్డితో పాటు మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యేలు దానం నాగేందర్, వీర్లపల్లి శంకర్, మందుల సామేల్‌పై సభలో అనుచిత వ్యాఖ్యలు, ప్రవర్తనకు సంబంధించి ఫిర్యాదు చేసినట్టు తెలిపారు. తమ ఆరోపణలకు ఆధారంగా అసెంబ్లీ వీడియోలను కమిటీకి సమర్పించినట్టు చెప్పారు. కౌశిక్‌రెడ్డిపై ఫిర్యాదులను మాత్రమే కాకుండా.. సభలో ఇతర సభ్యుల ప్రవర్తనపైనా సమానంగా పరిశీలన జరగాలని బీఆర్ఎస్ కోరుతోంది. తమ అభ్యర్థనపై నిర్ణయం తీసుకుంటామని కమిటీ ఛైర్మన్ హామీ ఇచ్చారని ప్రశాంత్‌రెడ్డి తెలిపారు. దీంతో అసెంబ్లీలో చోటుచేసుకున్న మాటల వివాదం రాజకీయ విమర్శలను దాటి ఎథిక్స్ కమిటీ పరిశీలనకు వెళ్లడం ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.

# పటాన్‌చెరువులో 22A భూకంపం!

- లక్ష ఇళ్లపై నిషేధమా.. బీఆర్ఎస్ సమరశంఖం
- బాధితులకు అండగా ఎమ్మెల్యే గూడెం, హరీశ్‌రావు



1980లో లేఅవుట్లు వేసి, దశాబ్దాలుగా నివసిస్తున్న కుటుంబాలకు ఇప్పుడు రిజిస్ట్రేషన్లు, బ్యాంకు రుణాలు, పిల్లల చదువులు, పెళ్లిళ్ల విషయంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. పటాన్‌చెరువు పరిధిలోనే అపార్ట్‌మెంట్లు, గేటెడ్ కమ్యూనిటీలు, వ్యక్తిగత ఇళ్లతో కలిపి దాదాపు లక్ష ఇళ్లు 22A జాబితాలో ఉన్నాయని ఆరోపించారు. గుమ్మడిదల, అమీన్‌పూర్, రామచంద్రాపురం, పటాన్‌చెరువు, జిన్నారం మండలాల్లో కలిపి 50,565 ఎకరాల భూములు నిషేధిత జాబితాలో ఉన్నాయని పేర్కొన్నారు. గతంలో అనుమతులు ఇచ్చి, విద్యుత్, నీటి కనెక్షన్లు ఇచ్చి, ఆస్తి పన్నులు వసూలు చేసిన ప్రభుత్వం ఇప్పుడు అవే ఆస్తులను వివాదాస్పదంగా చూపడం సరికాదన్నారు.

### వారం రోజుల్లో పరిష్కరించాలి

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఆస్తులు కూడా 22A జాబితాలో ఉన్నాయని తాను వెల్లడించిన తర్వాత అవి ఎలా తొలగించబడ్డాయో హరీశ్‌రావు ప్రశ్నించారు. అధికారంలో ఉన్నవారి ఆస్తులు తొలగించి, సామాన్యుల భూములను మాత్రం ఎందుకు అలాగే ఉంచుతున్నారని నిలదీశారు. 22A సమస్యలో 98 శాతం పరిష్కరించామని మంత్రి చెబుతున్నా.. పటాన్‌చెరువులోనే వేల ఎకరాలు, లక్షల ఇళ్లు ఇంకా జాబితాలో ఎందుకున్నాయని ప్రశ్నించారు. బాధితులను కబ్జాదారులుగా చూడొద్దని, సమస్యను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. వారం రోజుల్లోగా భూములు, ఇళ్లను 22A నుంచి బేషరతుగా తొలగించాలని ప్రభుత్వాన్ని కోరారు. లేకపోతే బాధిత రైతులు, ఇళ్ల యజమానులు, స్థానిక ఎమ్మెల్యేలు, బీఆర్ఎస్ నేతలతో కలిసి కలెక్టరేట్ ముట్టడి చేపడతామని హెచ్చరించారు. ప్రజల ఆస్తుల పరిరక్షణ కోసం ఎన్ని కేసులు, ఒత్తిళ్లు వచ్చినా పోరాటం కొనసాగిస్తామని హరీశ్‌రావు స్పష్టం చేశారు.



# పింఛన్ హామీ ఎక్కడ?

- దివ్యాంగుల పింఛన్లపై బీఆర్ఎస్ సమరశంఖం
- కాంగ్రెస్ హామీలపై హరీశ్‌రావు తీవ్ర ఆగ్రహం

### కాంగ్రెస్‌పై పోరాటానికి పిలుపు

దివ్యాంగుల పింఛన్లకు డబ్బులు లేవంటున్న ప్రభుత్వం.. ఇతర కార్యక్రమాలకు వందల కోట్లు ఎలా ఖర్చు చేస్తోందని హరీశ్‌రావు ప్రశ్నించారు. కాంట్రాక్టులు, రియల్ ఎస్టేట్ వ్యవహారాలకు నిధులు ఉంటాయి కానీ దివ్యాంగుల పింఛన్లకు ఎందుకు ఉండవని నిలదీశారు. ప్రభుత్వం అన్ని వర్గాలను మోసం చేసిందని, రైతులు, నిరుద్యోగులు, విద్యార్థులు కూడా తమ సమస్యలపై ఆందోళన చేస్తున్నారని విమర్శించారు. కాంగ్రెస్ మేనిఫెస్టో హామీలనే అమలు చేయాలని తాము కోరుతున్నామని స్పష్టం చేశారు. దివ్యాంగుల సమస్యలపై సెప్టెంబర్ 7 నుంచి జరిగే అసెంబ్లీ సమావేశాల్లో బీఆర్ఎస్ బలమైన గొంతుకగా నిలుస్తుందని ప్రకటించారు. త్వరలో హైదరాబాద్ ఇందిరాపార్క్ వద్ద మహా ధర్నా నిర్వహిస్తామని వెల్లడించారు. కేసీఆర్‌తో చర్చించి బీఆర్ఎస్‌లో ప్రత్యేక దివ్యాంగుల విభాగాన్ని ఏర్పాటు చేసి వారి సమస్యలపై నిరంతరం పోరాడతామని హామీ ఇచ్చారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు.

# తలకిందులుగా తపస్సు చేసినా...

- పొర్లు దండాలు పెట్టినా, వచ్చేది కాంగ్రెస్సే
- మళ్లీ అధికారం హస్తానిదేనన్న పొంగులేటి



"బీఆర్ఎస్ నేతలు తలకిందులుగా తపస్సు చేసినా, పొర్లు దండాలు పెట్టినా మళ్లీ అధికారంలోకి వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే" అన్నారు మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి. ప్రజా సంక్షేమాన్ని తమ ప్రభుత్వం ప్రధాన లక్ష్యంగా పెట్టుకుందని తెలిపారు. ఆడబిడ్డలకు రూ.63 వేల కోట్ల సున్నా వడ్డీ రుణాలు అందించామని, రాష్ట్రవ్యాప్తంగా తొలి విడత ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేశామని చెప్పారు. పేదలకు ఇళ్లు అందిస్తుంటే ప్రతిపక్షాలు ప్రభుత్వంపై విష ప్రచారం చేస్తున్నాయని మండిపడ్డారు. గత పాలకులు రాష్ట్ర అభివృద్ధి కంటే రాష్ట్రాన్ని కొల్లగొట్టడానికే ప్రాధాన్యం ఇచ్చారని విమర్శించారు. బీఆర్ఎస్ చేస్తున్న ఆరోపణలను ప్రజలు విశ్వసించే పరిస్థితి లేదని అన్నారు.

### భూసమస్యలకు శాశ్వత పరిష్కారం

సూర్యాపేట జిల్లా నూతన్‌కల్, మద్దిరాల మండలాల్లో దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న భూసమస్యను తమ ప్రభుత్వం పరిష్కరించిందని పొంగులేటి తెలిపారు. 15 గ్రామాల్లో 1,061 ఎకరాల భూమికి 1,044 మంది రైతులకు పట్టాదారు పాస్‌బుక్కులు అందించామని చెప్పారు. న్యాయబద్ధంగా భూములు కొనుగోలు చేసిన రైతులు ఎన్నో ఏళ్లుగా వాటిని తమ అవసరాలకు వినియోగించుకోలేక ఇబ్బందులు పడ్డారని పేర్కొన్నారు. రైతుల సమస్యను తన దృష్టికి తీసుకురాగానే ఏడాదిలో పరిష్కరిస్తానని హామీ ఇచ్చానని, ఇచ్చిన మాట ప్రకారం రెవెన్యూ అధికారులతో సమగ్ర సర్వే చేయించి పట్టాలు అందించామని తెలిపారు. మరోవైపు 70 రెవెన్యూ గ్రామాల్లో భూసర్వే చేపట్టామని, రాబోయే ఏడాదిన్నరలో ప్రతి అంగుళం భూమిని పరిశీలిస్తామని వెల్లడించారు. ఈ సర్వేతో అక్రమ పట్టాలను గుర్తించే అవకాశం ఉంటుందని చెప్పారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలతోనే ప్రజల మద్దతు తమకు కొనసాగుతుందని, వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ మళ్లీ అధికారంలోకి వస్తుందని మంత్రి స్పష్టం చేశారు.

# జీవో 97 వెనక్కి తీసుకోండి..

- విద్యార్థుల భవిష్యత్తే ముఖ్యం
- స్టూడెంట్స్‌కు అండగా కడియం

శనివారం స్టేషన్ ఘన్‌పూర్ రిజర్వాయర్ నుంచి ఆయకట్టుకు సాగునీటిని విడుదల చేసిన అనంతరం తన కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. పాలిటెక్నిక్ విద్యార్థులు జీవో 97ను వ్యతిరేకిస్తూ ఆందోళన చేస్తున్న విషయాన్ని ప్రస్తావించారు. ఇంజినీరింగ్ శాఖ పరిధిలో కొనసాగుతున్న పాలిటెక్నిక్ విద్యను కార్మిక శాఖకు బదిలీ చేయాలన్న ప్రభుత్వ నిర్ణయంపై విద్యార్థుల్లో భవిష్యత్తుపై ఆందోళన పెరిగిందని తెలిపారు. ప్రభుత్వ ఉద్దేశం మంచిదై ఉండొచ్చని, అయితే విద్యార్థులు మాత్రం ఆ నిర్ణయంతో ఏకీభవించడం లేదని శ్రీహరి పేర్కొన్నారు. విద్యార్థుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోకుండా ముందుకు వెళ్లడం సరికాదన్నారు.

### దేశవ్యాప్తంగా ఉన్న విధానమే కొనసాగాలి

తాను గతంలో విద్యాశాఖ మంత్రిగా పనిచేసిన అనుభవంతో ఈ అంశాన్ని పరిశీలిస్తున్నానని కడియం శ్రీహరి తెలిపారు. దేశవ్యాప్తంగా అమలవుతున్న పాలిటెక్నిక్ విద్యా విధానాన్నే తెలంగాణలో కొనసాగించాలని సూచించారు. విద్యార్థుల చదువు, ఉపాధి అవకాశాలు, భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలని కోరారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రత్యేకంగా విద్యార్థుల ఆందోళనను పరిశీలించి జీవో 97ను వెనక్కి తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం తీసుకునే నిర్ణయం వేలాది మంది పాలిటెక్నిక్ విద్యార్థుల భవిష్యత్తుపై ప్రభావం చూపే అవకాశం ఉన్నందున విద్యార్థుల ప్రయోజనాలకే ప్రాధాన్యం ఇవ్వాలని స్పష్టం చేశారు. ఇప్పటికే విద్యార్థులు జీవో 97పై అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్న నేపథ్యంలో వారి ప్రతినిధులతో ప్రభుత్వం చర్చించాలని సూచించారు. సమస్యను వివాదంగా మార్చకుండా విద్యార్థులకు అనుకూలమైన నిర్ణయం తీసుకోవాలని కోరారు. పాలిటెక్నిక్ విద్య ప్రస్తుత వ్యవస్థలోనే కొనసాగితే విద్యార్థులకు స్పష్టమైన భవిష్యత్తు ఉంటుందని శ్రీహరి అభిప్రాయపడ్డారు. ప్రభుత్వంపై వ్యతిరేకత కోసం కాకుండా విద్యార్థుల భవిష్యత్తు కోసం జీవో 97ను ఉపసంహరించుకోవాలని ఆయన కోరారు.



# ఎమ్మెల్యే రాకముందే లక్కీ డ్రా

- దానం నాగేందర్ అలక.. డ్రాపై ఫైర్
- ప్రొటోకాల్ ఉల్లంఘనపై ఆగ్రహం

ఎమ్మెల్యే కార్యక్రమానికి వస్తున్న విషయం తెలిసినప్పటికీ.. ఆయన కోసం వేచి చూడకుండా డ్రా ఎలా ప్రారంభిస్తారంటూ అధికారులను ప్రశ్నించారు. ప్రొటోకాల్ పాటించాల్సిన అవసరం లేదా? ఎమ్మెల్యే అంటే అధికారులకు భయం లేదా? అంటూ ఆయన తీవ్ర స్వరంతో నిలదీశారు. కార్యక్రమం ప్రారంభంపై తనకు కనీస సమాచారం ఇవ్వకపోవడంపై కూడా అసహనం వ్యక్తం చేసినట్టు తెలిసింది. దీంతో అక్కడ కొద్దిసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది.

### మధ్యలోనే వెళ్లిపోయిన దానం

అధికారుల తీరుపై అసంతృప్తి వ్యక్తం చేసిన దానం నాగేందర్.. కార్యక్రమం మధ్యలోనే అక్కడి నుంచి వెళ్లిపోయారు. ప్రొటోకాల్ ఉల్లంఘించిన అధికారులపై చర్యలు తీసుకునేలా చూస్తానని ఆయన హెచ్చరించారు. ప్రజాప్రతినిధులు పాల్గొనే ప్రభుత్వ కార్యక్రమాల్లో ప్రొటోకాల్ నిబంధనలు పాటించాల్సిన బాధ్యత అధికారులపై ఉంటుందని దానం పేర్కొన్నారు. తన నియోజకవర్గానికి సంబంధించిన ముఖ్యమైన కార్యక్రమంలోనే తనను పక్కన పెట్టినట్టు వ్యవహరించడాన్ని ఆయన తప్పుబట్టారు. లబ్ధిదారుల ఎంపికలో పారదర్శకత కోసం నిర్వహించే లక్కీ డ్రా విషయంలో ఎలాంటి వివాదం లేకుండా అధికార యంత్రాంగం సమన్వయంతో వ్యవహరించాల్సి ఉండగా.. ఎమ్మెల్యే రాకముందే డ్రా ప్రారంభించడం కొత్త రాజకీయ రచ్చకు కారణమైంది. దీంతో కార్యక్రమం కంటే దానం నాగేందర్ అలకే ప్రధాన చర్చగా మారింది. అధికారులపై ఆయన తీసుకోబోయే తదుపరి చర్యలపై ఇప్పుడు ఆసక్తి నెలకొంది.



# లాకర్ కొట్టుకొచ్చింది.. డబ్బు దోచేశారు!

- వరదల్లో కొట్టుకొచ్చిన బ్యాంక్ సొత్తు
- తుపాన్ వేళ మాయమై.. నదిలో ప్రత్యక్షం

నేపాల్‌ను భారీ వరదలు ముంచెత్తుతున్న వేళ ఊహించని నేరం వెలుగులోకి వచ్చింది. రసువా జిల్లా భోటెకోషి ప్రాంతంలో వరద ఉద్ధృతికి ఓ బ్యాంకు సేఫ్ కొట్టుకుపోయింది. వరద నీటిలో మైళ్ల దూరం ప్రయాణించిన ఆ సేఫ్ ధాదింగ్ జిల్లా గల్చి4లోని బెల్‌ఖుఖోలా సమీపంలో త్రిశూలీ నది వద్ద కనిపించింది. సేఫ్‌లో భారీగా నగదు ఉన్నట్లు గుర్తించిన స్థానికులు దానిని పగులగొట్టి డబ్బు తీసుకెళ్లినట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో పోలీసులు వెంటనే రంగంలోకి దిగి దర్యాప్తు మొదలుపెట్టారు.

## రూ.57 లక్షల నగదు స్వాధీనం

పోలీసుల ప్రాథమిక విచారణలో 29 మందిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి 92,68,505 నేపాలీ రూపాయలు స్వాధీనం చేసుకున్నారు. భారత కరెన్సీలో ఈ మొత్తం దాదాపు రూ.57 లక్షలు ఉంటుందని అధికారులు తెలిపారు. పట్టుబడిన వారిలో 19 నుంచి 49 ఏళ్ల మధ్య వయసున్నవారు ఉన్నారు. ఎక్కువ మంది గల్చి4లోని మస్తర్ ప్రాంతానికి చెందినవారు కాగా, కొందరు గల్చి6లోని ఆడమ్‌ఘాట్, సిద్ధలేఖ్7లోని ఆడమ్‌టార్ ప్రాంతాలకు చెందినవారు. మరికొందరు చిత్వన్, పర్సా ప్రాంతాలకు చెందినవారిగా పోలీసులు గుర్తించారు. స్వాధీనం చేసుకున్న నగదు అసలు ఎక్కడి నుంచి వచ్చింది? ఇంకా ఎవరెవరికి ఇందులో సంబంధం ఉంది? అనే కోణాల్లో విచారణ కొనసాగుతోంది.

## మృతదేహాలపైనా దోపిడీ.. విషాదంలో దారుణం

వరదల నేపథ్యంలో నేపాల్‌లో మరో దారుణ ఘటన కూడా బయటపడింది. నారాయణి నదిలో కొట్టుకొచ్చిన వరద బాధితురాలి మృతదేహం నుంచి బంగారు చెవి కమ్మలు తీసుకున్నారనే ఆరోపణలపై ఇద్దరిని పోలీసులు అరెస్టు చేశారు. ఈ ఘటనకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో కేసు నమోదు చేశారు. ఇదిలా ఉండగా, నేపాల్ విపత్తు నిర్వహణ సంస్థ శనివారం తాజా గణాంకాలు విడుదల చేసింది. వరదల్లో మృతుల సంఖ్య 626కు చేరగా.. గల్లంతైన వారి సంఖ్య 2,426కు పెరిగింది. వీరిలో 517 మంది విదేశీయులు ఉన్నట్లు అధికారులు తెలిపారు. మూడు రోజులుగా సహాయక చర్యలు కొనసాగుతున్నా, వరద ప్రాంతాల్లో గల్లంతైన వారి కోసం గాలింపు ఇంకా కొనసాగుతోంది.



# పొంచి ఉన్న మరో ముప్పు

- ఎప్పుడైనా సరస్సు బద్దలు!
- చీకటి రంగులోకి నీరు డేంజర్ బెల్స్

నేపాల్‌ను వరదలు వణికిస్తున్న వేళ చైనా మరోసారి కీలక హెచ్చరిక చేసింది. లెండే నదీ వ్యవస్థ ఎగువ ప్రాంతంలో కొత్తగా ఏర్పడిన సరస్సు ఎప్పుడైనా కట్టలు తెంచుకునే ప్రమాదం ఉందని నేపాల్‌ను అప్రమత్తం చేసింది. ఈ సరస్సు ఈ వారం నేపాల్, టిబెట్ ప్రాంతాల్లో బీభత్సం సృష్టించిన ఆకస్మిక వరదల తర్వాత ఏర్పడింది. సరస్సులోని నీటి రంగు క్రమంగా ముదురు రంగులోకి మారుతోందని చైనా అధికారులు గుర్తించారు. ఇది సరస్సు ఉద్ధృతి పెరిగి ప్రమాదకర స్థితికి చేరుతున్న సంకేతంగా భావిస్తున్నారు. దిగువ ప్రాంతాల్లో నివసించే ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

## తగ్గుతున్న సరస్సు విస్తీర్ణం

అయితే శనివారం నాటికి సరస్సు కట్ట తెగే ముప్పు కొంత తగ్గినట్లు చైనా అధికారులు తెలిపారు. ఉపగ్రహ చిత్రాల ప్రకారం సరస్సు నుంచి నీరు నెమ్మదిగా బయటకు ప్రవహిస్తోంది. దీంతో రిజర్వాయర్ పరిమాణం క్రమంగా తగ్గుతున్నట్లు చైనా వాటర్ రిసోర్సెస్ మంత్రిత్వ శాఖ వెల్లడించింది. శనివారం ఉదయం సరస్సు విస్తీర్ణం 99 వేల చదరపు మీటర్లకు తగ్గింది. గురువారం నమోదైన విస్తీర్ణంతో పోలిస్తే 21 వేల చదరపు మీటర్లు తగ్గినట్లు అధికారులు తెలిపారు. అయినా సరస్సులో నీటి మట్టం పెరుగుతున్నట్లు అంచనా. శుక్రవారం నాటికి సుమారు 25 లక్షల ఘనపు మీటర్ల నీరు చేరినట్లు చైనా తెలిపింది.

## కట్ట తెగితే 500 క్యూబిక్ మీటర్ల ప్రవాహం

హిమనదం కూలిపోవడంతో వచ్చిన భారీ వరదలకు అడ్డంగా పేరుకున్న మట్టి, రాళ్లతో సహజ కట్ట ఏర్పడటంతో ఈ సరస్సు తయారైంది. చోచెన్ నది, నేపాల్ వైపు ప్యూరెపు నది సంగమ ప్రాంతానికి సమీపంలో ఇది ఉంది. సరస్సు కట్టలో కొంత భాగం తెగితే సెకనుకు గరిష్ఠంగా 500 ఘనపు మీటర్ల నీరు నదీ వ్యవస్థలోకి వచ్చే అవకాశం ఉందని చైనా వరద నమూనా అంచనాల్లో వెల్లడించింది. అయితే ఈ ప్రవాహం నది గట్లలోనే ఉండే అవకాశముందని పేర్కొంది. డ్రోన్లు, ఉపగ్రహాలతో పరిస్థితిని చైనా నిశితంగా గమనిస్తోంది. మరోవైపు బుధవారం సంభవించిన ఆకస్మిక వరదల్లో నేపాల్‌లో కనీసం 587 మంది మృతి చెందగా, టిబెట్‌లో ఏడుగురు ప్రాణాలు కోల్పోయారు. తాజా సరస్సు ముప్పుతో నేపాల్‌లో సహాయక చర్యలు కొనసాగుతున్న ప్రాంతాల్లో మరోసారి ఆందోళన నెలకొంది.

# అవినీతి రుజువు.. ముగ్గురు అధికారులపై వేటు




ఏపీ వాణిజ్య పన్నుల శాఖలో అవినీతి వ్యవహారం కలకలం రేపింది. అవినీతి ఆరోపణలు రుజువు కావడంతో ముగ్గురు అధికారులను ప్రభుత్వం సర్వీసు నుంచి డిస్మిస్ చేసింది. అప్పటి డిప్యూటీ అసిస్టెంట్ కమిషనర్ (స్టేట్ టాక్స్) కె.సంధ్య, జీఎస్టీ అధికారి బి.మెహర్ కుమార్, సీనియర్ అసిస్టెంట్ కేవీ చలపతిపై ఈ చర్యలు తీసుకున్నారు. విజయవాడ1 డివిజన్ పరిధిలోని జాయింట్ కమిషనర్ (రాష్ట్ర పన్నులు) కార్యాలయ ఇంటెలిజెన్స్ విభాగంలో పనిచేసిన సమయంలో 2023లో వీరి అవినీతి వ్యవహారం వెలుగులోకి వచ్చింది. అవినీతి ఆరోపణలపై విచారణ అనంతరం ఆరోపణలు రుజువైన నేపథ్యంలో ప్రభుత్వం కఠిన చర్యలకు దిగింది. ముగ్గురినీ ఉద్యోగాల నుంచి తొలగిస్తూ రెవెన్యూ విజిలెన్స్ శాఖ ముఖ్యకార్యదర్శి పీయూష్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. వాణిజ్య పన్నుల శాఖలో విధులు నిర్వహించే అధికారులు నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవనే సంకేతంగా ఈ డిస్మిస్ ఉత్తర్వులు నిలిచాయి. 2023లో వెలుగులోకి వచ్చిన ఈ వ్యవహారంపై కొనసాగిన ప్రక్రియకు తాజాగా ముగింపు పలుకుతూ ప్రభుత్వం ముగ్గురు అధికారులపై సర్వీసు నుంచి తొలగింపు నిర్ణయం తీసుకుంది.

# హల్ద్వానీ 'శుద్ధీకరణ'పై రాహుల్ ఫైర్

- ఖర్గే అవమానంపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలి




ఉత్తరాఖండ్‌లోని హల్ద్వానీ రామలీలా మైదానంలో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే సభ తర్వాత జరిగినట్టు చెబుతున్న 'శుద్ధీకరణ' కార్యక్రమం రాజకీయ దుమారం రేపుతోంది. ఆగస్టు 8న ఖర్గే అక్కడ కాంగ్రెస్ సభలో ప్రసంగించగా.. రెండు రోజుల తర్వాత ఆ ప్రదేశంలో శుద్ధీకరణ కార్యక్రమం నిర్వహించినట్టు కాంగ్రెస్ ఆరోపిస్తోంది. ఈ వ్యవహారంపై లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ తీవ్రంగా స్పందించారు. ఇది అంటరానితనాన్ని ప్రోత్సహించే చర్యగా కనిపిస్తోందని, రాజ్యాంగం ప్రకారం అంటరానితనం నేరమని అన్నారు. బాధ్యులపై వెంటనే ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. దాదాపు 20 రోజులు గడిచినా చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు.

## బీజేపీపై రాజ్యాంగం వర్సెస్ మనుస్మృతి పోరు

హల్ద్వానీ ఘటనను రాహుల్ గాంధీ కేవలం ఒక స్థానిక వివాదంగా చూడలేదు. దళితుల గౌరవం, సమానత్వం, రాజ్యాంగ విలువలపై జరుగుతున్న పెద్ద పోరాటంలో భాగంగా ఈ అంశాన్ని ప్రస్తావించారు. రాజ్యాంగం, మనుస్మృతి చిత్రాలను చూపిస్తూ బీజేపీ-ఆర్ఎస్ఎస్ సిద్ధాంతాలపై విమర్శలు చేశారు. దళితులు ఎదుగుతున్న కొద్దీ వారిపై వివక్ష మరింత తీవ్రంగా మారుతోందని ఆరోపించారు. పాఠశాలల్లో దళిత పిల్లలతో మరుగుదొడ్లు శుభ్రం చేయించడం, ప్రజా ప్రదేశాల్లో వివక్ష, దళిత వరులపై దాడులు వంటి ఘటనలను ప్రస్తావించారు. మరోవైపు ఉత్తరాఖండ్ బీజేపీ అధ్యక్షుడు మహేంద్ర భట్ శుద్ధీకరణ కార్యక్రమాన్ని సమర్థించినట్టు కాంగ్రెస్ ఆరోపిస్తోంది. అయితే బీజేపీ ఇలాంటి కార్యక్రమాలను పార్టీ విధానంగా అంగీకరించదని కేంద్ర మంత్రి జేపీ నడ్డా రాజ్యసభలో స్పష్టం చేసి, ఘటనపై విచారణ జరుగుతుందని తెలిపారు.

## సోనియా పుస్తకంపై ప్రశ్నలకు రాహుల్ దూరం

హల్ద్వానీ వివాదం మధ్య సోనియా గాంధీ జ్ఞాపకాల పుస్తకం 'బిలాంగింగ్' ప్రచురణపై తలెత్తిన వివాదంపై రాహుల్ స్పందించలేదు. పెంగ్విన్ రాండమ్ హౌస్ ఇండియా పుస్తక ప్రచురణ నుంచి తప్పుకున్నట్టు వచ్చిన వార్తలపై ప్రశ్నించగా.. దాన్ని 'డైవర్షన్ స్ట్రాటజీ'గా అభివర్ణించారు. ప్రస్తుతం తన దృష్టి ఖర్గేకు జరిగిన అవమానంపైనే ఉందని స్పష్టం చేశారు. ఇదే సమయంలో ఖర్గే కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశంలో హల్ద్వానీ ఘటనపై తనకు తగిన మద్దతు లభించలేదన్న అసంతృప్తి వ్యక్తం చేసినట్టు వార్తలు వచ్చాయి. అయితే ఖర్గే మొత్తం కాంగ్రెస్‌పై అసంతృప్తి వ్యక్తం చేయలేదని రాహుల్ స్పష్టం చేశారు. హల్ద్వానీ ఘటనపై ఎఫ్ఐఆర్ నమోదు చేసి నిష్పాక్షిక దర్యాప్తు జరపాలన్నదే కాంగ్రెస్ ప్రధాన డిమాండ్‌గా మారింది.

# రచ్చ చేసిన పులస

- పులస కోసం ఎగబడ్డ జనం..
- రేవులో వేలం.. రికార్డు ధర!
- యానాంలో కేజీ 300లు రూ.31,500!



ఉభయ గోదావరి జిల్లాల్లో పులస సీజన్ మొదలయ్యిందంటే చాలు.. రేవుల్లో సందడి మామూలుగా ఉండదు. తాజాగా యానాం రేవులో మత్స్యకారుల వలకు చిక్కిన రెండు పులస చేపలు వేలంలో అదిరిపోయే ధర పలికాయి. మొత్తం 1.3 కిలోల బరువున్న ఈ రెండు చేపలను మత్స్యకార మహిళ పార్వతి ఏకంగా రూ.31,500కు దక్కించుకున్నారు. ఇందులో ఒక చేపకు రూ.24 వేలు, మరో చేపకు రూ.7,500 ధర పలికింది. దీంతో రేవులో ఈ వేలంపాట హాట్ టాపిక్‌గా మారింది.

## దొరకడం తగ్గి.. ధర పెరిగింది

ఈ ఏడాది మగ పులసకు ఇంత భారీ ధర పలకడం ఇదే తొలిసారని స్థానిక మత్స్యకారులు చెబుతున్నారు. నెల రోజుల కిందట 1.250 కిలోల పులస రూ.14 వేలకు అమ్ముడైంది. వాతావరణ మార్పులతో పులసల లభ్యత తగ్గిపోవడం, గోదావరికి వరదలు ఆలస్యంగా రావడంతో చేపలు తక్కువగా వలకు చిక్కుతున్నాయని మత్స్యకారులు అంటున్నారు. సముద్రంలో ఉండే ఇలస గోదావరి ప్రవాహానికి ఎదురీది గుడ్లు పెట్టేందుకు వస్తే పులసగా మారుతుందని చెబుతారు. రుచి కోసం పులసకు గోదావరి జిల్లాల్లోనే కాదు.. పొరుగు రాష్ట్రాల్లోనూ భలే గిరాకీ. అందుకే అరుదు.

# తక్కువ తాగుతున్నా.. ఖరీదైనదే కొంటున్నారు!



- మద్యం మార్కెట్‌కు బంగారు కస్టమర్.. జన్‌జెడ్

**జన్‌జెడ్ తాగుడు స్టైల్ పూర్తిగా మారిపోయింది. ఒకప్పుడు పార్టీ అంటే వరుస పెగ్గులు అనుకునే యువత, ఇప్పుడు ఆరోగ్యం, డబ్బు, మెంటల్ హెల్త్ కారణాలతో మద్యం వినియోగాన్ని తగ్గిస్తోంది. కొందరు నెలల తరబడి మందుకు దూరంగా ఉంటుండగా, పార్టీల్లో నాన్-ఆల్కహాలిక్ డ్రింక్స్‌కు కూడా ప్రాధాన్యం ఇస్తున్నారు. అయితే తాగినప్పుడు మాత్రం చీప్ బ్రాండ్లను ఎంచుకోవడం లేదు. తక్కువసార్లు తాగినా మంచి క్వాలిటీ, ప్రత్యేకమైన రుచి, కొత్త అనుభూతి కావాలని కోరుకుంటున్నారు. అందుకే క్రాఫ్ట్ కాక్‌టెయిల్స్, సింగిల్ మాల్ట్, ఫ్లేవర్డ్ వోడ్కా వంటి ప్రీమియం బ్రాండ్లకు డిమాండ్ పెరుగుతోంది. బ్రాండ్ ప్రతిష్ఠ, తయారీ ప్రదేశం, రుచి, సోషల్ మీడియా ప్రాచుర్యం కూడా కొనుగోలు నిర్ణయాలను ప్రభావితం చేస్తున్నాయి. ఫలితంగా పెగ్గులు తగ్గినా ప్రీమియం మద్యం అమ్మకాలు పెరుగుతున్నాయి. జెన్‌జెడ్ మందు మానలేదు.. చీప్ మందును మాత్రమే మానేసింది. గ్లాస్‌లో పరిమాణం తక్కువైనా, బిల్లులో మొత్తం మాత్రం ఎక్కువగా కనిపిస్తోంది.**

జెన్ జెడ్ యువత మునుపటి తరాలతో పోలిస్తే మద్యం తాగడం తగ్గించింది. ఆరోగ్యంపై అవగాహన, మానసిక ఆరోగ్యం, ఆర్థిక ఒత్తిళ్లు, సోషల్ మీడియా ప్రభావం దీనికి ప్రధాన కారణాలుగా కనిపిస్తున్నాయి. అమెరికా నుంచి బ్రిటన్, భారత్ వరకు ఇదే ధోరణి కనిపిస్తోంది. ముంబై, పుణెల్లో నిర్వహించిన సర్వేల్లోనూ యువతలో 'మైండ్‌ఫుల్ డ్రింకింగ్' పెరిగినట్టు తేలింది. చాలామంది కనీసం నెలరోజులు మద్యం పూర్తిగా మానేసి చూశారు. కొందరు రాత్రంతా మద్యంతోనే ఉండకుండా ఆల్కహాల్ లేని పానీయాలను కూడా కలుపుకుంటున్నారు. వ్యక్తిగతంగా చూస్తే మద్యం వినియోగం తగ్గుతున్నట్టే కనిపిస్తోంది. కానీ ఇదే సమయంలో మద్యం కంపెనీల లాభాలు మాత్రం పెరుగుతున్నాయి.

## చౌక బ్రాండ్ కాదు.. ప్రీమియం వైపు చూపు

ఈ విరుద్ధ ధోరణికి అసలు కారణం 'ప్రీమియమైజేషన్'. యువత తక్కువ సందర్భాల్లో తాగుతున్నా, ఒక్కోసారి మాత్రం ఎక్కువ ధర ఉన్న ఉత్పత్తులను ఎంచుకుంటోంది. రాడికో ఖైతాన్ లాంటి కంపెనీలకు ప్రీమియం ఉత్పత్తుల డిమాండ్ భారీగా పెరిగింది. కంపెనీ లాభం 73 శాతం పెరగడంలో ఖరీదైన ఉత్పత్తులదే కీలక పాత్ర. భారత సింగిల్ మాల్ట్స్ మార్కెట్ 2025లో సుమారు 22 శాతం వృద్ధి చెంది దాదాపు ఐదు లక్షల కేసులకు చేరింది. అందులో దేశీయ బ్రాండ్ల వాటా సుమారు 92 శాతం. వోడ్కా విభాగంలోనూ ఇదే మార్పు కనిపిస్తోంది. ఫ్లేవర్డ్ వోడ్కా వైపు యువత ఆసక్తి పెరిగింది. మ్యాజిక్ మూమెంట్స్ బ్రాండ్ 43 శాతం వార్షిక వృద్ధిని నమోదు చేసింది. వోడ్కా వినియోగంలో ఫ్లేవర్డ్ ఉత్పత్తుల వాటా ఏకంగా 80 శాతానికి చేరినట్టు పరిశ్రమ వర్గాలు చెబుతున్నాయి.

## తక్కువ సందర్భాలు.. పెద్ద బిల్లులు

జెన్‌జెడ్ మద్యం విషయంలో పూర్తిగా దూరం కాలేదు. తాగే విధానాన్ని మార్చుకుంది. అలవాటుగా చౌక మద్యం తీసుకోవడం కంటే, కొత్త రుచులు, క్రాఫ్ట్ కాక్‌టెయిల్స్, సింగిల్ మాల్ట్స్, ప్రత్యేక ఫ్లేవర్లను అనుభవించేందుకు ఖర్చు చేస్తోంది. ఒక బ్రాండ్ ఎక్కడ తయారైంది. దాని రుచి ఏంటి.. దాని వెనుక కథ ఏంటి అనే విషయాలకు ప్రాధాన్యం ఇస్తోంది. డిజిటల్ కంటెంట్, సోషల్ మీడియా కూడా కొనుగోలు నిర్ణయాలను ప్రభావితం చేస్తున్నాయి. అందుకే తక్కువగా తాగినా.. ఒక్కో డ్రింక్‌పై ఎక్కువ ఖర్చు చేసే కొత్త వినియోగదారుడు మద్యం పరిశ్రమకు అత్యంత విలువైన కస్టమర్‌గా మారుతున్నాడు. సింపుల్‌గా చెప్పాలంటే.. జెన్‌జెడ్ చౌక మద్యానికి దూరమవుతోంది. కానీ నాణ్యత, ప్రత్యేకత, అనుభవం ఉన్న ఖరీదైన మద్యానికి మాత్రం డబ్బు పెట్టేందుకు సిద్ధంగా ఉంది.

# చెట్టు తెచ్చిన చేటు.. రెండు నిండు ప్రాణాలు బలి



సూర్యాపేట జిల్లా మేళ్లచెరువు మండలం ఎర్రగడ్డ తండాలో ఒక్క వేపచెట్టు రెండు కుటుంబాల మధ్య పాతికేళ్లుగా చిచ్చు రేపింది. పక్కపక్కనే నివసించే వెంకటేశ్వర్లు, భూక్య సైదా కుటుంబాల మధ్య ఇంటి సరిహద్దులో ఉన్న చెట్టు యాజమాన్యంపై ఎన్నోసార్లు గొడవలు జరిగాయి. ఆకులు రాలినా, కొమ్మ విరిగినా వివాదం మొదలయ్యేది. పెద్దల పంచాయితీలు జరిగినా సమస్యకు పరిష్కారం దొరకలేదు. చివరకు వెంకటేశ్వర్లు ఎవరికీ చెప్పకుండా చెట్టును పూర్తిగా నరికించాలని నిర్ణయించుకున్నారు. కూలీలను పిలిపించి కొమ్మలు నరికించడం మొదలుపెట్టారు. విషయం తెలుసుకున్న సైదా కుమారుడు రాము అక్కడికి చేరుకుని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాడు. చెట్టుతో మొదలైన మాటల యుద్ధం క్షణాల్లోనే గొడ్డలి దాడిగా మారింది. రాము వెంకటేశ్వర్లు తలపై గొడ్డలితో దాడి చేయడంతో ఆయన అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు.

## నేరం దాచేందుకు తండ్రినే చంపాడు

వెంకటేశ్వర్లు హత్యతో పరిస్థితి ఒక్కసారిగా మారిపోయింది. అక్కడికి వచ్చిన సైదా తన కుమారుడిని వారించే ప్రయత్నం చేశాడు. కానీ అప్పటికే రాము ఆలోచన మరో దారిలోకి వెళ్లింది. తాను చేసిన హత్య నుంచి తప్పించుకునేందుకు కన్నతండ్రినే బలిగా చేయాలనే దారుణ నిర్ణయం తీసుకున్నాడు. వెంకటేశ్వర్లు దాడిలో సైదా చనిపోయినట్టు చిత్రీకరించాలనే ఉద్దేశంతో తండ్రిపైనే గొడ్డలితో విచక్షణారహితంగా దాడి చేశాడు. తీవ్ర గాయాలతో సైదా కూడా ప్రాణాలు కోల్పోయాడు. ఒకే కుటుంబానికి చెందిన తండ్రి, కుమారుడి మధ్య ఉండాల్సిన బంధం.. ఒక్క క్షణంలోనే హత్యకు దారితీసిన ఘోర కుట్రగా మారింది. పాతికేళ్ల వేపచెట్టు పగ చివరకు రెండు నిండు ప్రాణాలను బలితీసుకుంది. ఒక హత్య నుంచి తప్పించుకోవాలన్న ప్రయత్నం మరో హత్యకు దారితీయడం తండావాసులను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. రెండు మృతదేహాలు ఒకే ప్రాంతంలో కనిపించడంతో గ్రామంలో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది.

## హంతకుడి కోసం జనం.. పోలీసులపైనా దాడి

జంట హత్యల విషయం తండాలో వ్యాపించడంతో గ్రామస్తులు పెద్ద సంఖ్యలో అక్కడికి చేరుకున్నారు. రాముపై తీవ్ర ఆగ్రహంతో అతడిని తమకు అప్పగించాలని డిమాండ్ చేశారు. భయపడిన రాము ఇంట్లోకి వెళ్లి తలుపులు వేసుకున్నాడు. ఆగ్రహంతో ఉన్న కొందరు గ్రామస్తులు అతడి ఇంటిపై రాళ్లు రువ్వడంతో పరిస్థితి అదుపుతప్పింది. మేళ్లచెరువు పోలీసులు అదనపు బలగాలతో రంగంలోకి దిగారు. ఆందోళనకారులను చెదరగొట్టే ప్రయత్నంలో పోలీసులపై కూడా రాళ్ల దాడి జరిగింది. ఈ ఘటనలో ఎస్సై తలకు రాయి బలంగా తగిలి తీవ్ర గాయాలయ్యాయి. ఆయనను వెంటనే హుజూర్‌నగర్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. అనంతరం పోలీసులు రామును అదుపులోకి తీసుకుని విచారణ ప్రారంభించారు. రెండు మృతదేహాలను పోస్టుమార్టం కోసం తరలించారు. ఒక వేపచెట్టు చుట్టూ మొదలైన పాత పగ.. చివరకు రెండు కుటుంబాలను కన్నీటిలో ముంచడమే కాకుండా పోలీసులపై దాడికి దారితీసింది. క్షణికావేశం, పాత కక్ష, నేరాన్ని దాచాలన్న ఆలోచన కలిసి ఒక తండాలో రక్తచరిత్రను మిగిల్చాయి.

# వైరల్ వీడియో కలకలం మజ్లిస్ నేతపై వేటు

### బేగ్ బహిష్కరణపై బీజేపీ సంచలన డిమాండ్

హైదరాబాద్ రాజకీయాల్లో ఎంఐఎం ఎమ్మెల్సీ మిర్జా రహ్మత్ బేగ్ వ్యవహారం సంచలనంగా మారింది. మిర్జా రహ్మత్ బేగ్‌ను పార్టీ నుంచి తక్షణమే బహిష్కరించిన ఎంఐఎం.. ఎమ్మెల్సీ పదవికి కూడా వెంటనే రాజీనామా చేయాలని ఆదేశించింది. అయితే ఈ నిర్ణయానికి అసలు కారణాన్ని పార్టీ అధికారికంగా వెల్లడించలేదు. మరోవైపు బేగ్ సైబర్ క్రైమ్ పోలీసులను ఆశ్రయించి.. తనపై డీప్‌ఫేక్ వీడియోలు, మార్ఫింగ్ ఫొటోలు ప్రచారం చేస్తామంటూ కొందరు బెదిరిస్తున్నారని ఫిర్యాదు చేసినట్టు సమాచారం. పోలీసులు ఈ ఫిర్యాదుపై దర్యాప్తు చేస్తున్నారు. బేగ్ మాత్రం తాజాగా బయటకు వచ్చిన వీడియోలో తనపై వస్తున్న వీడియోలు ఏఐతో రూపొందించిన డీప్‌ఫేక్‌లు అని ఆరోపించారు.

## బీజేపీకి దొరికిన రాజకీయ అస్త్రం

బేగ్ బహిష్కరణతో ప్రత్యర్థి పార్టీలు ఎంఐఎంపై ప్రశ్నల వర్షం కురిపిస్తున్నాయి. తెలంగాణ బీజేపీ మాత్రం పార్టీ నుంచి బహిష్కరణ న్యాయం కాదని.. ఆరోపణలపై పూర్తి స్థాయి నేర దర్యాప్తు జరగాల్సిందేనని డిమాండ్ చేసింది. మహిళలు, మైనర్లకు సంబంధించిన ఆరోపణలు సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్న నేపథ్యంలో వాటి నిజానిజాలు పోలీసులు తేల్చాలని బీజేపీ నేతలు కోరుతున్నారు. కోర్టు పర్యవేక్షణలో దర్యాప్తు జరపాలని, అవసరమైతే సీబీఐకి అప్పగించాలని కూడా డిమాండ్ చేశారు. అయితే సోషల్ మీడియాలో ప్రచారంలో ఉన్న ఆరోపణలు ఇప్పటివరకు స్వతంత్రంగా నిర్ధారణ కాలేదు. పోలీసులు కూడా వైరల్ వీడియో అసలు స్వరూపం, దాని ప్రామాణికతపై అధికారిక వివరాలు వెల్లడించలేదు. ఆరోపణలను వాస్తవాలుగా కాకుండా దర్యాప్తులో తేలాల్సిన అంశాలుగా చూడాల్సి ఉంది.

## ఓవైసీపై రాజాసింగ్ ప్రశ్నల వర్షం

మరోవైపు గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్.. బేగ్‌ను ఎందుకు అర్ధరాత్రి సమయంలో పార్టీ నుంచి తొలగించారు? అసలు కారణాన్ని ఎంఐఎం ప్రజలకు ఎందుకు చెప్పడం లేదు? అంటూ అసదుద్దీన్ ఓవైసీని ప్రశ్నించారు. బేగ్ ఉమ్రా కోసం సౌదీ అరేబియాలో ఉన్న సమయంలో హైదరాబాద్‌కు తిరిగి పిలిపించారనే ప్రచారంపైనా ఆయన వివరణ కోరారు. ఇదిలా ఉండగా బేగ్ ఎమ్మెల్సీ పదవికి ఇంకా రాజీనామా సమర్పించలేదని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి తెలిపారు. 2023లో హైదరాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా ఏకగ్రీవంగా ఎన్నికైన బేగ్ వ్యవహారం ఎంఐఎం రాజకీయాల్లోనే కాకుండా తెలంగాణలో పెద్ద రాజకీయ చర్చగా మారింది. అసలు వీడియో ఏమిటి? అది నిజమా, డీప్‌ఫేక్‌నా? బహిష్కరణకు దాని సంబంధం ఏంటి? అన్న ప్రశ్నలకు పోలీసు దర్యాప్తే తుది సమాధానం ఇవ్వాల్సి ఉంది





## మాది నరికే సంస్కృతి కాదు..
# నాటే సంస్కృతి

**పీ గ్రీన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ చైర్మన్ నాగబాబు**



మంగళగిరి అరణ్యారామం నందవనంలో ఏపీ గ్రీన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ చైర్మన్ కొణిదెల నాగబాబు, సతీమణి పద్మజతో కలిసి రావి, వేప మొక్కలు నాటారు. శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం మొక్కలు నాటారు. ప్రకృతి సంరక్షణలో భారత్ ప్రపంచానికి ఆదర్శంగా నిలవాలని నాగబాబు ఆకాంక్షించారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని పిలుపునిచ్చారు. భూమాత మనకు ఆహారం, నీరు, గాలి, నివాసం వంటి ఎన్నో వనరులు అందిస్తోందని, అడవుల నరికివేత, విచక్షణారహిత మైనింగ్, కాలుష్యంతో ప్రకృతికి మనమే నష్టం చేస్తున్నామని అన్నారు. రావి, వేప మొక్కలను ఒకే గుంతలో నాటే అశ్వత్థ నారాయణ వివాహం ప్రకృతి, ఆధ్యాత్మికత, సామరస్యానికి ప్రతీక అని నాగబాబు వివరించారు. రావిని విష్ణుమూర్తికి, వేపను లక్ష్మీదేవికి ప్రతీకలుగా భావించే సంప్రదాయం ప్రకృతికి భారతీయ సంస్కృతిలో ఉన్న గౌరవాన్ని చాటుతుందని చెప్పారు. ఈ చెట్లు జీవ వైవిధ్య పరిరక్షణకు దోహదపడతాయని పేర్కొన్నారు. మంచి పని ప్రారంభించే ముందు మొక్క నాటడం తన అలవాటని తెలిపారు. సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కు కూడా ప్రకృతి పరిరక్షణపై ఇదే ఆలోచన ఉందన్నారు. రూ.24 కోట్లతో నిర్మించనున్న అరణ్యారామం భవన డిజైన్లను నాగబాబు పరిశీలించారు. నిర్మాణాన్ని 10 నెలల్లో పూర్తి చేసేలా ప్రణాళికలు సిద్ధం చేశామని పీసీసీఎఫ్ చీఫ్ పి.వి.చలపతిరావు వివరించారు. నిర్మాణంలో భాగంగా తొలగించాల్సిన 73 చెట్లను నరికివేయకుండా మరో ప్రాంతానికి విజయవంతంగా పునఃప్రతిష్ఠాపన చేశారు. వాటిని నాగబాబు స్వయంగా పరిశీలించారు. కార్యక్రమంలో అటవీశాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.




## అభివృద్ధికి ప్రయోగ వేదిక

**పైలట్ గ్రామంగా ముప్పారం**

విబిజిరాం గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద ముప్పారం గ్రామాన్ని పైలట్ గ్రామంగా ఎంపిక చేసి విస్తృత అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టనున్నట్లు జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అడిషనల్ ప్రాజెక్ట్ డైరెక్టర్ లక్ష్మీప్రసన్న తెలిపారు. శనివారం గ్రామపంచాయతీ ఆవరణలో సర్పంచ్ గుంటుపల్లి రేణుక అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో చేపట్టనున్న 317 రకాల పనుల వివరాలను అధికారులు గ్రామస్తులకు వివరించారు. రోడ్లు, డ్రైనేజీ, ప్రభుత్వ భవనాలు, వ్యవసాయ పనులు, వ్యక్తిగత, సామూహిక అభివృద్ధి కార్యక్రమాలతో పాటు కూలీలకు ఉపాధి కల్పించే పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. గ్రామం అన్ని రంగాల్లో ముందంజలో ఉండేలా ప్రణాళిక రూపొందిస్తున్నామని లక్ష్మీప్రసన్న పేర్కొన్నారు. ముప్పారం వైపు రాష్ట్రం చూస్తోందని, ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి పనులు పూర్తి చేసి ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతామని సర్పంచ్ గుంటుపల్లి రేణుక హామీ ఇచ్చారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ ఏపీడీ శ్రీధర్, ఎంపీడీవో అనిల్‌కుమార్, ఇంజనీరింగ్ అధికారులు, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు, ఐసీడీఎస్ ప్రతినిధులు, వ్యవసాయ అధికారి రాజేష్, ఉపసర్పంచ్ తాళ్లపల్లి కుమార్, విలేజ్ క్యాబినెట్ సభ్యులు పాల్గొన్నారు.



## బంగారు వ్యాపారానికి అండగా ఉంటాం

**స్వర్ణకారులకు ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి భరోసా**

ప్రొద్దుటూరుకు తరతరాలుగా ప్రత్యేక గుర్తింపు తెచ్చిన బంగారు వ్యాపారం, స్వర్ణకారుల వృత్తిని కాపాడేందుకు అండగా ఉంటానని ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి హామీ ఇచ్చారు. కార్పొరేట్ సంస్థల పోటీతో స్థానిక వ్యాపారులు, నగల తయారీ కార్మికులు నష్టపోకుండా చర్యలు తీసుకుంటామని శ్రీ అమ్మవారి సాక్షిగా తెలిపారు. అమ్మవారి శాలలో శనివారం ఎమ్మెల్యే అధ్యక్షతన బంగారు వ్యాపారులు, గుమస్తాలు, స్వర్ణకారులతో సమావేశం నిర్వహించారు. ఆన్‌లైన్ వ్యాపారాలు, కార్పొరేట్ సంస్థల రాకతో స్థానిక బంగారు వ్యాపారం దెబ్బతింటోందని జ్యూవెలరీ అసోసియేషన్ అధ్యక్షుడు కొప్పర్తి మధుసూదన్ తెలిపారు. ఏఐ, కంప్యూటర్ డిజైనింగ్ కారణంగా చేతివృత్తిపై ఆధారపడిన స్వర్ణకారులకు ఉపాధి తగ్గుతోందని గోల్డ్‌స్మిత్ అసోసియేషన్ అధ్యక్షుడు మహమ్మద్ ఇలియాస్ ఆవేదన వ్యక్తం చేశారు. చిన్న, మధ్య తరహా వ్యాపారులను ప్రజా ప్రతినిధులు ఆదుకోవాలని ఆర్యవైశ్య సభ అధ్యక్షుడు రామ్మో హన్‌రావు కోరారు. సమస్యలపై స్పందించిన ఎమ్మెల్యే వ్యాపారులు, స్వర్ణ కారుల ప్రయోజనాలకు అవసరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

## పోలీసులమంటూ బెదిరింపులు

**లాఠీలతో బెదిరించి వసూళ్లు**



ప్రొద్దుటూరు శివారు ప్రాంతాల్లో పోలీసులమంటూ బెదిరించి డబ్బులు వసూలు చేస్తున్న ఇద్దరు నకిలీ పోలీసులను రూరల్ పోలీసులు అరెస్ట్ చేశారు. శంకరాపురానికి చెందిన సాయినాథరెడ్డి, చౌదూరుకు చెందిన రవిని శుక్రవారం రూరల్ ఎస్సై రాజు ఆధ్వర్యంలో అదుపులోకి తీసుకున్నారు. నిందితులు మద్యం సేవిస్తున్నవారు, ప్రేమ జంటలను లక్ష్యంగా చేసుకుని తాము హెడ్ కానిస్టేబుల్, కానిస్టేబుల్‌గా పరిచయం చేసుకునేవారని పోలీసులు తెలిపారు. అనంతరం లాఠీలతో బెదిరించి డబ్బులు వసూలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రొద్దుటూరుకు చెందిన నిహిత్‌కుమార్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు ఇద్దరినీ అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి 1,000 నగదు, రెండు లాఠీలు స్వాధీనం చేసుకున్నారు. నకిలీ పోలీసుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై రాజు సూచించారు. పోలీసుల పేరుతో ఎవరైనా డబ్బులు అడిగితే భయపడకుండా వెంటనే సమీప పోలీస్‌స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు.



## జిమ్ ట్రైనర్ హత్య కేసు

**నలుగురు అరెస్ట్‌తో కలకలం**

**సాయి కిరణ్‌తో కలిసి హత్య?**

కాకినాడ నగరంలోని బానుగుడి సెంటర్‌లో మూడు రోజుల క్రితం జరిగిన జిమ్ ట్రైనర్ సతీష్‌రెడ్డి హత్య కేసులో పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. ఈ కేసులో ప్రధాన నిందితుడిగా ఆరోపణలు ఎదుర్కొంటున్న సాయి కిరణ్‌తో పాటు మరో ముగ్గురు స్నేహితులను కాకినాడ టూ టౌన్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సతీష్‌రెడ్డిని సాయి కిరణ్ తన ముగ్గురు స్నేహితులతో కలిసి హత్య చేసినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. నలుగురిని అదుపులోకి తీసుకున్న పోలీసులు ప్రస్తుతం వారి నుంచి వివరాలు సేకరిస్తున్నారు. హత్యకు దారితీసిన కారణాలు, ఘటనకు ముందు జరిగిన పరిణామాలు, నిందితుల పాత్రపై విచారణ కొనసాగుతోంది. మరోవైపు ఈ హత్య కేసు నగరంలో చర్చనీయాంశంగా మారింది.

**కటౌట్ శ్రీనుపై భార్య ఆరోపణలు**

ఇదిలా ఉండగా సతీష్‌రెడ్డి హత్య వెనుక ఎమ్మెల్యే కొండబాబు అనుచరుడు కటౌట్ శ్రీను ఉన్నాడని మృతుడి భార్య జయశ్రీ ఆరోపించారు. వ్యక్తిగత వ్యవహారాల కారణంగా తన భర్తపై కటౌట్ శ్రీను కక్ష పెంచుకున్నాడని, ఆ కక్షతోనే హత్య చేయించారని ఆమె ఆరోపిస్తున్నారు. ఈ ఆరోపణల నేపథ్యంలో పోలీసులు కటౌట్ శ్రీను కోసం గాలింపు చేపట్టారు. ప్రస్తుతం సాయి కిరణ్‌తో పాటు అదుపులో ఉన్న మరో ముగ్గురిని విచారిస్తున్న పోలీసులు వారి వాంగ్మూలాలను నమోదు చేస్తున్నారు. సతీష్‌రెడ్డి హత్యలో ఎవరి పాత్ర ఎంతమేర ఉందనే అంశంపై దర్యాప్తు సాగుతోంది. భార్య చేసిన ఆరోపణలకు ఆధారాలు ఉన్నాయా? హత్యకు అసలు కారణం ఏమిటి? అనే కోణాల్లో పోలీసులు విచారణ కొనసాగిస్తూ, కేసులో మరిన్ని వివరాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని భావిస్తున్నారు.



# టెక్కలిలో సీటు కోసం పసుపు పోరు

**టెక్కలి సర్పంచ్ సీటుపై టీడీపీలో పోరు**






శ్రీకాకుళం జిల్లాలోని కీలకమైన టెక్కలి మేజర్ పంచాయతీ సర్పంచ్ సీటు ఇప్పుడు టీడీపీలో హాట్‌టాపిక్‌గా మారింది. స్థానిక సంస్థల ఎన్నికల వేళ పంచాయతీ పీఠాన్ని దక్కించుకునే అభ్యర్థి ఎవరనే చర్చ పార్టీ వర్గాల్లో తీవ్రంగా సాగుతోంది. మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు సొంత నియోజకవర్గం కావడంతో టెక్కలి సర్పంచ్ ఎంపికకు రాజకీయ ప్రాధాన్యం మరింత పెరిగింది. సీటు కోసం పలువురు నేతలు పోటీ పడుతుండటంతో పార్టీ అంతర్గత సమీకరణాలు వేడెక్కాయి.

**షాడో నేత వర్సెస్ టౌన్ లీడర్**

సర్పంచ్ సీటు కోసం ప్రధానంగా ఇద్దరు నేతల మధ్య ఆధిపత్య పోరు నడుస్తున్నట్లు పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. పార్టీలో చాలాకాలంగా 'షాడో నేత'గా ప్రభావం చూపుతున్న వైశ్య సామాజిక వర్గానికి చెందిన నాయకుడు ఈసారి టికెట్ తనకే రావాలని పట్టుబడుతున్నట్లు తెలుస్తోంది. తన సామాజిక వర్గ బలం, స్థానికంగా ఉన్న పరిచయాలతో అధిష్ఠానంపై ఒత్తిడి పెంచుతున్నట్లు సమాచారం. మరోవైపు కాంట్రాక్ట్ పనులతో పాటు టౌన్ రాజకీయాల్లో తనదైన ప్రభావం చూపుతున్న మరో కీలక నాయకుడు కూడా 'సీటు నాదే' అంటూ ముందుకు వస్తున్నట్లు తెలుస్తోంది. ఇద్దరి మధ్య పోటీ ముదరడంతో టీడీపీ స్థానిక శ్రేణుల్లో ఉత్కంఠ నెలకొంది.

**కాపు నేతకు పదవితో చెక్**

సర్పంచ్ రేసులో ఉన్న కాళింగ కాపు సామాజిక వర్గానికి చెందిన మరో నాయకుడికి కీలక నామినేటెడ్ పదవి ఇచ్చి పోటీ నుంచి తప్పించే వ్యూహాన్ని పార్టీ పెద్దలు అనుసరించినట్లు తెలుస్తోంది. దీంతో ఒక వర్గాన్ని బుజ్జగించినా సర్పంచ్ అభ్యర్థి ఎంపిక సమస్య మాత్రం ఇంకా పరిష్కారం కాలేదు. ఈ నేపథ్యంలో మంత్రి అచ్చెన్నాయుడు స్వయంగా రంగంలోకి దిగినట్లు సమాచారం. రెండు వర్గాల ఆధిపత్య పోరుకు ముగింపు పలికేందుకు పార్టీకి నమ్మకమైన, వివాదరహితమైన కాళింగ సామాజిక వర్గ నేతను మూడో అభ్యర్థిగా తెరపైకి తీసుకురావాలనే వ్యూహం ఉన్నట్లు తెలుస్తోంది. టెక్కలిలో కాళింగ సామాజిక వర్గం గణనీయంగా ఉండటంతో ఈ సమీకరణం కీలకంగా మారింది. చివరకు మంత్రి ఆశీస్సులతో బి-ఫారమ్ దక్కించుకునే 'మాస్టర్ ప్లాన్ అభ్యర్థి' ఎవరు? అనేది ఇప్పుడు ఉత్కంఠగా మారింది.

## మనిషి లేకపోయినా..
# మానవత్వం మరువలేదు!

**గుర్తుతెలియని వ్యక్తికి గౌరవంగా అంత్యక్రియలు**

**'మే ఐ హెల్ప్ యు ఫౌండేషన్' చొరవ**



ప్రొద్దుటూరు: బంధువులు ఎవరూ ముందుకు రాకపోయినా.. మానవత్వంతో స్పందించి ఓ గుర్తుతెలియని వ్యక్తికి గౌరవప్రదంగా అంతిమ సంస్కారాలు నిర్వహించారు 'మే ఐ హెల్ప్ యు ఫౌండేషన్' సభ్యులు. ఎర్రగుంట్ల బస్టాండ్‌లో అనారోగ్యంతో మృతి చెందిన గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీలో భద్రపరిచారు. అయితే అంత్యక్రియలు నిర్వహించేందుకు బంధువులు ఎవరూ రాకపోవడంతో పోలీసు సిబ్బంది ఫోన్ ద్వారా ఫౌండేషన్ టౌన్ ప్రెసిడెంట్ సుబహాన్‌ను సంప్రదించారు. విషయం తెలుసుకున్న సుబహాన్ వెంటనే స్పందించి ఫౌండేషన్ సభ్యులతో కలిసి మృతదేహాన్ని హిందూ శ్మశానవాటికకు తరలించారు. అక్కడ హిందూ సంప్రదాయం ప్రకారం అంతిమ సంస్కారాలను నిర్వహించి గౌరవప్రదంగా వీడ్కోలు పలికారు. ఈ సేవా కార్యక్రమంలో ఫౌండేషన్ చైర్మన్ మోరే లక్ష్మణ్‌రావు, టౌన్ ప్రెసిడెంట్ సుబహాన్, అశోక్, సతీష్, గౌస్ తదితరులు పాల్గొని అంత్యక్రియలను పూర్తి చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ మోరే లక్ష్మణ్‌రావు మాట్లాడుతూ.. సమాజంలో ఎవరూ లేని వారికి సైతం గౌరవప్రదమైన అంతిమ సంస్కారాలు జరగాలన్న ఉద్దేశంతోనే ఇటువంటి సేవా కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. అవసరంలో ఉన్నవారికి అండగా నిలుస్తూ 'మే ఐ హెల్ప్ యు ఫౌండేషన్' ఆధ్వర్యంలో నిరంతరం సేవా కార్యక్రమాలు కొనసాగిస్తామని సభ్యులు పేర్కొన్నారు.





**వ్యాపారాలే ప్రొద్దుటూరు**

## ఆర్థికానికి వెన్నెముక

**స్థానికవర్తకులకు అండగా ఉండాలన్న రాచమల్లు**

ప్రొద్దుటూరు పట్టణ ఆర్థికాభివృద్ధికి స్థానిక వ్యాపారులే కీలకమని మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి అన్నారు. శనివారం దొరసానిపల్లెలోని తన నివాసంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. స్థానిక వ్యాపారులకు ప్రజలు అండగా నిలవాలని మాత్రమే తాను కోరానని, టీడీపీ నేతలను విమర్శించలేదని స్పష్టం చేశారు. కార్పొరేట్ సంస్థల ద్వారా వచ్చే ఆదాయం ఇతర ప్రాంతాలకు తరలిపోయే అవకాశం ఉంటుందని, స్థానిక వ్యాపారాల వల్ల ఆర్థిక కార్యకలాపాలు పట్టణంలోనే కొనసాగుతాయని వివరించారు. వ్యాపారాల ద్వారా పన్నులు, ఇతర ఆదాయాలు స్థానికంగానే సమకూరే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ప్రజలకు ప్రయోజనం కలిగించే ఏ అంశాన్నీ తాను వ్యతిరేకించబోనన్నారు. తనపై ఎవరైనా ఆరోపణలు చేస్తే ఆధారాలతో నిరూపించాలని రాచమల్లు సవాల్ చేశారు.

# రాజంపేట పార్లమెంటు ప్రక్షాళనకు టీడీపీ కసరత్తు..!

**నిన్న తంబళ్లపల్లి.. నేడు పుంగనూరు..**

**నెక్స్ట్ రాజంపేటా?**

**రైల్వేకోడూరు మార్పుపైనా అధిష్ఠానం దృష్టి**

**రేపోమాపో కీలక నిర్ణయం!**





రాజంపేట పార్లమెంటు నియోజకవర్గ పరిధిలో టీడీపీ ప్రక్షాళనకు శ్రీకారం చుట్టిందన్న చర్చ పార్టీ వర్గాల్లో జోరుగా సాగుతోంది. 2029 ఎన్నికలను లక్ష్యంగా చేసుకుని తంబళ్లపల్లి, పుంగనూరు నుంచి మార్పులకు తెరతీసిన అధిష్ఠానం.. ఇప్పుడు రాజంపేట, రైల్వేకోడూరు వైపు దృష్టి సారించినట్లు తెలుస్తోంది. ఇప్పటికే ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలైన రాజంపేట, రాయచోటి, తంబళ్లపల్లి, పీలేరు, మదనపల్లె, పుంగనూరు, రైల్వేకోడూరుల్లో నాయకుల పనితీరు, కేడర్ పరిస్థితి, ప్రజల్లో పార్టీ బలాబలాలపై అంతర్గత నివేదికలు తెప్పించుకున్నట్లు ప్రచారం జరుగుతోంది. పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా లేని నేతలు, స్థానికంగా వివాదాలు ఎదుర్కొంటున్న నాయకుల వ్యవహారశైలిని కూడా అధిష్ఠానం పరిశీలిస్తున్నట్లు సమాచారం. ఇందులో భాగంగానే తంబళ్లపల్లి ఇన్‌చార్జిగా శంకర్‌యాదవ్‌ను నియమించగా, తాజాగా పుంగనూరుకు మధు నాయుడును నియమించడం ప్రక్షాళనకు సంకేతంగా పార్టీ శ్రేణులు భావిస్తున్నాయి.



**రాజంపేట ఇన్‌చార్జి మార్పు ఫైల్**

ఇప్పుడు అందరి చూపూ రాజంపేటపైనే ఉంది. రాజంపేట నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి మార్పునకు సంబంధించిన ఫైల్ పార్టీ జాతీయ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి చంద్రబాబు వద్దకు చేరినట్లు పార్టీ వర్గాల్లో ప్రచారం సాగుతోంది. నియోజకవర్గంలో పార్టీ పరిస్థితి, నాయకత్వ పనితీరు, క్షేత్రస్థాయిలో కేడర్ సమన్వయం వంటి అంశాలను పరిశీలించిన తర్వాతే తుది నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని తెలుస్తోంది.

ప్రస్తుతం రాజంపేటలో పార్టీ అత్యంత బలహీనంగా ఉందన్న అభిప్రాయం అధిష్ఠానం దృష్టికి వెళ్లినట్లు సమాచారం. ఇన్‌చార్జిని లక్ష్యంగా చేసుకుని తరచూ బహిరంగంగా వివాదాలు, ఆరోపణలు తెరపైకి రావడం, అవినీతి ఆరోపణలపై పార్టీ శ్రేణుల్లో అసంతృప్తి వ్యక్తమవుతుండటం కూడా అధిష్ఠానాన్ని ఆలోచనలో పడేసినట్లు తెలుస్తోంది. ముఖ్యంగా దశాబ్దాలుగా టీడీపీలో కొనసాగుతున్న సీనియర్ నేతలు ప్రస్తుత నాయకత్వంపై తీవ్ర అసంతృప్తితో ఉన్నారన్న ప్రచారం పార్టీ వర్గాల్లో వినిపిస్తోంది.

**రాజంపేట టీడీపీలో కొత్త నాయకుడెవరు?**

ఇదే సమయంలో రాజంపేటలో వైసీపీకి చెందిన కీలక నేతలను ఎదుర్కొనే స్థాయిలో బలమైన నాయకత్వాన్ని ఏర్పాటు చేయడమే టీడీపీ అధిష్ఠానం ముందున్న ప్రధాన లక్ష్యంగా కనిపిస్తోంది. వైసీపీ ఎంపీ మిథున్‌రెడ్డి, రాజ్యసభ సభ్యుడు మేడా రఘునాథ్‌రెడ్డి, ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి వంటి నేతల ప్రభావాన్ని తట్టుకుని కేడర్‌ను ఏకతాటిపైకి తీసుకురాగల నాయకుడి కోసం అన్వేషణ జరుగుతున్నట్లు సమాచారం. ఈ క్రమంలో టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి మేడా విజయశేఖర్‌రెడ్డి అలియాస్ మేడా బాబు పేరు తెరపైకి వచ్చినట్లు పార్టీ వర్గాల్లో చర్చ సాగుతోంది. అదే సామాజిక వర్గానికి చెందిన బలమైన నాయకత్వం అవసరమని అధిష్ఠానం భావిస్తే మేడా బాబుకు అవకాశం దక్కవచ్చన్న అంచనాలు ఉన్నాయి. మరోవైపు బలిజ సామాజిక వర్గం నుంచి బలమైన నాయకుడిని ఎంపిక చేయాలనుకుంటే మాజీ ఇన్‌చార్జి బత్యాల చెంగల్‌రాయులును మళ్లీ రంగంలోకి తీసుకొచ్చే అవకాశమూ ఉందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

**తంబళ్లపల్లి, పుంగనూరు నెక్స్ట్ రాజంపేట?**

తంబళ్లపల్లి, పుంగనూరులో వరుసగా మార్పులు చోటుచేసుకున్న నేపథ్యంలో రాజంపేటలోనూ రేపోమాపో కీలక ప్రకటన వెలువడవచ్చన్న ప్రచారం రాజకీయ వేడిని మరింత పెంచుతోంది. రైల్వేకోడూరు ఇన్‌చార్జి వ్యవహారంపైనా అధిష్ఠానం చర్చిస్తున్నట్లు సమాచారం. అయితే అధికారిక ప్రకటన వచ్చే వరకు పేర్లు, మార్పులపై వస్తున్న ప్రచారాలను ధ్రువీకరించలేమని కొందరు టీడీపీ నేతలు స్పష్టం చేస్తున్నారు. అయినప్పటికీ 2029 ఎన్నికలకు ఇంకా సమయం ఉన్నప్పటికీ ఇప్పటి నుంచే బలహీన ప్రాంతాలను గుర్తించి నాయకత్వాన్ని పటిష్ఠం చేయాలన్న వ్యూహంతో టీడీపీ ముందుకు సాగుతున్నట్లు పార్టీ శ్రేణులు భావిస్తున్నాయి. తంబళ్లపల్లి.. పుంగనూరు తర్వాత రాజంపేటలో మార్పు వస్తుందా? వస్తే పగ్గాలు ఎవరికి అప్పగిస్తారు? మేడా బాబుకా.. బత్యాల చెంగల్‌రాయులుకా? అన్న ఉత్కంఠ ఇప్పుడు రాజంపేట టీడీపీ రాజకీయాల్లో హాట్‌టాపిక్‌గా మారింది.



## క్రీడా ప్రతిభకు క్రికెట్ వేదిక

**రాష్ట్ర, జాతీయ స్థాయికి ఎదగాలి**

**ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి పిలుపు**

ప్రొద్దుటూరు పాలిటెక్నిక్ కళాశాల మైదానంలో జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా డిగ్రీ, పీజీ విద్యార్థుల జిల్లా స్థాయి క్రికెట్ పోటీలు శనివారం ప్రారంభమయ్యాయి. టీఎన్‌ఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ పోటీలను ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి ప్రారంభించి, విద్యార్థులు క్రీడల్లో ప్రతిభ చూపి రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించాలని పిలుపునిచ్చారు. కడప పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని వివిధ ప్రాంతాల నుంచి 16 జట్లు పోటీల్లో పాల్గొంటున్నాయి. గెలుపోటములను సమానంగా స్వీకరించి క్రీడా స్ఫూర్తితో ముందుకు సాగాలని ఎమ్మెల్యే సూచించారు. క్రీడాకారులకు అవసరమైన వసతి, ఇతర సదుపాయాల కల్పనకు తన వంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. క్రీడాకారులను ప్రోత్సహించేందుకు టీడీపీ ఎల్లప్పుడూ ముందుంటుందని జిల్లా అధ్యక్షుడు భూపేష్‌రెడ్డి తెలిపారు. మంత్రి నారా లోకేష్ యువత, క్రీడాకారులను ప్రోత్సహిస్తున్నారని, ప్రతిభావంతులు జాతీయ స్థాయికి ఎదగాలన్నదే లక్ష్యమని పేర్కొన్నారు. కార్యక్రమంలో టీఎన్‌ఎస్‌ఎఫ్ నాయకులు, టీడీపీ నేతలు పాల్గొన్నారు.




## పోలీసుల సేవా స్ఫూర్తి.. రక్తదానంతో మరో అడుగు!

ప్రొద్దుటూరులో భారత మాజీ ఉప ప్రధాని సర్దార్ వల్లభాయ్ పటేల్ 151వ జయంతి సందర్భంగా కడప జిల్లా ఎస్పీ నచికేత్ విశ్వనాథన్ ఆదేశాలతో సబ్‌డివిజన్ పోలీసుల ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. రోటరీ క్లబ్ సహకారంతో జరిగిన ఈ కార్యక్రమంలో ఏఎస్పీ విభు కృష్ణ ఐపీఎస్ స్వయంగా రక్తదానం చేశారు. వన్‌టౌన్ సీఐ కొండారెడ్డి, ట్రాఫిక్ సీఐ భాస్కర్, ఎస్ఐలు మధుసూదన్‌రెడ్డి, రాఘవేంద్రరెడ్డి, ప్రణయ్‌కుమార్‌రెడ్డితో పాటు మరో 27 మంది పోలీసు సిబ్బంది రక్తదానం చేశారు. తలసేమియా వంటి వ్యాధులతో బాధపడేవారికి సకాలంలో రక్తం అందక ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఏఎస్పీ తెలిపారు. రక్తదానం ద్వారా ఆపదలో ఉన్న వారి ప్రాణాలను కాపాడవచ్చని పేర్కొంటూ ప్రజలు కూడా స్వచ్ఛందంగా రక్తదానం చేయాలని పిలుపునిచ్చారు. శిబిరాన్ని విజయవంతం చేసిన రోటరీ క్లబ్ సభ్యులు, ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది, మీడియా ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు.



## జగన్ కదలికతో 2029 రాజకీయ వేడి

## రాయలసీమ గడ్డపై మొదలైన దూకుడు

## కర్నూలు నుంచి మోగిన సమరభేరి

రాయలసీమ గడ్డ మీద రాజకీయ వేడి ఎప్పుడూ మామూలుగా ఉండదు. మాటైనా.. పోరాటమైనా.. సవాలైనా.. సూటిగానే ఉంటుంది. ఇప్పుడు కర్నూలులో కనిపించిన దృశ్యాలు కూడా అలాంటివే. ములాఖత్ కోసం జగన్ బయలుదేరితే.. దారిలో ఆంక్షలు, అడ్డంకులు, పోలీసుల కట్టడి.. మరోవైపు వైఎస్సార్‌సీపీ నేతల హడావుడి.. సోషల్ మీడియాలో చక్కర్లు కొట్టిన వీడియోలు.. ఇవన్నీ కలసి ఒక సాధారణ పర్యటనను పెద్ద రాజకీయ చర్చగా మార్చేశాయి. "అయ్యా.. జగన్ వెంట నిజంగా జనం ఉన్నారా? లేక పార్టీ సమీకరణమేనా?" అనే లెక్కలు ఇప్పుడు రాజకీయ వర్గాల్లో మొదలయ్యాయి. కానీ సీమలో ఒక మాట ఉంది.. "పొగ కనిపిస్తే నిప్పు ఎక్కడో ఉండే ఉంటుంది." జగన్ పర్యటనలకు జనం వస్తున్నారంటే దాన్ని పూర్తిగా తేలిగ్గా తీసుకోవడం కూటమికి మంచిది కాదు. అదే సమయంలో జనం వచ్చారంటే 2029 గెలుపు ఖాయమని వైఎస్సార్‌సీపీ సంబరపడటమూ తొందరపాటే. జనం ఓటు కాదు.. కానీ జనం లేకుండా ఓటు రాజకీయమూ నడవదు. అందుకే కర్నూలు ఘటన ఒక పర్యటన కథ కాదు.. రాబోయే మూడేళ్ల రాజకీయ లెక్కలకు మొదటి సంకేతం. జగన్ రోడ్డెక్కాడు.. పార్టీ కదిలింది.. కూటమి అప్రమత్తమైంది. ఇక సీమగాలి ఏ వైపు తిరుగుతుందో చూడాల్సిందే.



# సీమ సందుల్లో పందెం కోళ్ల హోరు

# రెండేళ్లకే హీటెక్కిన పొలిటికల్ వార్

- జగన్‌ను ఆపితే జనాన్ని ఆపగలరా?
- సీమద్వారం కర్నూలు నుంచి రగిలిన రాజకీయ రణగర్జన
- మూడేళ్ల ముందే ముల్లోకాలు కనిపిస్తున్నాయా?

### జగన్ పర్యటనలు.. వేడెక్కిస్తున్న రాజకీయాలు

ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో ఎన్నికలకు ఇంకా మూడేళ్ల సమయం ఉన్నప్పటికీ రాజకీయ వాతావరణం మాత్రం చాన్నాళ్ల నుంచే వేడెక్కుతోంది. అధికార కూటమి పాలనపై పట్టు బిగించేందుకు ప్రయత్నిస్తుండగా.. వైఎస్సార్‌సీపీ తన రాజకీయ ఉనికిని తిరిగి చాటుకునేందుకు రోడ్డెక్కుతోంది. ఈ రెండు శక్తుల మధ్య పోరులో ఇప్పుడు ఒక దృశ్యం పదేపదే కనిపిస్తోంది. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎక్కడికి వెళ్లినా జనాలు కనిపిస్తున్నారు. జగన్ పర్యటన అంటే జనసందోహం.. జనసందోహం అంటే అధికార పక్షంలో కొత్త రాజకీయ లెక్కలు.. ఆ లెక్కలే ఇప్పుడు ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో కొత్త చర్చకు తెరదీస్తున్నాయి. జగన్ పర్యటనలకు వస్తున్న జనాన్ని వైఎస్సార్‌సీపీ ప్రజాభిమానంగా అభివర్ణిస్తోంది. ప్రత్యర్థులు మాత్రం పార్టీ కార్యకర్తల సమీకరణగా కొట్టిపారేస్తున్నారు. ఎవరి వాదనలో ఎంత నిజం ఉందన్నది పక్కన పెడితే.. ఒక మాజీ ముఖ్యమంత్రి పర్యటన చుట్టూ ఇంతటి రాజకీయ ఆసక్తి ఏర్పడటం మాత్రం విస్మరించలేని పరిణామం. ఎందుకంటే ఓడిపోయిన నాయకుడిని ప్రజలు పూర్తిగా తిరస్కరించినప్పుడు అతని పర్యటనలు క్రమంగా వెలవెలబోతాయి. కానీ జనాలు కనిపిస్తూనే ఉంటే.. ఆ నాయకుడి రాజకీయ కథ ఇంకా ముగియలేదనే సంకేతం అందులో దాగి ఉంటుంది. అయితే జనసందోహం అంటే ఓటు కాదు. జనాభిమానం అంటే ఎన్నికల విజయం కాదు. అదే సమయంలో జనాలను పూర్తిగా కృత్రిమ సమీకరణగా కొట్టిపారేయడం కూడా రాజకీయంగా సరైన అంచనా కాదు. ప్రజలు ఎందుకు వస్తున్నారు? ఎవరిని చూడటానికి వస్తున్నారు? ఏ సమస్యతో వస్తున్నారు? నాయకుడితో వారికి ఉన్న బంధం ఏమిటి? ఈ ప్రశ్నలకు సమాధానాలే భవిష్యత్ రాజకీయ దిశను నిర్ణయిస్తాయి. జగన్ ఇప్పుడు ఈ ప్రశ్నలన్నింటినీ మళ్లీ ప్రజాక్షేత్రంలోకి తీసుకువస్తున్నారు. రోడ్డు మీదకు వస్తున్నారు. కార్యకర్తలను కలుస్తున్నారు. ప్రజలను పలకరిస్తున్నారు. ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్నారు. పార్టీ శ్రేణుల్లో నూతన ఉత్సాహం నింపేందుకు ప్రయత్నిస్తున్నారు. ఈ కదలికే అధికార పక్షానికి రాజకీయంగా ఆలోచించాల్సిన పరిస్థితిని తీసుకొస్తోంది.

### జగన్ పర్యటన.. పోలీసు ఆంక్షల కలకలం

కర్నూలు పర్యటన ఈ నేపథ్యంలో ప్రత్యేక ప్రాధాన్యం సంతరించుకుంది. జైల్లో ఉన్న ఆలూరు ఎమ్మెల్యే విరూపాక్షిని ములాఖత్‌లో కలుసుకునేందుకు జగన్ కర్నూలుకు బయలుదేరారు. ఇది ఒక సాధారణ ములాఖత్‌గా ముగిసిపోయే అవకాశం ఉండేది. కానీ పర్యటన చుట్టూ పోలీసు ఆంక్షలు, ర్యాలీలపై నిషేధం, జనసమీకరణపై నియంత్రణ, మార్గమధ్యంలో పార్టీ నాయకులను అడ్డుకోవడం వంటి పరిణామాలు చోటుచేసుకోవడంతో ఈ పర్యటన ఒక రాజకీయ అంశంగా మారిపోయింది. కర్నూలు ఎస్పీ... ర్యాలీలు, సభలు, సమావేశాలకు అనుమతి లేదని ప్రకటించడం.. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించడం.. జగన్ పర్యటనపై ముందుగానే పోలీసు వ్యవస్థ ఎంత అప్రమత్తంగా ఉందో తెలియజేసే పరిణామాలుగా కనిపించాయి. ప్రభుత్వ పరిపాలనా దృష్టిలో ఇది శాంతిభద్రతల రక్షణ చర్య కావచ్చు. కానీ రాజకీయ దృష్టిలో మాత్రం మరో ప్రశ్న తలెత్తుతోంది. ఒక మాజీ ముఖ్యమంత్రి పర్యటనను ఇంత కట్టుదిట్టంగా నియంత్రించాల్సిన అవసరం ఎందుకు వచ్చింది? నిజంగా సమస్య ట్రాఫిక్‌దా? భద్రతా పరమైనదా? లేక జగన్ పర్యటన చుట్టూ ఏర్పడే రాజకీయ ప్రభావమా? ఈ ప్రశ్నలకు సమాధానం ప్రభుత్వమే చెప్పాలి. నంద్యాల టోల్‌గేట్ వద్ద వైఎస్సార్‌సీపీ నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులను పోలీసులు అడ్డుకున్నారన్న వార్తలు పర్యటనకు మరింత రాజకీయ రంగు పులిమాయి. వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ రమేష్ యాదవ్, మాజీ ఎమ్మెల్యే బ్రిజేంద్రనాథ్‌రెడ్డి తదితరులను పోలీసులు అడ్డుకున్నారని ఆ పార్టీ ఆరోపిస్తోంది. మరికొందరు నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులను కూడా మార్గమధ్యంలో నిలిపివేశారని చెబుతోంది. పెద్ద సంఖ్యలో వాహనాలు కదలకుండా చూడటమే కారణమని పోలీసులు చెబుతున్నప్పటికీ.. వైఎస్సార్‌సీపీ మాత్రం దీనిని రాజకీయ కట్టడిగా అభివర్ణిస్తోంది. ఇక్కడే అసలు సమస్య మొదలవుతోంది. పోలీసులు చట్టాన్ని అమలు చేయాలి. రాజకీయ వాతావరణాన్ని నిర్వహించకూడదు. ఒక పార్టీ నాయకుడిని అడ్డుకోవడం అవసరమైతే.. అదే నిబంధనను ప్రతి రాజకీయ పార్టీకి సమానంగా వర్తింపజేయాలి. లేదంటే పోలీసు చర్య చట్టపరమైన చర్యగా కాకుండా రాజకీయ చర్యగా కనిపించే ప్రమాదం ఉంటుంది.

### పోలీసు ఆంక్షలు.. వైసీపీకి రాజకీయ అస్త్రం

ప్రజాస్వామ్యంలో పోలీసులపై విశ్వాసం అత్యంత కీలకం. అధికార పార్టీకి అనుకూలంగా పనిచేస్తున్నారనే భావన వచ్చినా.. ప్రతిపక్షాన్ని అణచివేస్తున్నారనే ముద్ర పడినా.. పోలీసు వ్యవస్థ ప్రతిష్ఠకు నష్టం జరుగుతుంది. అందుకే జగన్ పర్యటన సందర్భంగా చోటుచేసుకుంటున్న ప్రతి ఘటనను అధికారులు మరింత సంయమనంతో, పారదర్శకంగా నిర్వహించాల్సిన అవసరం ఉంది. నిబంధనలు ఉంటే వాటిని స్పష్టంగా ప్రకటించాలి. అనుమతులు లేకపోతే ఎందుకు లేవో ప్రజలకు వివరించాలి. పరిమితులు ఉంటే వాటిని అందరికీ ఒకే విధంగా వర్తింపజేయాలి. అప్పుడే పోలీసుల చర్యలపై రాజకీయ అనుమానాలు తగ్గుతాయి. లేకపోతే ప్రతి అడ్డంకి ప్రతిపక్షానికి రాజకీయ ప్రచార ఆయుధంగా మారుతుంది. మరోవైపు వైఎస్సార్‌సీపీకి ఈ పరిణామాలు ఒక రాజకీయ అవకాశంగా మారుతున్నాయి. "మమ్మల్ని అడ్డుకుంటున్నారు" అనే సందేశం ప్రతిపక్షానికి ఎప్పుడూ బలమైన ఆయుధమే. నాయకులను అడ్డుకున్న ప్రతి దృశ్యం.. పోలీసులతో జరిగిన ప్రతి వాగ్వాదం.. సోషల్ మీడియాలో ప్రత్యక్షమవుతున్న ప్రతి వీడియో.. వైఎస్సార్‌సీపీ తన కార్యకర్తలకు ఒకే సందేశాన్ని పంపేలా చేస్తోంది. "పోరాటం ఇంకా ముగియలేదు" అనే భావనను పార్టీ శ్రేణుల్లో బలపరుస్తోంది. ప్రతిపక్షం బలహీనపడేది కేవలం ఎన్నికల్లో ఓడిపోవడం వల్ల కాదు. కార్యకర్తల్లో నమ్మకం కోల్పోయినప్పుడు.. నాయకులు ప్రజల్లోకి వెళ్లడం మానేసినప్పుడు.. ప్రత్యర్థి భయంతో పార్టీ వ్యవస్థ వెనక్కి తగ్గినప్పుడు.. అప్పుడే ప్రతిపక్షం నిజంగా బలహీనపడుతుంది. కానీ జగన్ స్వయంగా రోడ్డెక్కి కార్యకర్తలను ముందుకు నడిపిస్తున్నారనే భావన వైఎస్సార్‌సీపీ శ్రేణుల్లో ఒక మానసిక ఉత్సాహాన్ని పెంచుతోంది.

### జగన్‌కు అసలు రాజకీయ పరీక్ష మొదలు

ఇది జగన్ రాజకీయ శైలిలో కొత్త విషయం కాదు. ఆయన రాజకీయ ప్రయాణాన్ని పరిశీలిస్తే సవాళ్లను తప్పించుకోవడం కంటే ఎదుర్కోవడానికే ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చే నాయకుడిగా తనను తాను ప్రజల్లో నిలబెట్టుకున్నారు. విమర్శలు వచ్చినా వెనక్కి తగ్గకపోవడం.. ప్రతికూల పరిస్థితుల్లోనూ తన రాజకీయ ప్రయాణాన్ని కొనసాగించడం.. పార్టీ శ్రేణులను తన చుట్టూ సమీకరించడం.. ఇవన్నీ ఆయన రాజకీయ వ్యక్తిత్వంలో భాగంగా మారాయి. అందుకే జగన్‌ను కేవలం మాజీ ముఖ్యమంత్రిగా చూస్తే ఆయన రాజకీయ ప్రభావాన్ని పూర్తిగా అర్థం చేసుకోలేం. ఆయనకు ఒక వ్యక్తిగత ఓటు బ్యాంక్ ఉంది. ఒక వ్యక్తిగత అభిమాన వర్గం ఉంది. సంక్షేమ పథకాల ద్వారా ఏర్పడిన ఒక సామాజిక అనుబంధం ఉంది. కుటుంబ రాజకీయ వారసత్వం నుంచి వచ్చిన గుర్తింపు ఉంది. అదే సమయంలో ఆయన పాలనపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసిన వర్గాలూ ఉన్నాయి. ఈ రెండు వాస్తవాల మధ్యే జగన్ రాజకీయ స్థానం ఉంది. అందుకే ఆయన రాజకీయ భవిష్యత్తును కేవలం గత ఎన్నికల ఫలితాలతో కొలవడం తొందరపాటు. జగన్‌కు అసలు పరీక్ష ఇప్పుడు మొదలైంది. ఎన్నికల్లో ఓడిపోయిన తర్వాత కూడా ప్రజల్లో తన రాజకీయ ఉనికిని నిలబెట్టుకోగలరా? కార్యకర్తలను తిరిగి చైతన్యపరచగలరా? పార్టీని నియోజకవర్గ స్థాయిలో పునర్నిర్మించగలరా? ప్రభుత్వంపై ప్రజల్లో అసంతృప్తిని రాజకీయ ప్రత్యామ్నాయంగా మలచగలరా? ఇవే కీలక ప్రశ్నలు. కేవలం పెద్ద సంఖ్యలో జనాలు కనిపించడం సరిపోదు. ఆ జనస్పందనను నిరంతర రాజకీయ ఉద్యమంగా మార్చాలి. ఆ ఉద్యమాన్ని పార్టీ సంస్థాగత బలంగా మార్చాలి. చివరకు ఆ సంస్థాగత బలాన్ని ఓటుగా మార్చాలి. ఈ ప్రయాణంలో జగన్ ముందున్న దారి సులువు కాదు.

### జగన్‌ను అడ్డుకోవడం.. టీడీపీకి కొత్త సవాలు

జగన్ పర్యటనలను అడ్డుకోవడం టీడీపీ ప్రభుత్వానికి రాజకీయంగా కొత్త సవాలుగా మారుతోంది. పరిపాలనా పరంగా ఆంక్షలు విధించడం సాధ్యమే. కానీ ఒక నాయకుడి రాజకీయ ప్రభావాన్ని ఆదేశాలతో తగ్గించడం అంత సులభం కాదు. జగన్‌కు జనస్పందన కనిపిస్తే.. టీడీపీ మరింత ప్రజలను తనవైపు తిప్పుకోవాలి. జగన్ ప్రభుత్వాన్ని విమర్శిస్తే.. కూటమి ప్రభుత్వం తన పనితీరును ప్రజల ముందు బలంగా చూపించాలి. ఒకప్పుడు నాయకుడిని పోలీసులు అడ్డుకుంటే ఆ వార్త మరుసటి రోజు పత్రికల్లో కనిపించేది. ఇప్పుడు ఒక్క మొబైల్ వీడియో చాలు.. నిమిషాల్లో వేల మందికి, లక్షల మందికి చేరుతుంది. పోలీసులతో వాగ్వాదం, రోడ్డుపై అడ్డుకోవడం, కార్యకర్తల ఆగ్రహం.. ఇవన్నీ సోషల్ మీడియాలో కొత్త రాజకీయ కథనాలుగా మారుతున్నాయి. కర్నూలులోనూ ఇదే పరిణామం కనిపించింది. అడ్డంకి పెరిగే కొద్దీ ఆసక్తి పెరిగింది. ఆసక్తి పెరిగే కొద్దీ వీడియోలు వైరల్ అయ్యాయి. చివరకు పర్యటనకంటే అడ్డుకున్న ఘటనకే ఎక్కువ ప్రచారం దక్కింది. రాయలసీమలో జగన్‌కు ఉన్న వ్యక్తిగత, కుటుంబ రాజకీయ అనుబంధం వైఎస్సార్‌సీపీకి బలంగా కనిపిస్తోంది. కడప, కర్నూలు, అనంతపురం, చిత్తూరు ప్రాంతాల్లో ఈ ప్రభావం ప్రత్యేకంగా కనిపించొచ్చు. కోస్తా జిల్లాల్లో సంక్షేమ పథకాల ద్వారా ఏర్పడిన వర్గాల మద్దతు మరో అంశం. పట్టణాల్లో ప్రభుత్వంపై ఉన్న అసంతృప్తిని ప్రతిపక్షం ఎంత సమర్థంగా రాజకీయంగా మలుస్తుందన్నది కీలకం. జగన్‌ను రోడ్డుపై ఆపడం కంటే.. ప్రజల మనసుల్లో ఆయనకు ఉన్న స్థానాన్ని రాజకీయంగా మార్చడం పెద్ద సవాలు. ప్రభుత్వం తన అభివృద్ధిని చూపించాలి. గత పాలనపై తన వాదనను బలంగా వినిపించాలి. ప్రతిపక్షం సభకు రాకుండా చేయడం కాదు.. సభకు వచ్చినా ప్రజలు ఎవరి మాట నమ్ముతున్నారన్నదే అసలు పరీక్ష. ఈ పోరులో పోలీసులు, ఆంక్షల కంటే ప్రజాభిప్రాయమే తుది తీర్పు చెప్పనుంది.

### కర్నూలుతో 2029 రాజకీయ సమరం

2029 సమరం కర్నూలుతోనే మొదలైందని చెప్పడానికి ఈ ఘటన ఒక సంకేతం. ఇక పోరాటం సభల్లో మాత్రమే కాదు.. రోడ్లపై, సోషల్ మీడియాలో, ప్రజల మధ్య, స్థానిక సమస్యలపై జరుగుతుంది. గత పాలన-ప్రస్తుత పాలన, అభివృద్ధి-సంక్షేమం చివరకు "ఎవరిని నమ్మాలి?" అనే ప్రశ్నగా మారుతుంది. జగన్ పర్యటనలను అడ్డుకోవడం పరిష్కారం కాదు. ఆయన రాజకీయ పునరాగమనాన్ని ఎదుర్కోవాలంటే ప్రజల నమ్మకాన్ని గెలుచుకోవడమే కూటమికి అసలు మార్గం. జగన్ ప్రజల్లోకి వస్తే ప్రభుత్వం కూడా ప్రజల్లోనే ఉండాలి. సమస్యలు వినాలి, పరిష్కరించాలి, తన పనితీరును వివరించాలి. అదే ప్రతిపక్ష ప్రచారానికి బలమైన సమాధానం. మరోవైపు జగన్‌కు కూడా జనసందోహం, సోషల్ మీడియా హడావుడి మాత్రమే సరిపోవు. గత పాలనలో జరిగిన తప్పులకు సమాధానం చెప్పాలి. అధికారంలోకి వస్తే ఏం చేస్తారో స్పష్టమైన ప్రత్యామ్నాయాన్ని ప్రజల ముందు పెట్టాలి. కర్నూలులో కనిపించిన జనస్పందన అధికారానికి హెచ్చరిక, ప్రతిపక్షానికి అవకాశం. ఆ జనాల్లో అభిమానులు ఎంతమంది? కార్యకర్తలు ఎంతమంది? సాధారణ ప్రజలు ఎంతమంది? ప్రభుత్వంపై అసంతృప్తితో వచ్చినవారు ఎంతమంది? ఈ లెక్కలను పార్టీలు ఇప్పుడే విశ్లేషించాలి. పోలీసులు ర్యాలీని ఆపగలరు.. కాన్వాయ్‌ను నిలిపివేయగలరు. కానీ ప్రజల్లో మొదలైన రాజకీయ చర్చను మాత్రం ఆపలేరు. మాట చర్చగా.. చర్చ అభిప్రాయంగా.. అభిప్రాయం ఓటుగా మారుతుందా లేదా అన్నదే 2029 అసలు సమరం. ఆ తీర్పును పోలీసులు ఇవ్వరు. పార్టీలు ఇవ్వవు. సోషల్ మీడియా ఇవ్వదు. జనసందోహం కూడా ఇవ్వదు. చివరికి ప్రజలే ఇస్తారు.

### మరో రాజకీయ కథకు కర్నూలు శ్రీకారం

కర్నూలులో కనిపించిన దృశ్యాలు ఒక పర్యటనతో ముగిసిపోయే రాజకీయ పరిణామాలు కావు. ఇవి రాబోయే రోజుల్లో ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో మరో కొత్త కథకు పునాది వేస్తున్న సంకేతాలు. జగన్ రోడ్డెక్కడం, జనాలు స్పందించడం, పోలీసులు ఆంక్షలు విధించడం, వాటిపై రాజకీయ విమర్శలు రావడం.. ఇవన్నీ కలిసి ఇప్పటికే ఒక కొత్త రాజకీయ కథనాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లే వాతావరణాన్ని సృష్టిస్తున్నాయి. ఈ కథనం కేవలం జగన్ వర్సెస్ కూటమిగా ఉండకపోవచ్చు. ప్రజా సమస్యలు, ప్రభుత్వ పనితీరు, గత పాలన, భవిష్యత్ హామీలు, నాయకత్వ సామర్థ్యం వంటి అంశాలు ఇందులో కీలకంగా మారవచ్చు. రాబోయే రోజుల్లో జగన్ చేసే ప్రతి పర్యటనకు ఒక రాజకీయ అర్థం ఉంటుంది. ప్రతి అడ్డంకి ఒక చర్చకు దారితీస్తుంది. ప్రతి జనస్పందన ఒక కొత్త లెక్కను తెరపైకి తెస్తుంది. అదే సమయంలో ప్రభుత్వం తీసుకునే ప్రతి నిర్ణయం కూడా ప్రతిపక్షానికి ఒక రాజకీయ అంశంగా మారే అవకాశం ఉంది. దీంతో 2029 ఎన్నికల సమరం ఎన్నికల షెడ్యూల్ వచ్చిన తర్వాత కాదు.. ఇప్పటి నుంచే ప్రజల మనసుల్లో రూపుదిద్దుకునే పరిస్థితి కనిపిస్తోంది. కర్నూలు ఒక ఘటన మాత్రమే కావచ్చు. కానీ దాని నుంచి మొదలయ్యే రాజకీయ కథ మాత్రం రాష్ట్రవ్యాప్తంగా మరింత పెద్ద చర్చకు దారి తీసే అవకాశం ఉంది. చివరికి ఎవరి కథ ప్రజలను నమ్మిస్తుందో.. ఎవరి మాట ఓటుగా మారుతుందో.. అదే 2029 రాజకీయ తీర్పును నిర్ణయించనుంది.

జనసందోహం కనిపిస్తోందని 2029 ఫలితాలను ముందే అంచనా వేయలేం. సభకు వచ్చిన ప్రతి వ్యక్తి జగన్ ఓటరే కాదు. అయితే జనస్పందనను నిర్లక్ష్యం చేయడమూ ప్రమాదమే. జనాలు వస్తున్నంతకాలం జగన్ రాజకీయ ప్రభావంపై చర్చ కొనసాగుతుంది. ఎన్నికలకు మూడేళ్ల ముందే జగన్ యాత్రలు వేగం పెంచితే.. ప్రతి ప్రజా సమస్యను ప్రభుత్వంపై దాడికి ఉపయోగించుకోవచ్చు. అందుకే ప్రజల అసంతృప్తి రాజకీయ ఆయుధంగా మారకముందే ప్రభుత్వం సమస్యలను పరిష్కరించాలి. వైఎస్సార్‌సీపీకి కూడా జనస్పందనే విజయానికి హామీ కాదన్న విషయం గుర్తుండాలి. గత ఎన్నికలు అదే పాఠం చెప్పాయి. ప్రజాదరణతో పాటు స్థానిక నాయకత్వం, అభ్యర్థుల ఎంపిక, సామాజిక సమీకరణాలు, కూటముల ప్రభావం కీలకం. అందుకే జగన్ జనాలను సమీకరించడంతో

## 2029కు ముందే జగన్ రాజకీయ వ్యూహం

పాటు పార్టీని పునర్నిర్మించాలి. కార్యకర్తలకు భరోసా ఇవ్వాలి. స్థానిక నాయకత్వాన్ని బలోపేతం చేయాలి. యువత, రైతులు, మహిళలు, ఉద్యోగులు, మధ్యతరగతి వంటి వర్గాలకు ప్రత్యేక రాజకీయ సందేశం ఇవ్వాలి. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమికి కూడా అంతర్గత సమన్వయం అత్యంత కీలకం. నాయకత్వ పోటీలు, విభేదాలు పెరిగితే అవే జగన్‌కు రాజకీయ అవకాశాలుగా మారతాయి. ప్రభుత్వం ఎంత బలంగా పనిచేసినా పార్టీ యంత్రాంగం బలహీనపడితే ఆ ప్రభావం ఎన్నికల్లో కనిపించదు. అందుకే 2029 కోసం జగన్ రోడ్డుపై బలం పెంచుకుంటున్న సమయంలో.. కూటమి పాలనతో పాటు సంస్థాగత బలాన్ని కూడా పటిష్ఠం చేసుకోవాల్సిందే.

# వయ్యారి భామా.. నీ హంస నడక

## వెళ్లిపో కుర్రాళ్ల కంట పడక



**అందమంతా అక్కడే ఉంది.. చూపు ఆగిన చోట.. ప్రేమ మొదలైన చోట.. అందం కోసం ప్రపంచం ఎన్నో దారులు వెతికింది.. పూలలో చూసింది, వెన్నెలలో చూసింది, చీర కొంగులో చూసింది, కళ్ల మెరుపులో చూసింది.. కానీ చివరికి అర్థమైంది అందం కంటికి కనిపించే రూపం కాదు.. మనసుకు తాకే అనుభూతి. ఒక చూపు క్షణం ఆగినప్పుడు పుట్టే మౌనమే అందం. ఒక చిరునవ్వు వెనుక దాగిన ఆత్మీయతే అందం. మాటలు ఆగిపోయినా మనసులు మాట్లాడుకునే నిశ్శబ్దమే అందం. కాలం ముఖంపై గీసిన గీతలు వయసును చెప్పొచ్చు.. కానీ ఒకరి కోసం మరొకరి కళ్లలో మెరుస్తున్న వెలుగు ప్రేమను చెబుతుంది. ఆకర్షణ శరీరాన్ని తాకొచ్చు.. కానీ అనుబంధం మనసును తాకుతుంది. చీర అందాన్ని చూపించొచ్చు.. ముఖం ఆకర్షించొచ్చు.. శరీరం కోరికను రేపొచ్చు.. కానీ గౌరవం, నమ్మకం, సమ్మతి కలిసిన చోటే ఆ అందం సంపూర్ణమవుతుంది. మొదటి చూపు "ఎంత అందం!" అంటుంది.. కాలం గడిచిన తర్వాత హృదయం "ఇదే నా మనిషి" అంటుంది. ఆ మాట పుట్టిన క్షణమే.. అందం అద్దాన్ని దాటి ఆత్మలోకి అడుగుపెడుతుంది. అక్కడే చూపు నిలుస్తుంది.. అక్కడే మనసు ఆగుతుంది.. అక్కడే ప్రేమ ఊపిరి పోసుకుంటుంది.**

### • అందం ఎక్కడుంది? మనసులోనే ఉందా?

అందం ఎక్కడుంది? అనే ప్రశ్నకు ప్రపంచం ఇప్పటివరకు ఒకే సమాధానం చెప్పలేకపోయింది. ఎందుకంటే అందం అనేది ఒక వస్తువు కాదు. చేతిలోకి తీసుకుని కొలిచే ప్రమాణం కాదు. అద్దంలో నిలబెట్టి తీర్పు చెప్పే రూపం కాదు. అది ఒక అనుభూతి. ఒక చూపు మరో చూపును తాకినప్పుడు పుట్టే నిశ్శబ్ద స్పందన. ఒక మనసు మరో మనసులో తనకు తెలియని ఏదో పరిచయాన్ని గుర్తించినప్పుడు కలిగే మౌన సంగీతం. అందుకే ఒకరికి అద్భుతంగా కనిపించిన ముఖం మరొకరికి సాధారణంగా కనిపిస్తుంది. ఒకరికి సాధారణంగా కనిపించిన మనిషి ఇంకొకరి జీవితంలో అత్యంత అందమైన జ్ఞాపకంగా మిగిలిపోతాడు. మరి ఈ బ్రహ్మ పదార్థం అసలు ఎక్కడుంది? చీర కొంగులోనా? కళ్లలోనా? నవ్వులోనా? శరీర వంపుల్లోనా? మాటల్లోనా? లేక మనసు తలుపు తెరిచే ఆత్మీయతలోనా? నిజం చెప్పాలంటే... అందం వీటిలో ఒక్కదానిలో లేదు. ఇవన్నీ కలిసినప్పుడు మనకు తెలియకుండా ఏర్పడే ఒక అనుభూతి రసాయనంలో ఉంది. మనిషి పుట్టినప్పటి నుంచి అందాన్ని వెతుకుతూనే ఉన్నాడు. ప్రకృతిలో వెతికాడు. పూలలో వెతికాడు. చంద్రుడిలో వెతికాడు. శిల్పాలలో వెతికాడు. చివరికి మనిషి ముఖంలో తన అందాన్ని తానే వెతుక్కున్నాడు. కానీ అందం గురించి మన అవగాహన కూడా మన వయసుతో పాటు మారుతూ ఉంటుంది. యవ్వనంలో కంటికి కనిపించేది ఎక్కువగా మాట్లాడుతుంది. వయసు పెరిగేకొద్దీ మనసు వినిపించేదే ఎక్కువగా ఆకట్టుకుంటుంది. ఇరవై ఏళ్ల వయసులో ఒక చిరునవ్వు వెనుక దాగిన శరీర భాష మనసును కదిలించవచ్చు. ముప్పై ఏళ్లకు అదే చిరునవ్వులోని ఆత్మవిశ్వాసం కనిపిస్తుంది. నలభై దాటిన తర్వాత అదే నవ్వులో మన కోసం ఉన్న ఓదార్పు కనిపించవచ్చు. రూపం మారలేదు. మారింది మన చూపు. అందుకే అందం ఒక స్థిరమైన వస్తువు కాదు; చూసే మనిషి అంతర్గత

**ఊహ ఊయలూగిన చోటా.. ప్రేమ ఊపిరి పోసుకున్న చోటా..**







### • వయసు పెరిగినా అందం మాత్రం తగ్గదా?

అందం గురించి మరో అపోహ ఉంది. వయసు పెరిగితే అందం తగ్గిపోతుందని అనుకోవడం. నిజానికి వయసుతో మారేది అందం కాదు; అందాన్ని చూసే భాష. యవ్వనంలో చర్మపు మెరుపు ఆకర్షించవచ్చు. కాలం గడిచేకొద్దీ ముఖంపై కనిపించే అనుభవాల రేఖలు కూడా అందంగా అనిపించవచ్చు. ఒక తల్లి ముఖంలో కనిపించే అలసటలో ప్రేమ ఉంటుంది. ఒక తండ్రి చేతుల్లో కనిపించే గట్టితనంలో బాధ్యత ఉంటుంది. జీవిత భాగస్వామి కళ్లలో కనిపించే నిశ్శబ్దంలో ఎన్నో సంవత్సరాల సహజీవనం ఉంటుంది. ఇవి అద్దంలో కనిపించే అందాలు కావు. జీవితం చదివిన కళ్లకు మాత్రమే కనిపించే అందాలు. ఇరవై ఏళ్ల వయసులో మనం అందాన్ని ఎక్కువగా చూస్తాం. ముప్పైలో అందాన్ని అర్థం చేసుకోవడం మొదలు పెడతాం. నలభైలో అందాన్ని అనుభవిస్తాం. ఆ తర్వాత ఒక దశలో అందాన్ని వెతకడం కూడా ఆపేస్తాం. ఎందుకంటే మనకు అర్థమవుతుంది మన పక్కన మనల్ని మనలాగే అంగీకరించే ఒక మనిషి ఉండటం కన్నా గొప్ప అందం మరొకటి లేదని. వృద్ధాప్యంలో కూడా ఒకరినొకరు పేరుతో కాకుండా ప్రేమతో పిలుచుకునే దంపతుల ముఖాల్లో కనిపించే వెలుగు, యవ్వనపు అందానికి ఏ మాత్రం తీసిపోదు. అక్కడ శరీరం కంటే కలిసి గడిపిన కాలమే అందంగా మారుతుంది. అందం కేవలం చూసేవాడి కళ్లలో ఉందని చెప్పడం కూడా పూర్తి సత్యం కాదు. ఎందుకంటే చూసే కళ్ల వెనుక ఒక మనసు ఉంటుంది. ఆ మనసు అనుభవాలు, విలువలు, కోరికలు, జ్ఞాపకాలు, భయాలు, ప్రేమలతో తయారవుతుంది. అందుకే అందం అనేది కళ్లూ మనసూ కలిసి చేసే ఒక సృష్టి. ఒకరిని అందంగా చూసే క్షణంలో నిజానికి మనం ఆ వ్యక్తిలో మనకు నచ్చిన ఏదో ఒక విలువను కూడా చూస్తున్నాం. కొన్నిసార్లు మనం ప్రేమించిన మనిషి ముఖం ప్రపంచంలోనే అత్యంత అందమైన ముఖంగా అనిపించడం దీనివల్లే.

ప్రయాణానికి అద్దం.

### • చీరలో అందం.. ముఖంలో భావం.. ఆకర్షణ

చీర గురించి మాట్లాడితే మన సంస్కృతిలో అందానికి ఒక ప్రత్యేకమైన భాష కనిపిస్తుంది. చీర అందాన్ని సృష్టించదు. ఉన్న అందాన్ని ఒక రీతిలో ఆవిష్కరిస్తుంది. వస్త్రం శరీరాన్ని పూర్తిగా చూపించకుండా, దాని ఆకృతిని సూచిస్తూ, ఊహకు కొంత స్థలం వదిలిపెడుతుంది. మనస్తత్వశాస్త్రంలో మానవ మెదడు అసంపూర్ణ సమాచారాన్ని తన ఊహతో పూర్తి చేయాలనే ప్రవృత్తి కలిగి ఉంటుంది. అందుకే పూర్తిగా వెల్లడైన దానికంటే కొంత రహస్యాన్ని మిగిల్చిన దృశ్యం ఎక్కువకాలం మనసులో నిలిచిపోవచ్చు. చీరలోని అందం అక్కడే. కొంగు జారిన తీరు కంటే దాన్ని సర్దుకునే సహజత్వం, నడకలోని హుందాతనం, వస్త్రధారణలోని ఆత్మవిశ్వాసం... ఇవే అసలు అందానికి భాష్యం చెబుతాయి. చీర కట్టుకున్నందుకే ఒక స్త్రీ అందంగా మారదు. ఆమె వ్యక్తిత్వాన్ని చీర మరింత స్పష్టంగా పలికించినప్పుడు మాత్రమే ఆ వస్త్రానికి అందంతో సంబంధం ఏర్పడుతుంది. మరి ముఖం? మనిషిని మొదట గుర్తించేది ముఖమే. ఒక ముఖాన్ని చూసిన క్షణంలోనే మెదడు అనేక సమాచారాలను వేగంగా విశ్లేషిస్తుంది. కళ్లలోని చలనం, ముఖంలోని ప్రశాంతత, చిరునవ్వులోని సహజత్వం, మాట్లాడే తీరు... ఇవన్నీ కలిసి మనకు ఒక వ్యక్తి గురించి మొదటి భావనను ఇస్తాయి. అందుకే మేకప్ ముఖాన్ని మార్చగలదు కానీ వ్యక్తిత్వాన్ని మార్చలేదు. ఖరీదైన దుస్తులు ఆకర్షణను పెంచవచ్చు కానీ కృత్రిమమైన ప్రవర్తనను దాచలేవు. ముఖంపై పూసిన రంగుల కంటే, ముఖం నుంచి వెలువడే భావోద్వేగమే ఎక్కువకాలం నిలుస్తుంది. నిజమైన చిరునవ్వుకు ప్రత్యేకమైన అందం ఉంటుంది. ఎందుకంటే అది పెదవుల మీద మాత్రమే ఉండదు; కళ్లలో కూడా కనిపిస్తుంది. అహంకారంతో కూడిన అందమైన ముఖం కాసేపు ఆకర్షించవచ్చు. ప్రశాంతతతో కూడిన సాధారణ ముఖం మాత్రం ఎక్కువకాలం గుర్తుండిపోవచ్చు. అయితే శరీర ఆకర్షణను పూర్తిగా తిరస్కరించడం కూడా నిజాయితీ కాదు. మనిషి జీవశాస్త్రంలో లైంగిక ఆకర్షణకు ఒక సహజమైన స్థానం ఉంది. ఒక వ్యక్తి శరీర ఆకృతి, ముఖ లక్షణాలు, కదలికలు, స్వరం, వాసన వంటి అనేక అంశాలు అవగాహనకు ముందే ఆకర్షణను కలిగించగలవు. సెక్సాలజీ దృష్టిలో ఇది అసాధారణమైన విషయం కాదు. మానవ మెదడులో ఆకర్షణకు సంబంధించిన జీవశాస్త్రీయ, హార్మోనల్, మానసిక ప్రక్రియలు పనిచేస్తుంటాయి. అందుకే ఎవరో ఒకరిని చూసినప్పుడు ఒక్కసారిగా గుండె వేగం మారినట్టు అనిపించవచ్చు. ఆ వ్యక్తి దగ్గరగా ఉన్నప్పుడు ఒక ప్రత్యేకమైన ఉత్కంఠ కలగవచ్చు. ఇది మానవ సహజత్వంలో భాగం.

### • ఆకర్షణ వేరు.. అందం వేరు.. అసలు తేడా ఇదే

కానీ ఇక్కడే ఒక ముఖ్యమైన తేడాను గుర్తించాలి. ఆకర్షణ అందంలో ఒక భాగం కావచ్చు; కానీ ఆకర్షణే మొత్తం అందం కాదు. శరీరంలోని ఒక భాగాన్ని చూసి కలిగే స్పందన లైంగిక ఆకర్షణ కావచ్చు. కానీ ఒక మనిషిని సంపూర్ణంగా అందంగా అనిపించేది అతని లేదా ఆమె మొత్తం వ్యక్తిత్వంతో ఏర్పడే అనుభూతి. శరీరాన్ని మాత్రమే చూసే చూపు ఒక మనిషిని ఒక వస్తువుగా మార్చే ప్రమాదం ఉంది. వ్యక్తిత్వాన్ని చూసే చూపు మాత్రం మనిషిని మనిషిగానే ఉంచుతుంది. అందుకే ఆకర్షణలో కోరిక ఉండవచ్చు; అందంలో గౌరవం కూడా ఉంటుంది. ఆకర్షణ క్షణాన్ని మండించవచ్చు; అనుబంధం ఆ క్షణాన్ని జ్ఞాపకంగా మార్చుతుంది. సెక్సాలజీ మనకు చెప్పే ముఖ్యమైన సత్యాల్లో ఒకటి ఇదే: లైంగిక ఆకర్షణ కేవలం శరీరంతో నిర్ణయించబడదు. మనసు, భావోద్వేగ భద్రత, నమ్మకం, పరస్పర గౌరవం, సంభాషణ, వ్యక్తిగత అనుభవాలు కూడా ఆకర్షణను ప్రభావితం చేస్తాయి. ఒక వ్యక్తి మనతో ఎలా మాట్లాడుతున్నాడు, మన హద్దులను ఎంత గౌరవిస్తున్నాడు, మన అభిప్రాయాన్ని ఎంత శ్రద్ధగా వింటున్నాడు, మన సమ్మతిని ఎంత విలువైనదిగా చూస్తున్నాడు... ఇవన్నీ సంబంధంలో ఆకర్షణకు కొత్త అర్థాన్ని ఇస్తాయి. అందుకే శరీరానికి దగ్గర కావడం కంటే ముందు మనసుకు దగ్గర కావడం అనేక సంబంధాల్లో మరింత శక్తివంతమైన అనుభవంగా మారుతుంది.

### • ఫీలింగ్స్‌లోనే అసలు అందం దాగి ఉంటుందా?

అసలు అందం ఎక్కడ ఎక్కువకాలం నిలుస్తుందంటే... ఫీలింగ్స్‌లో. నిన్ను చూసినప్పుడు ఎవరి ముఖంలో వెలుగు వస్తుందో అక్కడ అందం ఉంది. నీవు మాట్లాడుతున్నప్పుడు ఎవరో నిజంగా వినాలని అనుకుంటే అక్కడ అందం ఉంది. నీవు బలహీనంగా ఉన్నప్పుడు నీ బలహీనతను ఉపయోగించుకోకుండా నీ పక్కన నిలబడే మనిషిలో అందం ఉంది. నీవు 'వద్దు' అని చెప్పినప్పుడు ఆ మాటను గౌరవించే మనసులో అందం ఉంది. నీవు విజయం సాధించినప్పుడు అసూయ పడకుండా నిజంగా సంతోషించే హృదయంలో అందం ఉంది. ఎందుకంటే శరీరం మనకు కనిపిస్తుంది; కానీ భావోద్వేగ భద్రత మనకు అనుభూతి అవుతుంది. అందుకే కొన్నిసార్లు మనం ఒక వ్యక్తిని మొదట చూసినప్పుడు పెద్దగా ఆకర్షితులం కాకపోవచ్చు. కానీ రోజులు గడిచేకొద్దీ ఆ వ్యక్తి మాట తీరు, హాస్యం, తెలివి, దయ, మన పట్ల చూపే శ్రద్ధ మనసులో చోటు సంపాదించవచ్చు. అప్పుడు ఒక విచిత్రమైన పరిణామం జరుగుతుంది. మొదట సాధారణంగా కనిపించిన ముఖమే క్రమంగా అందమైన ముఖంగా మారుతుంది. ఎందుకంటే మన మెదడు ఆ వ్యక్తిని కేవలం ఒక ముఖంగా కాకుండా, అనుభవాల సమాహారంగా చూడడం మొదలు పెడుతుంది. మన జ్ఞాపకాలు ఒక ముఖానికి రంగులు అద్దుతాయి. మన అనుబంధం ఒక స్వరానికి సంగీతం ఇస్తుంది. ప్రేమ ఒక సాధారణ క్షణాన్ని కూడా అసాధారణంగా మార్చేస్తుంది.

### • మాటల్లో మొదలై.. మనసుల్లో రొమాన్స్ పుడుతుందా?

అందుకే కలిసి మాట్లాడటం అందాన్ని పరీక్షించే అత్యంత నిజమైన అద్దం. పది నిమిషాలు మాట్లాడిన తర్వాత విషయం అయిపోయే అందం ఒక రకమైనది. రెండు గంటలు మాట్లాడినా ఇంకా ఏదో చెప్పాలనిపించే అనుబంధం మరో రకమైనది. అందమైన మాటలు చెప్పడం కంటే ఎదుటివారి మాట వినగలగడం గొప్ప గుణం. తెలివి ఆకర్షించవచ్చు. హాస్యం దగ్గర చేయవచ్చు. కానీ వినే గుణం నమ్మకాన్ని పెంచుతుంది. నమ్మకం పెరిగిన చోటే ఆత్మీయత పుడుతుంది. ఆత్మీయత పుట్టిన చోటే రొమాన్స్‌కు నిజమైన నేల సిద్ధమవుతుంది. రొమాన్స్ అంటే కేవలం శారీరక సమీపం కాదు. ఇద్దరు మనుషులు తమ తమ ఒంటరితనాన్ని కొంతసేపు పక్కన పెట్టి, ఒకరి సమక్షంలో మరొకరు సురక్షితంగా ఉండగలిగే స్థితి. ఒక చూపు మాటకన్నా ఎక్కువ చెప్పడం. ఒక స్పర్శలో ఆప్యాయత ఉండటం. ఒక మౌనంలో అసౌకర్యం కాకుండా సాన్నిహిత్యం ఉండటం. ఇవన్నీ రొమాన్స్‌లో భాగాలు. శారీరక సమీపతకు కూడా అందమైన అర్థం రావాలంటే పరస్పర సమ్మతి, గౌరవం, విశ్వాసం అవసరం. కోరిక ఒక్కటే సంబంధాన్ని నిలబెట్టదు. కోరికకు గౌరవం తోడైతేనే అది ఆత్మీయతగా మారుతుంది. శరీరాన్ని గురించి మాట్లాడేటప్పుడు మన సమాజం రెండు అంచుల్లో తిరుగుతుంది. ఒక వైపు శరీరాన్ని దాచాల్సిన విషయం లాగా చూస్తుంది. మరో వైపు శరీరాన్ని వినియోగించుకునే వస్తువుగా చూపించే సంస్కృతి పెరుగుతోంది. రెండూ అసంపూర్ణ దృక్కోణాలే. శరీరం సిగ్గుపడాల్సినది కాదు; అలాగే మనిషి విలువను శరీరంతో మాత్రమే కొలవాల్సిన అవసరం లేదు. శరీర ఆకర్షణ సహజం. దాన్ని గౌరవంగా అర్థం చేసుకోవడం పరిపక్వత. ఎదుటి వ్యక్తి శరీరాన్ని చూసి ఆకర్షితులవడం ఒక మానవ అనుభూతి కావచ్చు; కానీ ఆ ఆకర్షణ ఆధారంగా హక్కు మనకు వచ్చిందని భావించడం మాత్రం తప్పు. ఆకర్షణకు హద్దులు ఉన్నాయి. సమ్మతి ఆ హద్దును నిర్ణయిస్తుంది.

### • అందం కంటితో మొదలై మనసుతో ముగుస్తుందా?

అందుకే చివరికి ప్రశ్నను మార్చాలి. "అందం ఎక్కడుంది?" అని అడగడం కంటే "ఎవరిని చూసినప్పుడు మనలో అందమైన భావం పుడుతోంది?" అని అడగాలి. ఎందుకంటే అందం మనిషి శరీరంలో ఉండవచ్చు; కానీ దాని అర్థం మనలో పుడుతుంది. ఒక చూపు దాన్ని ప్రారంభిస్తుంది. ఒక మాట దాన్ని పెంచుతుంది. ఒక స్పర్శ దాన్ని గాఢం చేస్తుంది. ఒక నమ్మకం దాన్ని నిలబెడుతుంది. ఒక బాధ్యత దానికి అర్థం ఇస్తుంది. ఒక జీవిత ప్రయాణం దాన్ని శాశ్వత జ్ఞాపకంగా మార్చుతుంది. అందుకే చీరలో అందం ఉంది. కానీ చీరే అందం కాదు. ముఖంలో అందం ఉంది కానీ ముఖమే అందం కాదు. శరీర ఆకర్షణలో అందం ఉంది కానీ శరీరమే అందం కాదు. మాటల్లో అందం ఉంది కానీ మాటలే అందం కాదు. ఫీలింగ్స్‌లో అందం ఉంది కానీ ఒక్క భావోద్వేగమే సంపూర్ణ అందం కాదు. ఇవన్నీ కలిసినప్పుడు, ఒక మనిషిని మరొక మనిషి కేవలం చూడటం కాదు... అనుభవించడం మొదలుపెట్టినప్పుడు, అక్కడే ఆ బ్రహ్మ పదార్థం రూపం దాల్చుతుంది. చివరికి అందం కంటితో మొదలై మనసుతో ముగిసే ప్రయాణం. మొదటి చూపు "ఎంత అందంగా ఉంది!" అని చెప్పవచ్చు. కొంతకాలం తర్వాత మనసు "ఎంత బాగా ఉంది!" అంటుంది. మరికొంతకాలం తర్వాత హృదయం "ఇది నా మనిషి" అంటుంది. ఆ చివరి మాటలోనే అందం తన పరిపూర్ణతను చేరుతుంది. ఎందుకంటే మనిషిని కేవలం చూడటం ఆకర్షణ. మనిషిని అర్థం చేసుకోవడం అనుబంధం. మనిషిని గౌరవించడం ప్రేమ. మనిషి సమక్షంలో మనసుకు ప్రశాంతత కలగడం అదే అసలైన అందం.

### • అందం అద్దంలో కాదు.. నమ్మకంలో ఉంటుందా?

అందుకే అందం అనే బ్రహ్మ పదార్థం అద్దంలో దొరకదు. అది చీర కొంగులో చిక్కుకోదు. శరీరపు వంపుల్లో పూర్తికాదు. పెదవుల నవ్వులో మొదలైనా అక్కడే ఆగిపోదు. అది ఇద్దరి మధ్య పుట్టే ఆ చెప్పలేని నమ్మకంలో ఉంటుంది. "నేను ఎలా ఉన్నా నన్ను అర్థం చేసుకునే ఒక మనిషి ఉన్నాడు" అనే భరోసాలో ఉంటుంది. "నా శరీరాన్ని మాత్రమే కాదు, నా మనసును కూడా చూస్తున్నాడు" అనే భద్రతలో ఉంటుంది. "నా కోరికను మాత్రమే కాదు, నా సమ్మతిని కూడా గౌరవిస్తున్నాడు" అనే విశ్వాసంలో ఉంటుంది. అక్కడే ఆకర్షణ ప్రేమగా మారుతుంది. అక్కడే శరీరం అనుబంధానికి ఒక భాషగా మారుతుంది. అక్కడే రొమాన్స్ కేవలం క్షణికమైన ఉద్వేగం కాకుండా ఒక జీవనానుభూతిగా మారుతుంది. అక్కడే అందం వయసును దాటి నిలబడుతుంది. అప్పుడు అద్దంలో ముడతలు కనిపించినా మనసులో యవ్వనం ఉంటుంది. జుట్టులో తెలుపు చేరినా చూపులో వెలుగు ఉంటుంది. శరీరం కాలంతో మారినా, ఒకరినొకరు చూసే విధానం మారకపోతే... ఆ ఇద్దరి మధ్య అందం ఇంకా బతికే ఉంటుంది. అందుకే అందం ఒక ముఖం కాదు. ఒక శరీరం కాదు. ఒక వస్త్రం కాదు. ఒక వయసు కాదు. ఒక ప్రమాణం కాదు.

అందం అంటే ఒక మనిషిని చూసినప్పుడు మనలో పుట్టే మంచి భావం. కంటికి నచ్చేది ఆకర్షణ కావచ్చు. మనసుకు నచ్చేది అనుబంధం కావచ్చు. హృదయానికి నచ్చేది ప్రేమ కావచ్చు.కానీ మనిషిని సంపూర్ణంగా గౌరవిస్తూ, అర్థం చేసుకుంటూ, అతని/ఆమె సమక్షంలో మనసుకు ప్రశాంతత కలిగినప్పుడు... అదే అందం అనే బ్రహ్మ పదార్థం. హుస్సేన్...

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో ప్రస్తుతం అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కంటే సజ్జల రామకృష్ణారెడ్డిదే పైచేయి అన్న భావన కలిగేలా విజయసాయి రెడ్డి చేసిన వ్యాఖ్యలు రాజకీయంగా సంచలనం రేపుతున్నాయి. "ఇప్పుడు వైసీపీ పార్టీలో నంబర్ 2 ఎవరంటే జగన్.. నంబర్ వన్ ఎవరంటే సకల శాఖల మంత్రి సజ్జల" అంటూ విజయసాయి రెడ్డి తన బహిరంగ లేఖలో తీవ్ర వ్యాఖ్యలు చేశారు. పార్టీ వ్యవహారాల్లో సజ్జల ఆధిపత్యం పెరిగిపోయిందని, ఆయన ఆదేశాలకు తలవంచి పనిచేయడం తనకు సాధ్యం కాలేదని స్పష్టం చేశారు. తన ఆత్మగౌరవాన్ని పక్కన పెట్టి పార్టీలో కొనసాగాల్సిన పరిస్థితి రావడంతోనే వైసీపీకి రాజీనామా చేశానని వెల్లడించారు. సజ్జల ఆదేశాలకు తలవంచి సర్దుకుపోవడం తన వల్ల కాదని, నమస్కారాలు, సాష్టాంగాలు, దండాలు పెట్టి పార్టీలో కొనసాగలేనని ఘాటుగా వ్యాఖ్యానించారు. వైసీపీ నుంచి తాను బయటకు రావడానికి రాజకీయ భవిష్యత్తు కోసం వేసుకున్న అడుగు కాదని, తనపై జరిగిన వరుస అవమానాలే ప్రధాన కారణమని విజయసాయి రెడ్డి పేర్కొన్నారు. 2024 ఎన్నికల తర్వాత పరిస్థితులు మరింత తీవ్రంగా మారాయని చెప్పారు. ఈ పరిణామాల నేపథ్యంలోనే పార్టీ సభ్యత్వంతో పాటు రాజ్యసభ పదవికి కూడా రాజీనామా చేశానని వివరించారు. ఇప్పుడు కొత్త రాజకీయ వేదిక ఏర్పాటు చేసుకునే దిశగా ముందుకు వెళ్తున్నానని ప్రకటించారు. ఈ మొత్తం వ్యవహారంలో తనపై "నమ్మకద్రోహి" అనే ముద్ర వేయడానికి ప్రయత్నిస్తున్నారని ఆరోపించిన విజయసాయి, తాను జగన్‌కు ఎప్పుడూ నమ్మకద్రోహం చేయలేదని స్పష్టం చేశారు. భవిష్యత్తులో కూడా అలాంటి పని చేయబోనని తేల్చి చెప్పారు. తనపై విమర్శలు చేస్తున్న వారే గతంలో పార్టీ అంతర్గత వ్యవస్థను ఎలా నడిపారో కార్యకర్తలు ఆలోచించుకోవాలని సూచించారు. దీంతో విజయసాయి లేఖలోని ప్రధాన అంశం సజ్జల ఆధిపత్యంపై చేసిన వ్యాఖ్యలుగా మారింది.



**సజ్జలే.. నంబర్ వన్ జగన్.. నంబర్ టూ**

# సజ్జల పెత్తనం.. పతనానికి విత్తనం

- శిశుపాలుడ్ని మించిన సజ్జల పాపాలు..
- కోటరీ కుట్రలు వైసీపీకి శాపాలు..
- జగన్‌ను డమ్మీ చేసి సజ్జల పెత్తనం..
- కోటరీ కుట్రలతో పతనానికి విత్తనం
- వైసీపీలో రియల్ స్టోరీ ఇదేనంటూ సాయిరెడ్డి లేఖ

## 2020 వరకు జగన్ వద్ద ప్రత్యేక స్థానం

విజయసాయి రెడ్డి తన లేఖలో మరో కీలక అంశాన్ని ప్రస్తావించారు. 2020 వరకు జగన్ దృష్టిలో తన మాటకు ఎంతో విలువ ఉండేదని, అదే కోటరీకి కంటగింపుగా మారిందని ఆరోపించారు. జగన్‌తో తనకు ఉన్న సన్నిహిత సంబంధం, రాజకీయ వ్యవహారాల్లో తనకు ఉన్న ప్రాధాన్యం కొందరికి నచ్చలేదని చెప్పారు. తాను ఎప్పుడూ కోటరీలో భాగం కాలేదని స్పష్టం చేశారు. జగన్ ఆదేశాల మేరకు ఢిల్లీలో ఉంటూ పార్టీకి, ప్రభుత్వానికి సంబంధించిన పనులు చూసుకున్నానని తెలిపారు. తాను ఢిల్లీలో కేంద్ర రాజకీయ వ్యవహారాల్లో బిజీగా ఉన్న సమయంలో సజ్జల మాత్రం జగన్‌కు దగ్గరగా ఉంటూ తనను రాజకీయంగా పక్కకు నెట్టే ప్రయత్నాలు చేశారని ఆరోపించారు. తనపై విపరీతంగా చాడీలు చెప్పించి, ఒక్కో బాధ్యత నుంచి అంచెలంచెలుగా తప్పించారని విజయసాయి పేర్కొన్నారు. ఒకప్పుడు జగన్ వద్ద తన మాటకు ఉన్న ప్రాధాన్యం క్రమంగా తగ్గిపోయిందని చెప్పారు. ఈ మార్పు వెనుక కోటరీ రాజకీయాలు ఉన్నాయని ఆరోపించారు. జగన్ ఏర్పాటు చేసిన వ్యవస్థలో తాను అనేక సందర్భాల్లో ఆత్మాభిమానాన్ని దెబ్బతీసే పరిణామాలను ఎదుర్కొన్నానని, అయినా పార్టీ ప్రయోజనాల కోసం చాలా విషయాలను బయటకు చెప్పకుండా భరించానని వివరించారు. తనపై జరిగిన అవమానాలు ఒక్కటి రెండు కాదని, మొత్తం 74 అవమానకర ఘటనలు ఉన్నాయని విజయసాయి రెడ్డి వెల్లడించారు. ఈ విషయాలన్నింటినీ ఇంతకాలం తనలోనే దాచుకున్నానని చెప్పారు. జగన్‌ను ఇబ్బందుల్లోకి నెట్టకూడదనే ఉద్దేశంతో బహిరంగంగా మాట్లాడలేదని ఆయన వ్యాఖ్యానించారు. తనకు పార్టీతో ఉన్న అనుబంధం కంటే వ్యక్తిగత పదవి ముఖ్యం అయితే చాలా కాలం క్రితమే వేరే మార్గం ఎంచుకునేవాడినని చెప్పేలా తన లేఖలో వివరణ ఇచ్చారు. తాను పార్టీకి చేసిన సేవలను గుర్తించకుండా, తనపై వచ్చిన ఆరోపణలను మాత్రమే ప్రచారంలోకి తెస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

## ప్లీనరీ ఘటనతో పెరిగిన విభేదాలు

విజయసాయి రెడ్డి లేఖలో అత్యంత తీవ్రమైన ఆరోపణల్లో 2022 మంగళగిరి ప్లీనరీ ఘటన ఒకటి. పార్టీ ప్లీనరీలో సజ్జల రామకృష్ణారెడ్డి తనపై డైరెక్టుగా భౌతికంగా దాడి చేశారని విజయసాయి ఆరోపించారు. ఈ ఘటన జగన్‌కు తెలిసినా తగిన విధంగా స్పందించలేదని, ప్రేక్షకపాత్ర వహించారని పేర్కొన్నారు. పార్టీ కార్యక్రమంలోనే తనపై జరిగిన ఈ ఘటన తన ఆత్మాభిమానాన్ని తీవ్రంగా దెబ్బతీసిందని చెప్పారు. అక్కడ ఉన్న పార్టీ నాయకులు ఈ పరిణామాన్ని చూశారని తెలిపారు. ఆ తర్వాత తనపై వ్యవస్థీకృతంగా చర్యలు మొదలయ్యాయని విజయసాయి అభిప్రాయపడ్డారు. 2022లో ఎమ్మెల్యేలు, ఎంపీలు, సమన్వయకర్తల సమావేశంలో తనను అవమానకరంగా మాట్లాడారని ఆరోపించారు. తన వయస్సును ప్రస్తావిస్తూ అవమానించే విధంగా వ్యాఖ్యలు చేశారని చెప్పారు. అనంతరం అనుబంధ సంఘాల ఇన్‌చార్జి బాధ్యతల నుంచి తనను తప్పించారని తెలిపారు. గుంటూరు జిల్లా నుంచి తిరుపతి జిల్లా వరకు తనకు అప్పగించిన ఇన్‌చార్జి బాధ్యతలు ఒక్కొక్కటిగా తొలగించారని వివరించారు. చివరకు కోర్ కమిటీ నుంచి కూడా తనను తప్పించారని చెప్పారు. తనను పూర్తిగా పక్కన పెట్టే ప్రక్రియలో కోటరీ విజయం సాధించిందని విజయసాయి ఆరోపించారు. అయితే ఇంత జరిగినా తాను జగన్‌పై బహిరంగ విమర్శలు చేయలేదని చెప్పారు. రెండు సంవత్సరాల పాటు నోరు విప్పకుండా ఉన్నానని, పార్టీకి నష్టం కలగకూడదనే ఉద్దేశంతో మౌనం పాటించానని తెలిపారు. తనను బయటకు పంపేందుకు పరిస్థితులు సృష్టించిన తర్వాత ఇప్పుడు తానే పార్టీకి నమ్మకద్రోహం చేశానన్న ప్రచారం చేయడం సరికాదని అన్నారు. తాను పార్టీని వీడటానికి ముందు కూడా తన ఆత్మగౌరవాన్ని కాపాడుకునేందుకు చాలాసార్లు ప్రయత్నించానని చెప్పారు. తనకు పదవి కంటే గౌరవమే ముఖ్యమని ఈ సందర్భంగా విజయసాయి స్పష్టం చేశారు.

## కోటరీ రాజకీయాలపై నేరుగా దాడి

తనపై వచ్చిన "నమ్మకద్రోహి" విమర్శలకు విజయసాయి రెడ్డి తన లేఖలో ఘాటైన సమాధానం ఇచ్చారు. నమ్మకద్రోహం చేయాలనుకున్న వ్యక్తినైతే గతంలోనే కాంగ్రెస్‌తో సంధి చేసుకుని కేసుల నుంచి బయటపడే మార్గం ఎంచుకునేవాడినని ఆయన పేర్కొన్నారు. జగన్‌తో పాటు తన పేరును కూడా సీబీఐ, ఈడీ కేసుల్లో చేర్చిన విషయాన్ని గుర్తుచేశారు. జగన్ 16 నెలలు జైలులో ఉంటే తాను 15 నెలలు జైలులో ఉన్నానని చెప్పారు. అలాంటి సమయంలో కూడా జగన్‌ను విడిచిపెట్టకుండా ఆయనతోనే ఉన్నానని తెలిపారు. నమ్మకద్రోహం చేయాలనుకున్న వ్యక్తి అయితే అప్పుడే అప్రూవర్‌గా మారేవాడినని వ్యాఖ్యానించారు. 2024 ఎన్నికల తర్వాత తనకు సంబంధం లేదని భావిస్తున్న లిక్కర్ స్కామ్‌లో తనను ఎ5గా చేర్చారని, కాకినాడ సీపోర్టు కేసులో ఎ2గా చేర్చారని కూడా ప్రస్తావించారు. తనపై కేసులు, ఆరోపణలు కొనసాగుతున్నా జగన్‌ను వదిలిపెట్టలేదని తన లేఖలో స్పష్టం చేశారు. రెండున్నర ఏళ్ల టీడీపీ పాలనలో "సకల శాఖల మంత్రి" పేరు మాత్రం ఇంతవరకు ఏ చార్జిషీట్ లోనూ లేదన్న సాయిరెడ్డి... జగన్‌కి వెన్నుపోటు పొడుస్తూ, ఆయనకు తెలియకుండా టీడీపీతో కలిసి ఎలా పని చేయాలో, ఏ కేసులూ లేకుండా ఎలా చేసుకోవాలో అక్కడ ఉన్న "కోటరీ నాయకుడు"కి తెలిసినంత తనకు తెలియదంటూ బాంబు పేల్చాడు. తాను ఏనాడూ అలాంటి నమ్మకద్రోహం పనులు చేయలేదన్నారు.

## సజ్జల గ్రిప్‌లో పార్టీకి కష్టకాలమన్న సాయిరెడ్డి

ఒక పెద్దిరెడ్డి, ఒక బొత్స, ఒక వై.వి. సుబ్బారెడ్డి, ఒక మిథున్ రెడ్డి, ఒక సాయిరెడ్డి అందరూ రీజినల్ కోఆర్డినేటర్స్‌గా, సజ్జలను రాష్ట్ర పార్టీ స్టేట్ కోఆర్డినేటర్‌గా మమ్మల్ని మానిటర్ చేయాలని, మేమంతా ఆయనకు రిపోర్ట్ చేయాలన్న ఆదేశాలు మిగతా నాయకులకు ఆమోదయోగ్యమో గానీ తనకు కాదన్నారు. అందుకే ఆత్మగౌరవాన్ని చంపుకుని పని చేయలేక నాలుగేళ్ల రాజ్యసభ పదవీకాలాన్ని వదులుకొని, వైసీపీ గుర్తుపై ఎన్నికైనందుకు నైతిక సూత్రాన్ని పాటిస్తూ రాజీనామా చేశానన్నారు. జగన్‌ను నమ్మి పనిచేసే సీనియర్ నాయకులు, కార్యకర్తలు ఈ పరిస్థితిపై ఆలోచించుకోవాలని సూచించారు. జగన్‌కు తెలియకుండా పార్టీ వ్యవహారాలను కొందరు తమ చేతుల్లోకి తీసుకున్నారనే భావనను విజయసాయి వ్యక్తం చేశారు. అప్పట్లో ప్రభుత్వాన్ని, ఇప్పుడు పార్టీని కబ్జా చేసి జగన్‌ను మోసం చేసే కోవర్ట్ రాజకీయాలు తనకు చేతకావని ఘాటుగా వ్యాఖ్యానించారు. తాను నేరుగా ప్రజల్లోకి వెళ్లి ప్రజాస్వామ్యబద్ధంగా రాజకీయ పోరాటం చేస్తానని చెప్పారు. పార్టీ పెట్టే నిర్ణయం కూడా అదే ఉద్దేశంతో తీసుకున్నదని తెలిపారు. తన రాజకీయ భవిష్యత్తు కోసం ఎవరినీ వెనుక నుంచి దెబ్బతీయడం తన విధానం కాదని స్పష్టం చేశారు. జగన్‌ని తాను రెండేళ్లు నోరు తెరచి ఒక్క మాట మాట్లాడలేదన్న ఆయన.. కోటరీ కారణంగా జరిగిన అవమానాలతో బయటకు వచ్చా అని పదేపదే చెప్పారు. అయినా, అదే కోటరీ వారు.. ఈ రోజు నేను పార్టీ పెడతున్నానంటే విమర్శిస్తున్నారని దుయ్యబట్టారు.





## రాజ్యసభ పదవికి ఎందుకు రాజీనామా?

విజయసాయి రెడ్డి పార్టీ నుంచి బయటకు రావడంలో మరో కీలక అంశంగా తన రాజ్యసభ పదవిని ప్రస్తావించారు. ఇంకా నాలుగేళ్ల పదవీకాలం ఉన్నప్పటికీ రాజ్యసభ సభ్యత్వాన్ని వదులుకున్నానని ఆయన తెలిపారు. పదవి కోసం కొనసాగాలనుకుంటే సజ్జల ఆధిపత్యాన్ని భరించి పార్టీలో ఉండే అవకాశం తనకు ఉందని, అయితే ఆత్మగౌరవాన్ని చంపుకుని కొనసాగడం తనకు సాధ్యం కాలేదని చెప్పారు. వైసీపీ గుర్తుపై ఎన్నికైనందున నైతిక సూత్రాలను పాటిస్తూ రాజీనామా చేశానని వివరించారు. పార్టీ నుంచి బయటకు వచ్చిన తర్వాత తనపై విమర్శలు పెరిగాయని, ముఖ్యంగా కొత్త పార్టీ ఏర్పాటు చేస్తానని ప్రకటించిన తర్వాత కోటరీ మరింతగా దాడి చేస్తోందని ఆరోపించారు. తాను జగన్‌పై రెండేళ్లుగా బహిరంగంగా ఒక్క మాట కూడా మాట్లాడలేదని మరోసారి స్పష్టం చేశారు. తనపై జరిగిన అవమానాల కారణంగానే బయటకు వచ్చానని ఎన్నోసార్లు చెప్పినా, ఇప్పుడు తనను నమ్మకద్రోహిగా చిత్రీకరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జగన్‌తో తనకు వ్యక్తిగతంగా ఉన్న అనుబంధాన్ని రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగించుకోలేదని చెప్పారు. పార్టీ కోసం పనిచేసిన సమయంలో తనకు అప్పగించిన బాధ్యతలను నిర్వర్తించానని వివరించారు. ఢిల్లీలో జగన్ ఆదేశాల మేరకు పనిచేసిన విషయాన్ని గుర్తుచేశారు. తనకు అప్పగించిన బాధ్యతలు తొలగించినా, కోర్ కమిటీ నుంచి పక్కన పెట్టినా పార్టీపై విమర్శలు చేయకుండా ఉన్నానని తెలిపారు. అయితే ఒక దశకు వచ్చిన తర్వాత ఇక మౌనంగా ఉండటం సాధ్యం కాలేదని చెప్పారు. సజ్జల ఆదేశాలకు తలవంచి రాజకీయ జీవితం కొనసాగించడం కంటే, పదవిని వదులుకోవడమే తనకు ఆమోదయోగ్యమైందని విజయసాయి స్పష్టం చేశారు. 2024 ఎన్నికల తర్వాత పరిస్థితులు మరింత దిగజారాయని, అదే తన నిర్ణయాన్ని తుది దశకు తీసుకెళ్లిందని చెప్పారు. ఇప్పుడు కొత్త పార్టీ ఏర్పాటు చేసి ప్రజల్లోకి వెళ్లేందుకు సిద్ధమవుతున్నానని ప్రకటించారు.

## జగన్‌పై నమ్మకం ఉందంటూ స్పష్టీకరణ

తన బహిరంగ లేఖ చివరలో విజయసాయి రెడ్డి మరో కీలక సందేశాన్ని ఇచ్చారు. "నేను జగన్‌కి నమ్మకద్రోహం చేయలేదు.. చేయను" అంటూ స్పష్టంగా ప్రకటించారు. తన రాజకీయ పోరాటం జగన్‌కు వ్యతిరేకంగా కాదని, తనను అవమానించిన వ్యవస్థకు వ్యతిరేకంగా అని చెప్పే ప్రయత్నం చేశారు. వైసీపీలో ఎవరు కోవర్టులుగా పనిచేస్తున్నారు, ఎవరు నిజంగా నమ్మకద్రోహం చేస్తున్నారో కార్యకర్తలు, జగన్ అభిమానులు ఆలోచించుకోవాలని సూచించారు. పార్టీపై ప్రేమతో పనిచేస్తున్న నాయకులు ప్రస్తుత పరిస్థితులను అర్థం చేసుకోవాలని కోరారు. విమర్శలు మాత్రమే ప్రజల్లోకి వెళ్తున్నాయి, అసలు కారణాలు మాత్రం బయటకు రావడం లేదని విజయసాయి అభిప్రాయపడ్డారు. తనపై వచ్చిన ప్రతి ఆరోపణకు వెంటనే స్పందించకుండా ఇంతకాలం మౌనం పాటించిన కారణం కూడా ఇదేనని తెలిపారు. ఇప్పుడు తన రాజకీయ నిర్ణయాన్ని స్పష్టంగా ప్రజల ముందుంచాల్సిన అవసరం ఏర్పడిందని చెప్పారు. పార్టీ ఏర్పాటు చేసిన తర్వాత తనపై మరిన్ని విమర్శలు రావచ్చని, అయినా తాను వెనక్కి తగ్గబోనని ఆయన వ్యాఖ్యల ద్వారా స్పష్టమవుతోంది. ప్రజాస్వామ్యబద్ధంగా నేరుగా ప్రజల్లోకి వెళ్లి రాజకీయ పోరాటం చేస్తానని విజయసాయి ప్రకటించారు. తనకు తెలిసిన విషయాలను దశలవారీగా వెల్లడిస్తానని చెప్పారు. మరో సందర్భంలో మీడియా ద్వారా మరిన్ని వాస్తవాలను ప్రజలకు తెలియజేస్తానని ప్రకటించడం రాజకీయ వర్గాల్లో ఆసక్తి పెంచింది. ముఖ్యంగా సజ్జల ఆధిపత్యం, జగన్‌తో తన సంబంధాల్లో వచ్చిన మార్పులు, 2022 తర్వాత తనపై జరిగిన పరిణామాలు, 2024 ఎన్నికల అనంతరం తీసుకున్న నిర్ణయాలపై మరిన్ని వివరాలు బయటకు రావచ్చనే చర్చ మొదలైంది. మొత్తంగా విజయసాయి రెడ్డి లేఖ వైసీపీ అంతర్గత అధికార సమీకరణాలపై, సజ్జల పాత్రపై, జగన్‌తో తన సంబంధాలపై, తన పార్టీ వీడే నిర్ణయంపై సమగ్ర వివరణగా కనిపిస్తోంది. తనపై వచ్చిన నమ్మకద్రోహి ముద్రను తిప్పికొడుతూ, కొత్త రాజకీయ ప్రయాణానికి సిద్ధమవుతున్నట్లు ఆయన ఈ లేఖ ద్వారా స్పష్టమైన సంకేతం ఇచ్చారు.

## ఇంకా చాలా ఉంది!

### వైసీపీలో సజ్జలే నంబర్ వన్?

వైసీపీలో ప్రస్తుతం జగన్ నంబర్ 2, సజ్జల నంబర్ 1గా వ్యవహరిస్తున్నారని విజయసాయి రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. సజ్జల ఆదేశాలకు తలవంచి పనిచేయడం తనకు సాధ్యం కాదని స్పష్టం చేశారు. నమస్కారాలు, సాష్టాంగాలు, దండాలు పెట్టి పార్టీలో కొనసాగలేనని చెబుతూ, సజ్జల ఆధిపత్యమే తన అసంతృప్తికి ప్రధాన కారణమని లేఖలో పేర్కొన్నారు.

### కేసులు నాపైనే.. కోటరీపై విజయసాయి ప్రశ్నలు

2024 ఎన్నికల తర్వాత తనకు సంబంధం లేని లిక్కర్ స్కామ్‌లో ఎ5గా, కాకినాడ సీపోర్టు కేసులో ఎ2గా చేర్చారని విజయసాయి రెడ్డి తెలిపారు. రెండున్నరేళ్ల టీడీపీ పాలనలో "సకల శాఖల మంత్రి" పేరుపై ఇప్పటివరకు ఎలాంటి చార్జిషీట్ లేదని వ్యాఖ్యానించారు. జగన్‌కు వెన్నుపోటు పొడుస్తూ, ఆయనకు తెలియకుండా టీడీపీతో కలిసి పనిచేసే విధానం తనకు తెలియదని, తాను ఏనాడూ నమ్మకద్రోహం చేయలేదని స్పష్టం చేశారు.

### 2020 తర్వాతే అసలు విభేదాలు

2020 వరకు జగన్ దృష్టిలో తన మాటకు ఎంతో విలువ ఉండేదని విజయసాయి తెలిపారు. అదే కొందరికి కంటగింపుగా మారిందని ఆరోపించారు. తాను ఎప్పుడూ కోటరీలో భాగం కాలేదని, ఢిల్లీలో జగన్ ఆదేశాల మేరకు పనిచేశానని చెప్పారు. తాను ఢిల్లీలో ఉన్న సమయంలో సజ్జల జగన్‌కు దగ్గరగా ఉంటూ తనను రాజకీయంగా పక్కకు నెట్టే ప్రయత్నాలు చేశారని ఆరోపించారు.

### 74 అవమానాలు.. ప్లీనరీ ఘటన

తనపై జరిగిన అవమానాలు మొత్తం 74 ఉన్నాయని విజయసాయి రెడ్డి వెల్లడించారు. 2022 మంగళగిరి ప్లీనరీలో సజ్జల తనపై భౌతికంగా దాడి చేశారని ఆరోపించారు. ఈ విషయం జగన్‌కు తెలిసినా స్పందించలేదని పేర్కొన్నారు. అనంతరం అనుబంధ సంఘాల ఇన్‌చార్జి బాధ్యతలతో పాటు గుంటూరు నుంచి తిరుపతి వరకు ఇన్‌చార్జి బాధ్యతలు తొలగించారని, చివరకు కోర్ కమిటీ నుంచి కూడా తప్పించారని తెలిపారు.

### పదవి వదిలినా.. నమ్మకద్రోహం చేయలేదు

ఇంకా నాలుగేళ్ల రాజ్యసభ పదవీకాలం ఉన్నప్పటికీ ఆత్మగౌరవం కోసం పదవిని వదులుకున్నానని విజయసాయి చెప్పారు. 2024 ఎన్నికల తర్వాత పరిస్థితులు మరింత తీవ్రంగా మారడంతో వైసీపీకి, రాజ్యసభ సభ్యత్వానికి రాజీనామా చేశానని తెలిపారు. జగన్‌కు నమ్మకద్రోహం చేయలేదని, భవిష్యత్తులో కూడా చేయబోనని స్పష్టం చేశారు. పార్టీ కోసం పనిచేసిన తన గతాన్ని గుర్తించాలని కోరారు.

# శ్రీలంక నుంచి రాగానే ఫిట్‌నెస్ టెస్ట్!

## బెంగళూరుకు స్టార్ క్రికెటర్ల పరుగులు

శ్రీలంకతో రెండు టెస్టుల సిరీస్ ముగిసిన 48 గంటల్లోనే టీమిండియా స్టార్ క్రికెటర్లను బీసీసీఐ బెంగళూరుకు పిలిపించింది. కొత్త సీజన్‌కు సిద్ధమయ్యే క్రమంలో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో శనివారం ఆటగాళ్లకు తప్పనిసరి ఫిట్‌నెస్ పరీక్షలు నిర్వహించారు. రవీంద్ర జడేజా, రిషభ్ పంత్, యశస్వి జైస్వాల్‌తో పాటు టీ20 కెప్టెన్ శ్రేయస్ అయ్యర్, రింకూ సింగ్, సంజూ శాంసన్, రుతురాజ్ గైక్వాడ్ తదితరులు పరీక్షల్లో పాల్గొన్నారు. బ్రోంకో టెస్ట్, 2కే రన్, యోయో టెస్ట్‌తో పాటు వికెట్ల మధ్య పరుగు వంటి క్రికెట్ ప్రత్యేక డ్రిల్స్ నిర్వహించారు. బ్రోంకో టెస్ట్‌లో 1200 మీటర్లను 5.30 నిమిషాల్లో పూర్తి చేయాలి. యోయో టెస్ట్‌లో 16.5 ప్రమాణం, 2కే రన్‌ను 10 నిమిషాల్లో పూర్తి చేయడం లక్ష్యం. పునరావాసంలో ఉన్న జస్ప్రీత్ బుమ్రా, హార్దిక్ పాండ్యా, నితీశ్ కుమార్ రెడ్డి పూర్తిగా ఫిట్ అయిన తర్వాతే పరీక్షలకు హాజరవుతారు. శ్రీలంకలో వరుస టెస్టుల్లో బౌలింగ్ చేసిన మహ్మద్ సిరాజ్, ప్రసిద్ధ్ కృష్ణకు తాత్కాలిక మినహాయింపు ఇచ్చారు. సెప్టెంబర్‌లో అఫ్గానిస్థాన్‌తో మూడు టీ20ల సిరీస్‌తో భారత్ సీజన్ మొదలుకానుండగా, జపాన్ ఆసియా క్రీడలు, వెస్టిండీస్ సిరీస్, ఆస్ట్రేలియాఏతో భారత్ఏ సిరీస్ వరుసగా ఉన్నాయి.







# సెకండ్ గ్రేడ్ జట్టులా ఉంది

### పాక్‌పై వాన్ షాకింగ్ కామెంట్స్

ఇంగ్లండ్‌తో టెస్టు సిరీస్‌లో పాకిస్థాన్ దారుణ ప్రదర్శనపై మాజీ కెప్టెన్ మైకేల్ వాన్ తీవ్ర విమర్శలు చేశాడు. లార్డ్స్‌లో రెండో టెస్టు తొలి ఇన్నింగ్స్‌లో పాక్ కేవలం 110 పరుగులకే కుప్పకూలడంతో సోషల్ మీడియాలోనూ ఎద్దేవా మొదలైంది. ఇప్పటికే తొలి టెస్టులో ఇన్నింగ్స్ 103 పరుగుల తేడాతో ఓడిన బాబర్ ఆజమ్ బృందం.. రెండో టెస్టులోనూ అదే వైఫల్యాన్ని కొనసాగిస్తోంది. మూడో రోజు ఆటకు ముందు ఇంగ్లండ్‌కు 261 పరుగుల భారీ ఆధిక్యం లభించింది. ఈ పరిస్థితిపై స్పందించిన వాన్.. పాకిస్థాన్ జట్టును రెండో డివిజన్ కౌంటీ జట్టుతో పోల్చాడు. ముఖ్యంగా పాక్ బ్యాటింగ్ లైనప్‌పై ఘాటు వ్యాఖ్యలు చేశాడు. "ఇంగ్లండ్ బౌలర్లకు అసలు సవాలే ఎదురుకావడం లేదు. చాలా కాలంగా నేను చూసిన అత్యంత సులభమైన బ్యాటింగ్ లైనప్ ఇదే" అని వాన్ వ్యాఖ్యానించాడు. పాక్ బ్యాటర్లు భారీ స్కోర్లు చేసే స్థితిలో లేరని, అందుకే ఇంగ్లండ్ బౌలర్లు వికెట్ల కోసం వరుస కడుతున్నారని అన్నాడు. ఎలాంటి బ్యాటర్ తమను దెబ్బతీయలేడన్న నమ్మకంతో ఇంగ్లండ్ బౌలర్లు ప్రతి స్పెల్‌లో పూర్తి శక్తి పెడుతున్నారని వాన్ పేర్కొన్నాడు.

# సచిన్, లారా సరసన అతడే!

## బాయ్‌కాట్ సంచలన వ్యాఖ్యలు




ఇంగ్లండ్ స్టార్ బ్యాటర్ హ్యారీ బ్రూక్‌లో సచిన్ టెండూల్కర్, బ్రయాన్ లారా స్థాయి ప్రతిభ ఉందని మాజీ కెప్టెన్ సర్ జెఫ్రీ బాయ్‌కాట్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ప్రస్తుతం ప్రపంచ నంబర్‌వన్ టెస్టు బ్యాటర్‌గా ఉన్న బ్రూక్ తన అసాధారణ ప్రతిభకు తగ్గ స్థాయిలో ఆడటం లేదని ఆయన అభిప్రాయపడ్డారు. టెస్టు క్రికెట్‌లో ఏకాగ్రతను మెరుగుపరుచుకునేందుకు సలహా ఇస్తానని గతంలో బ్రూక్‌కు తన నంబర్ ఇచ్చినా.. అతడి నుంచి ఎలాంటి స్పందన రాలేదని బాయ్‌కాట్ వెల్లడించారు. "అతడిలో నేను చాలా కాలంగా చూడని అద్భుతమైన ప్రతిభ ఉంది. టైమింగ్, షాట్ మేకింగ్, పొడవైన రీచ్ అతడి బలం. ఆలోచనలో మెరుగైతే లారా, సచిన్ స్థాయికి వెళ్లగలడు" అని పేర్కొన్నారు. అయితే ప్రతి బంతినీ దూకుడుగా ఆడే ప్రయత్నంలో బ్రూక్ తరచూ అనవసరమైన షాట్లకు వికెట్ కోల్పోతున్నాడని విమర్శించారు. పాకిస్థాన్‌తో హెడ్డింగ్లీలో 91 పరుగులు చేసిన బ్రూక్.. లార్డ్స్ టెస్టులో 15 పరుగులకే ఔటయ్యాడు. "అతడి ప్రతిభను పూర్తిగా ఉపయోగించుకుంటే క్రికెట్‌లో అత్యున్నత స్థాయిని అందుకోగలడు" అని బాయ్‌కాట్ స్పష్టం చేశారు.



# 30 ఓవరలోనే పతనం ఎందుకు?

## పాక్ బ్యాటింగ్‌పై కోచ్ సర్ఫరాజ్ ఫైర్

కోచ్ సర్ఫరాజ్ అహ్మద్ మొత్తం పాకిస్థాన్ బ్యాటింగ్ యూనిట్‌పై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇంగ్లండ్‌తో లార్డ్స్‌లో జరుగుతున్న రెండో టెస్టులో పాకిస్థాన్ బ్యాటర్లు మరోసారి ఘోరంగా విఫలమయ్యారు. ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్‌లో 290 పరుగులు చేయగా, పాకిస్థాన్ కేవలం 110 పరుగులకే ఆలౌటైంది. ఓపెనర్ అజాన్ అవైస్ 46 పరుగులతో టాప్ స్కోరర్‌గా నిలిచాడు. సౌద్ షకీల్ 16 పరుగులు చేయగా, మిగతా బ్యాటర్లు పెద్దగా ప్రభావం చూపలేకపోయారు. ఇంగ్లండ్ పేసర్ ఒల్లీ రాబిన్సన్ 13 ఓవర్లలో 11 పరుగులకే 4 వికెట్లు పడగొట్టి పాక్ పతనాన్ని శాసించాడు. "బ్యాటింగ్ మా ప్రధాన సమస్య. రెండు టెస్టుల్లోనూ సరిగా బ్యాటింగ్ చేయలేదు. 30కి పైగా ఓవర్లు ఆడకుండానే వికెట్లు కోల్పోతున్నాం" అని సర్ఫరాజ్ ఆవేదన వ్యక్తం చేశారు. ఇంగ్లండ్ పరిస్థితులు బ్యాటర్లకు కఠినంగా ఉన్నా, క్రీజులో కొంతసేపు నిలబడితే పరుగులు చేసే అవకాశం ఉంటుందని చెప్పారు. తొలి 30-40 బంతులను జాగ్రత్తగా ఎదుర్కోవాల్సిన అవసరం ఉందన్నారు. అయినా మ్యాచ్‌పై ఆశలు వదులుకోలేదని, ఇంగ్లండ్‌ను త్వరగా ఆలౌట్ చేసి 300-350 పరుగుల లక్ష్యాన్ని ఛేదిస్తే పాకిస్థాన్‌కు అవకాశం ఉంటుందని సర్ఫరాజ్ పేర్కొన్నారు. ఇప్పటికే తొలి టెస్టును ఇన్నింగ్స్ 103 పరుగుల తేడాతో కోల్పోయిన పాక్‌కు ఈ మ్యాచ్‌లోనూ గట్టి ఎదురుదెబ్బ తగిలింది.

# ప్యారడైజ్ నుంచి యెష నాగుల కట్టమీద పాట విడుదల

నేచురల్ స్టార్ నాని, టాలెంటెడ్ డైరెక్టర్ శ్రీకాంత్ ఓదెల క్రేజీ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న మోస్ట్ అంటెసిపేటెడ్ పాన్ ఇండియా మూవీ 'ది ప్యారడైజ' నుంచి మేకర్స్ క్రేజీ అప్‌డేట్‌ను అందించారు. ఈ చిత్రం నుంచి రెండో సింగిల్‌గా మోస్ట్ పాపులర్ ఫోక్ సాంగ్ అయిన 'యెష నాగుల కట్ట మీద' పాటను డిజిటల్ వేదికగా విడుదల చేశారు. తెలంగాణ నేటివిటీని ప్రతిబింబించేలా సాగే ఈ జానపద గీతాన్ని సినిమాలో మరింత మాస్ వైబ్‌తో రీమిక్స్ వెర్షన్‌గా తెరకెక్కించారు. ఇప్పటికే సోషల్ మీడియాలోనూ, ప్రజల నోళ్లలోనూ నానుతున్న ఈ పాటకు అనిరుధ్ రవిచందర్ అందించిన రాకింగ్ మాస్ బీట్స్ ప్రధాన ఆకర్షణగా నిలవనున్నాయి. 'దసరా' బ్లాక్‌బస్టర్ తర్వాత నానితో పాటు తెరపై ఈ పాటకు రాబోయే మాస్ స్టెప్స్ సినిమాపై అంచనాలను తారాస్థాయికి చేర్చుతున్నాయి. ఈ క్యాచీ సాంగ్‌కు కాసర్ల శ్యామ్ సాహిత్యాన్ని అందించగా, జంగి రెడ్డి మరియు సింగర్ ప్రభ తమ శక్తివంతమైన గాత్రంతో ప్రాణం పోశారు. ఎస్.ఎల్.వి. సినిమాస్ బ్యానర్‌పై సుధాకర్ చెరుకూరి అత్యంత భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్న ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా సెప్టెంబర్ 24, 2026న గ్రాండ్‌గా ప్రేక్షకుల ముందుకు రానుంది.






# మహేంద్రగిరి వారాహి ట్రైలర్ విడుదల

టాలీవుడ్ నటుడు సుమంత్ హీరోగా, సంతోష్ జాగర్లపూడి దర్శకత్వంలో తెరకెక్కుతున్న డివోషనల్ మిస్టరీ థ్రిల్లర్ 'మహేంద్రగిరి వారాహి' ఈ సినిమాకు సంబంధించిన థియేట్రికల్ ట్రైలర్‌ను శుక్రవారం చిత్రబృందం విడుదల చేసిన సంగతి తెలిసిందే. అయితే ఈ ట్రైలర్ సోషల్ మీడియాలో వ్యూస్‌తో దూసుకుపోతుంది. ఇక రాజశ్యామల ఎంటర్‌టైన్‌మెంట్స్, బ్రిడ్జ్ ఫిలిమ్స్ బ్యానర్లపై లక్ష్మణ్, కలిపు మధు సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్ర ట్రైలర్‌ను ప్రముఖ డైరెక్టర్ వెంకీ అట్లూరి ముఖ్య అతిథిగా విచ్చేసి ఆవిష్కరించారు. పరమశివుడి ఆజ్ఞతో మహేంద్రగిరిలో కొలువుదీరిన గ్రామదేవత 'వారాహి మాత' నేపథ్యంతో ఈ కథ సాగుతుంది. మహేంద్రగిరి రాజకుటుంబానికి చెందిన వారు గత 150 ఏళ్లుగా అనుమానాస్పద స్థితిలో వరుసగా మరణిస్తుండటం, ఇదంతా అమ్మవారి శాపం వల్లే జరుగుతోందనే నమ్మకం చుట్టూ ఈ ట్రైలర్ ఆద్యంతం ఉత్కంఠను రేకెత్తిస్తోంది. ఆ రహస్యాన్ని ఛేదించేందుకు హీరో సాహసించే తీరు సినిమాపై ప్రేక్షకుల్లో ఆసక్తిని పెంచుతోంది. ఈ చిత్రంలో వారాహి మాతగా నటి ఐశ్వర్య రాజేష్ అలరించనుండగా, 'స్టార్ బాయ' సిద్ధు జొన్నలగడ్డ ఒక కీలక పాత్రలో ట్రైలర్‌లో సర్‌ప్రైజ్ ఎంట్రీ ఇచ్చి అంచనాలను అమాంతం పెంచేశారు. వీరితో పాటు మీనాక్షి గోస్వామి, మాళవిక నాయర్, బ్రహ్మానందం, వెన్నెల కిశోర్, రాజీవ్ కనకాల తదితరులు ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు. అనూప్ రూబెన్స్ సంగీతం అందిస్తున్న ఈ సోషియో `ఫాంటసీ థ్రిల్లర్‌ను ప్రపంచవ్యాప్తంగా సెప్టెంబర్ 11, 2026న గ్రాండ్‌గా విడుదల చేయనున్నారు. వారాహికి ఎదురెళ్లి ఈ శాపాన్ని తప్పిస్తాను' అంటున్నారు సుమంత్. మహేంద్రగిరి రాజ వంశస్థులకు వారాహి అమ్మవారి శాపం ఎలా తగిలింది? అందుకు కారణం ఏంటి? మరి అన్నట్లుగానే ఆ శాపం ఏంటో కథానాయకుడు కనుగొన్నాడా? శాప విమోచనకు ఏం చేశాడు? అన్నది తెలియాలంటే 'మహేంద్రగిరి వారాహి' చూడాల్సిందే. సుమంత్ హీరోగా దర్శకుడు సంతోశ్ జాగర్లపూడి తెరకెక్కించిన సోషియో ఫాంటసీ చిత్రమిది. ఐశ్వర్య రాజేశ్, మాళవికా నాయర్, తదితరులు కీలక పాత్రలు పోషించారు. ఈ మూవీ సెప్టెంబరు 11న విడుదల కానుంది. ఈ సందర్భంగా శుక్రవారం ట్రైలర్ విడుదలైంది. ఆద్యంతం థ్రిల్ పంచేలా మూవీని తీర్చిదిద్దినట్లు ప్రచార చిత్రం చూస్తే అర్థమవుతోంది.




# ఇరుముడి నెట్‌ఫ్లిక్స్ లో స్ట్రీమింగ్‌కు రెడీ

మాస్ మహారాజా రవితేజ హీరోగా, ప్రతిభావంతుడైన దర్శకుడు శివ నిర్వాణ దర్శకత్వంలో తెరకెక్కిన హార్ట్ టచింగ్ బ్లాక్‌బస్టర్ చిత్రం 'ఇరుముడి'. ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ అత్యున్నత ప్రమాణాలతో నిర్మించిన ఈ చిత్రం ఆగస్ట్ 21న ప్రేక్షకుల ముందుకు వచ్చి అనూహ్య విజయాన్ని సొంతం చేసుకుంది. మొదటి రోజు నుంచే అద్భుతమైన పాజిటివ్ టాక్‌తో బాక్సాఫీస్ వద్ద రికార్డు స్థాయి కలెక్షన్లతో దూసుకుపోతోంది. రవితేజ కెరీర్‌లోనే ప్రత్యేకమైన చిత్రంగా నిలిచిన 'ఇరుముడి', భావోద్వేగాలతో కూడిన కంటెంట్‌తో అన్ని వర్గాల ప్రేక్షకులను థియేటర్లకు రప్పిస్తూ ఘన విజయంతో సక్సెస్‌ఫుల్‌గా రన్ అవుతోంది. పాన్`ఇండియా స్థాయిలో విడుదలైన యశ్ 'టాక్సిక' వంటి భారీ బ్జడెట్ చిత్రం బరిలోకి దిగినప్పటికీ, 'ఇరుముడి' క్రేజ్ ఏమాత్రం తగ్గకపోవడం విశేషం. ఆ పోటీని సైతం తట్టుకుని రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు ఓవర్సీస్‌లోనూ హౌస్‌ఫుల్ బోర్డులతో స్ట్రాంగ్ కలెక్షన్లను రాబడుతోంది. రవితేజ మార్క్ ఎనర్జీతో పాటు త్రినాథ్ పాత్రలో ఆయన పండించిన ఎమోషన్స్, శివ నిర్వాణ టేకింగ్, జీవీ ప్రకాశ్ సంగీతం సినిమా విజయానికి ప్రధాన బలంగా నిలిచాయి. థియేటర్లలో ఇంకా కలెక్షన్ల సునామీ కొనసాగుతున్న తరుణంలోనే, ఈ చిత్ర డిజిటల్ స్ట్రీమింగ్ హక్కులకు సంబంధించిన ఆసక్తికరమైన సమాచారం బయటకు వచ్చింది. తాజా సమాచారం ప్రకారం, ప్రముఖ దిగ్గజ ఓటీటీ ప్లాట్‌ఫామ్ 'నెట్‌ప్లిక్స' ఈ చిత్ర డిజిటల్ రైట్స్‌ను భారీ ఫ్యాన్సీ ధరకు దక్కించుకుంది. థియేట్రికల్ రన్ ముగిసే సమయానికి, అంటే సెప్టెంబర్ 18 నుంచి 'ఇరుముడి' చిత్రాన్ని నెట్‌ప్లిక్స్‌లో అధికారికంగా స్ట్రీమింగ్ చేయనున్నట్లు తెలుస్తోంది. సినిమా విడుదలైన నాలుగు వారాల విండో తర్వాత తెలుగుతో పాటు ఇతర ప్రధాన భాషల్లో కూడా ఇది అందుబాటులోకి రానుంది.




# నాగార్జున వందో సినిమా కింగ్ 100 గ్లింప్స్ విడుదల

అక్కినేని అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న నాగార్జున కెరీర్‌లోని ప్రతిష్టాత్మక 100వ సినిమా సందడి మొదలైంది. 'కింగ్ 100'గా ప్రచారంలో ఉన్న ఈ ల్యాండ్‌మార్క్ ప్రాజెక్ట్‌కు సంబంధించిన టైటిల్‌ని గ్లింప్స్ ద్వారా రివీల్ చేశారు. సినిమా టైటిల్‌ని 'కింగ్ 100' అని పెట్టడం గమనార్హం. అన్నపూర్ణ స్టూడియోస్ బ్యానర్ పై అక్కినేని ఫ్యామిలీ నిర్మాణంలో తమిళ దర్శకుడు రా కార్తీక్ దర్శకత్వంలో ఈ సినిమా తెరకెక్కుతుంది. నేడు నాగార్జున పుట్టిన రోజు సందర్భంగా సినిమా ఫస్ట్ గ్లింప్స్ ని రిలీజ్ చేసారు. మనుషుల్లో రెండు రకాలు.. ఒకటి డబ్బున్న వాళ్లు, మరొకటి డబ్బు లేని వాళ్లు అనే పవర్ ఫుల్ డైలాగ్‌తో నాగార్జునని పరిచయం చేశారు. గ్లింప్స్ చూస్తుంటే డబ్బు లేని ఓ పేదవాడు కసిగా ఎదిగి, మోసాలు చేస్తూ బాగా సంపాదించి కింగ్ స్థాయికి ఎలా ఎదిగాడు అనేది చిత్రంలో చాలా ఇంట్రెస్టింగ్‌గా చూపించనున్నట్టు అర్థమవుతుంది. మరోవైపు చిత్రంలో ఫాదర్ ఎమోషన్ కూడా ఉండబోతుంది అని, నాగార్జున ఇందులో ప్లాష్ బ్యాక్ లో యంగ్ వర్షన్ లో కూడా కనిపించబోతున్నట్టు అర్థమవుతుంది. చిన్న గ్లింప్స్ ఇప్పుడు సోషల్ మీడియాలో ఆసక్తిని రేపుతోంది. కేవలం కొద్ది సెకన్ల వీడియోతోనే చిత్రంపై భారీ హైప్‌ను క్రియేట్ చేయడంలో మేకర్స్ సక్సెస్ అయ్యారు. ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్‌లో మరో ప్రధాన ఆకర్షణగా నిలుస్తున్న అంశం టబు ఎంట్రీ. గతంలో నాగార్జున, టబు కలిసి నటించిన 'నిన్నే పెళ్లాడుతా', 'ఆవిడా మా ఆవిడే' వంటి సినిమాలు ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. చాలా ఏళ్ల తర్వాత ఈ హిట్ జోడీ మళ్లీ ఒకే సినిమాలో కనిపించబోతుండటంతో అభిమానుల్లో ప్రత్యేకమైన ఆసక్తి నెలకొంది. . గ్లింప్స్‌ను బట్టి చూస్తే, దర్శకుడు ఈసారి ఫీల్‌గుడ్ కథకు భిన్నంగా మిస్టరీ, యాక్షన్ అంశాలతో కూడిన కథను ఎంచుకున్నట్లు అంచనా వేస్తున్నారు. ఈ భారీ ప్రాజెక్ట్‌కు రాక్‌స్టార్ దేవిశ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తున్నారు. ఈ మూవీని డిసెంబర్ 24న విడుదల చేయనున్నట్టు గ్లింప్స్ తో తెలియజేశారు.




This newspaper is Owned and Published by GUNDEBOINA VENKANNA from 2-7-76, GURUKRUPA COMPLEX, UPPAL, MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500047. Phone Number: 9440906108.
Editor: GUNDEBOINA VENKANNA and Printed at 1-5-431/20/4, JONNABANDA, OLD ALWAL, MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500010.
PRGI REGD No.: TGBIL/26/A6717. www.rajyasamskarana.com.